www.jagritiweekly.com


సంపుటి : 75 సంచిక : 31 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ జ్యేష్ఠ శుద్ధ తదియ

22-28 మే 2023

వెల : ₹15/-




# మళ్లీ మరణ మృదంగమా?

ఎక్కడి ఉగ్రవాదమైనా మూలాలు హైదరాబాద్‌లోనే...

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక


బూరుగుల శ్యామ్‌సుందర్ గౌడ్
మహంకాళి సికింద్రాబాద్ జిల్లా
బిజేపీ అధ్యక్షులు
జె. రామకృష్ణ
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ మెంబర్
ఎస్.రాజు
బిజేపీ దళిత మోర్చా మహంకాళి
సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు
రాష్ట్ర ప్రజలకు, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు
స్వాతంత్ర్య
వీర సావర్కర్ జయంతి (మే 28)
శుభాకాంక్షలు
శ్రీమతి బి.రజని
ఎమ్.ఏ. (పొలిటికల్ సైన్స్) ఎం.బి.ఏ. (హెచ్.ఆర్.)
బీజేపీ కంటెస్టడ్ ఎంఎల్ఏ, బీజేపీ జాతీయ ఎస్సీ మోర్చా కార్యవర్గ మాజీ సభ్యురాలు
బీజేపీ మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా ఎస్.సి. మోర్చా ఉపాధ్యక్షురాలు, కంటోన్మెంట్ అసెంబ్లీ,
వార్డ్ 5, ప్లాట్ నెం.18, రవి కాలనీ, రోడ్ నెం.4, మహేంద్ర హిల్స్, సికింద్రాబాద్-500026



ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..

చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో

ఇపుడు జాగృతి వారపత్రిక

మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

రండి.. జాతీయభావాల వేదిక

జాగృతి చందాదారులుగా చేరుదాం! చేర్పిద్దాం!!

పాఠకుల విన్నపం మేరకు

జాగృతి చందా పెంపు ముందు ప్రకటించినట్లు

2023 ఏప్రిల్ 1 నుండి కాకుండా 2023 జూన్ 1 నుండి అమలులోకి వస్తుంది. కనుక ఏప్రిల్, మే మాసాలలో జాగృతి చందా కట్టేవారికి పాత రేట్లే (1 సం. రూ. 650/-, 5 సం.ల రూ. 3000/-) వర్తిస్తాయి.

ఇట్లు:
కుర్రా దుర్గారెడ్డి,
అసోసియేట్ ఎడిటర్

జూన్ 1 నుండి..

విడి ప్రతి రూ.20/-

ఒక సంవత్సర చందా రూ.850/-

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.

లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

Jagriti Bank A/c details :
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyd- 27. Ph : 9959997013. email : jagritiweeklysub@gmail.com

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |


డిజైనర్ : సిహెచ్. కుమార్

కర్ణాటక శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. వెంటనే విశ్లేషణలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ మీద ప్రేమ మాటేమో కానీ, బీజేపీ మీద పట్టలేనంత ద్వేషం ఉన్న విశ్లేషకులంతా టన్నుల కొద్దీ వాదనలను దేశం మీదకు వదిలి పెట్టారు. బీజేపీ ఓడిపోయింది, ఇదొక వాస్తవం. కానీ ప్రజాస్వామ్యంలో అసాధారణమేమీ కాదు. ఒక విశ్లేషకుడు అన్నట్టు బీజేపీ ప్రభుత్వ వ్యతిరేకతే కాంగ్రెస్‌ను గెలిపించింది. కాంగ్రెస్ ఓటింగ్ శాతం పెరిగింది. బీజేపీ కోల్పోయిన ఓటింగ్ కేవలం .2 శాతం. దీనిని గుర్తిస్తే కొన్ని భ్రమలు వీడతాయి. కాంగ్రెస్ 36 శాతం నుంచి 43కు ఓటింగ్ శాతం పెంచుకుంది. ఆ మేరకు జనతాదళ్ (సెక్యులర్) కోల్పోయింది. ఏమైనా ప్రజాతీర్పును గౌరవించడం ప్రజాస్వామిక వ్యవస్థ ధర్మం. ఇవన్నీ ఎలా ఉన్నా ఈ ఎన్నికలు ఇచ్చిన అసలు ఫలితం ఏమిటో పరిశీలించడం చాలా అవసరం.

కాంగ్రెస్ గెలుపు కన్నా, బీజేపీ ఓటమినే దేశంలో కొన్ని శక్తులు కోరుకున్నాయి. ప్రధానంగా కొన్ని ముస్లిం సంస్థలు, కొందరు ముస్లింలు అందుకు మొక్కుకున్నారు. ఒక్క రాష్ట్రంలో జాతీయ పార్టీ .2 శాతం ఓట్లు కోల్పోయిన సంగతి మరచిపోయి వారంతా పూనకం వచ్చినట్టే మోదీ హవా చల్లబడిందని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభ మసకబారిందని తీర్పు ఇచ్చారు. నిజం ఏమిటి! కర్ణాటక కమలం ఓటమిలో వారంతా చూస్తున్నది హిందూత్వ ఓటమినే. ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చిన రెండు రోజులకే సున్నీ ఉలేమా బోర్డ్ ముస్లింలకు ఉప ముఖ్యమంత్రి సహా ఐదు మంత్రి పదవులు ఇవ్వాలని హుకుం జారీ చేసింది. ఆ శాఖలు హోం, రెవెన్యూ, విద్య, ఆరోగ్యం వంటి కీలకమైనవే అయి ఉండాలి. ఉప ముఖమంత్రి మహమ్మదీయుడు అయి ఉండాలని ఎన్నికలు జరగడానికి చాలా ముందే తాము కాంగ్రెస్ చెవిన వేశామని బోర్డ్ సభ్యులు దేవ రహస్యం వెల్లడించారు. కాంగ్రెస్ 15 మంది ముస్లింలకు టిక్కెట్లు ఇస్తే 9 మంది గెలిచారు. అంతేకాదు, 72 నియోజకవర్గాలలో కాంగ్రెస్‌కు దక్కిన విజయం వెనుక ఉన్నది ముస్లింలేనని వక్ఫ్ బోర్డ్ పెద్దలు చెప్పారు. బీజేపీ రద్దు చేసిన నాలుగు శాతం రిజర్వేషన్‌ను

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ జ్యేష్ఠ శుద్ధ తదియ**

### లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
**మళ్లీ మరణమృదంగమా?**
6లో



జాతీయం
**బీజేపీకి తగ్గింది సీట్లే... ఓట్లు కాదు!**
10లో



ధారావాహిక నవల
**మహా సంకల్పం**
- చంద్రశేఖర ఆజాద్
20లో

# జాగృతి

## సంపాదకీయం

పునరుద్ధరిస్తామని చెప్పినందుకు కాంగ్రెస్‌కు ఎంతో చేశామన్నారు. కాబట్టి ముస్లింలకు కృతజ్ఞత ప్రకటించుకోవలసిన బాధ్యత కాంగ్రెస్ మీద మిగిలి ఉందని ఎలాంటి శషభిషలూ లేకుండానే చెప్పారు. ఇవన్నీ వక్ఫ్ బోర్డ్ అధ్యక్షుడు షఫీ సాది విలేకరులకు చెప్పినవే. చిత్రంగా ఈయన బీజేపీ మనిషి అని వెంటనే కాంగ్రెస్ ముద్ర వేసేసింది. అయితే సున్నీ బోర్డ్ కాంగ్రెస్‌కు ఒక వెసులుబాటు మాత్రం కల్పించింది. నెగ్గిన తొమ్మిది మంది ముస్లిం ఎమ్మెల్యేలలో ఏ పదవి ఎవరికి ఇవ్వాలో మీ ఇష్టం అంటూ దయతలచింది. ఆ మేరకు కాంగ్రెస్

## అసలు ఫలితం

సంతోషించాల్సిందే. ఎందుకంటే ఏ శాఖ ఏ ముస్లిం ఎమ్మెల్యేకి కట్టబెట్టాలో సున్నీ ఉలేమా బోర్డ్, లేదా వక్ఫ్ బోర్డ్ చెబితే బొత్తిగా బాగుండదు కదా! ఎన్నికలకు ముందే ఇవన్నీ మాట్లాడుకున్నాం కాబట్టి నెరవేర్చి తీరాలని ముస్లిం పెద్దలు అంటున్నారు. 'మేం ఉప ముఖ్యమంత్రి పదవే అడుగుతున్నాం. నిజానికి 90 లక్షల ముస్లిం జనాభా ఉన్న ఈ రాష్ట్రంలో వారికి ముఖ్యమంత్రి పదవే ఇవ్వాలి, ఇంతకు పూర్వం ఎవరూ ముఖ్యమంత్రి కాలేదు' అంటున్నారు. ఎస్‌డీపీఐ, మజ్లిస్ పార్టీలు సోదిలోకి లేకుండా పోయాయి అనుకోవడం అమాయకత్వం. అవి తమ ఓటును తాత్కాలికంగా కాంగ్రెస్‌కు బదలీ చేశాయంతే. 25 సీట్లకు పోటీ చేస్తానని మొదట చెప్పిన మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ తరువాత రెండు స్థానాలకే పరిమితమయ్యారు. దేవెగౌడ కుటుంబ పార్టీ జనతాదళ్ (సెక్యులర్) 23 మంది ముస్లింలకి టిక్కెట్లు ఇచ్చింది. ఒక్కరు కూడా నెగ్గలేదు. కాబట్టి ముస్లింలంతా గంపగుత్తగా కాంగ్రెస్‌ను అంటకాగారు. రాష్ట్రంలో 88 శాతం ముస్లింలు కాంగ్రెస్‌కు ఓటు వేశారని ఆ వర్గం నాయకులు చెప్పుకుంటున్నారు.

తమ రాష్ట్ర ఎన్నికల ఫలితాలు కన్నడ ముస్లింలలో ఇలాంటి కోర్కెకు జన్మ ఇవ్వగా, ఓ అస్సాం ముస్లిం నాయకుడికి భారీ కలకే అవకాశం ఇచ్చాయి. కర్ణాటక బీజేపీ ఓటమిలో, ఉమ్మడి పౌరస్మృతి వెనుకడుగును చూస్తున్నారాయన. ఆ చట్టాన్ని భారతదేశంలో అమలు చేయలేమన్న సంగతి బీజేపీకి తెలుసునని, కానీ తీసుకువస్తామని చెప్పడం కేవలం ఓట్ల కోసమేనని ఆలిండియా యునైటెడ్ డెమాక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే రఫీకుల్ ఇస్లామ్ రెండు రోజుల క్రితమే తేల్చి చెప్పేశారు. ఆ పార్టీ ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయలేదన్న సంగతి భారతదేశానికి కూడా తెలుసునని చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతి సహజత్వం కలిగినది కాదట. అన్ని కులాలు, వర్గాల వారి హక్కుల గురించి రాజ్యాంగంలో ఇదివరకే నిర్వచించారని కూడా చెప్పారు. కాబట్టి ఉమ్మడి పౌరస్మృతి అంటూ బీజేపీ ప్రత్యేకంగా ఏ ప్రయత్నమూ చేయనక్కరలేదని చెప్పారు. గోవా, మేఘాలయా, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం, కేరళ, తమిళనాడు, కర్ణాటక ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయలేరని అన్నారు. భారతదేశంలో అనేక కులాలు, వర్గాలు ఉన్నాయి. వివిధ మతాల వారు ఉన్నారు. కాబట్టి ఇక్కడ ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తే దేశానికి చేటేనని గడచిన అక్టోబర్‌లో కూడా రఫీకుల్ ఆక్రోశించాడు. బీజేపీ లక్ష్యం, ముస్లింలు, ఇతర మతాలవారేనని కూడా చెప్పాడు. భారతదేశ భౌగోళిక పటంలో బీజేపీ వ్యతిరేక ప్రాంతాలను ఇలా ఎత్తి చూపాడితడు.

కర్ణాటక ఫలితాలు కొత్త విషయాన్ని దేశం ముందుకు తీసుకువచ్చాయి. ఇన్నాళ్లూ కాంగ్రెస్, కమ్యూనిస్టులు, సెక్యులర్ పార్టీలు ముస్లింలకు ఏవో తాయిలాలు ఇచ్చి తమ వైపు తిప్పుకుంటూ పబ్బం గడుపుకున్నారు. ఇకపై పద్ధతి మారాలని ముస్లింలు కోరుకుంటున్నట్టు కర్ణాటక ఫలితాలు, ఆ తరువాత ఆయా ముస్లిం వర్గాలు బయటపెట్టిన కోర్కెలు చెబుతున్నాయి. ఇప్పుడు ఓట్లతో పదవులను బేరమాడే పంథాను ప్రవేశపెట్టారు. ఇదెక్కడికి దారి తీస్తుందో వెంటనే ఆలోచించడం మంచిది.

★

22 మే 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



32లో

కథ

**ప్రేమించు..**

**కలలు కనూ**

– సూరిసెట్టి వసంతకుమార్





| | | | | | |
|---|---|---|---|---|---|
| పస్తులుండండి – ప్రభువును చేరండి | – | 14 | అశాంతి మంటల్లో మణిపూర్ (జాతీయం) | – | 34 |
| 2.30 లక్షల ఉద్యోగాలేవీ? (వేదిక) | – | 16 | స్వరరాగిని పదవాహిని... (మహిళ) | – | 36 |
| ఖాన్ కొత్త గేమ్ (అంతర్జాతీయం) | – | 24 | టీ–20 క్రికెట్లో ఒకే ఒక్కడు! (క్రీడ) | – | 43 |
| అండమాన్ కారాగారంలో... (ప్రత్యేక వ్యాసం) | – | 26 | భిన్నమైన కథ, కథనాలతో గూఢచారి చిత్రాలు! (సినిమా) | – | 50 |



దక్షిణ భారతదేశానికే గర్వకారణమైన హైదరాబాద్ నగరంలో ఇటీవలనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహం ప్రతిష్టించారు. 125 అడుగుల ఎత్తయిన ప్రతిమ అది. ఆయన హైదరాబాద్‌ను భారతదేశానికి రెండవ రాజధానిగా ఊహించుకున్నారు. అందుకు సిఫారసు చేశారు కూడా. కానీ అత్యంత విషాదంగా ఈ చరిత్రాత్మక నగరం ముస్లిం మతోన్మాదానికీ, ఉగ్రవాదానికీ ప్రపంచంలోనే రెండో రాజధాని అన్న అపకీర్తిని మూటకట్టుకుంది. ముస్లిం ఛాందస ఉగ్రవాదానికి ప్రపంచ తొలి రాజధాని పాకిస్తాన్ అన్న వాస్తవాన్ని ఎవరూ విస్మరించలేరు. భూగోళం మీద ఎక్కడ ముస్లిం ఉగ్రవాదులు పేలుళ్లు జరిపినా, ఆ పేరుతో నెత్తుటికాండ జరిగినా మొదట పాకిస్తాన్ పేరు వినిపిస్తుంది. తరువాత హైదరాబాద్ పేరు వినపడుతుంది. ఆ పేలుళ్ల మూలాలు ఇక్కడ కనిపిస్తున్నాయి. ఇలా చెప్పడం బాధాకరమే అయినా ఇది చేదు నిజం. మళ్లీ ఇప్పుడు హిజ్బుత్ తహ్రీర్ అనే పాత/కొత్త అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ కదలికలు ఈ హైదరాబాద్‌లోనే సుస్పష్టంగా కనిపించాయి. నగరం ఉలిక్కి పడింది. సెక్యులర్ పార్టీల నేతలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టే ఉన్నారు. మళ్లీ లుంబిని పార్క్ రక్తపాతం, గోకుల్ చాట్ దురంతం జరుగుతాయన్న భయాలు సాధారణ ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. అధికార బీఆర్ఎస్ నేతల నోటి నుంచి మాత్రం మన హైదరాబాద్ ప్రపంచంలోనే గొప్ప నగరమన్న శుష్క వ్యాఖ్యలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. మొన్న రొహింగ్యాల గొడవ, నిన్న పాకిస్తాన్ దేశీయుల జాడ, ఇవాళ హిజ్బుత్ తహ్రీర్ కదలిక. కానీ నేతలలో మాత్రం చలనం లేదు.

### ఎక్కడి ఉగ్రవాదమైనా మూలాలు హైదరాబాద్‌లోనే

# మళ్లీ మరణమృదంగమా?

మే 9వ తేదీన వేకువన మధ్యప్రదేశ్ ఏటీఎస్ (యాంటీ టెర్రరిజం స్క్వాడ్) అధికారులు హైదరాబాద్ వచ్చి తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ (సీఐ) సెల్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. నగరంలో పలుచోట్ల తలదాచుకున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు తరలించారు. వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర పరికరాలతో పాటు భారీగా ఇస్లామిక్ జిహాదీ సాహిత్యం, ఎయిర్‌గన్లు స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు ఏటీఎస్ అధికారులు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఎస్ఐఏ) సహకారంతో భోపాల్, చింద్వాడాలో 11 మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో పట్టుబడిన ఐదుగురూ కొన్ని నెలల క్రితం భోపాల్ నుంచి వచ్చి తలదాచుకున్నట్లు సమాచారం. వారికి అందిన ప్రాథమిక సమాచారంతో నెల క్రితం నుంచే ఏటీఎస్ నిఘా పెట్టింది.

ఈ తాజా పరిణామంలో చాలా అంశాలు ఇమిడి ఉన్నాయి. అవి ఇస్లామిక్ ఉగ్రవాదం అసలు రూపాన్ని ఇంకాస్త స్పష్టంగా చూపిస్తున్నవేనని గుర్తించాలి. ఇందులో మతాంతరీకరణల కోణం ఉంది. లవ్ జిహాద్ కోణం కూడా బలంగానే ఉంది. ఇక దేశాన్ని అల్లకల్లోలం చేయడం, ఇస్లామిక్ రాజ్య స్థాపన, హింస సరేసరి. గతంలో వలె ముస్లింలలోని నిరక్షరాస్యత వారిని ఉగ్రవాదం వైపు నడుపుతున్నదనీ, వారి పేదరికం రక్తపాతం వైపు అడుగులు వేయిస్తున్నదనీ చేసే వాదనలన్నీ శుద్ధ తప్పు అని, అవి ఉదారవాదులు, కుహనా సెక్యులరిస్టులు చేసే శుష్క ప్రవచనాలనీ ఇక్కడ మరోసారి రుజువైంది. వీరిలో ఎక్కువ మంది ఉన్నత విద్యను అభ్యసించిన వారే.

ఇస్లామిక్ రాడికల్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు అందిన సమాచారంతోనే దాడులు జరిగాయి. ఇంతకీ ఇక్కడ నిఘా వ్యవస్థ ఏం చేస్తున్నదో గానీ, మధ్యప్రదేశ్ అధికారులు ఇచ్చిన సమాచారంతో వీరు అప్రమత్తమయ్యారు. అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు జరిగాయి. ఐదుగురే కాకుండా మరొక ముగ్గురిని అరెస్టు చేసే అవకాశం ఉందని మధ్యప్రదేశ్ డీజీపీయే చెప్పారు. ఈ ఐదుగురి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నప్పటికీ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు మొదట ఆధారాలేవీ దొరకలేదు. ఇండియన్ ముజాహిదిన్, లష్కర్ ఏ తాయిబా, హిజ్బుల్ ముజాహుదీన్, అల్ కాయిదా అయిపోయాయి. ఇప్పుడు వీరు పనిచేస్తున్న సంస్థ హిజ్బుత్ తహ్రీర్. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్, మరొక పట్టణం ఛింద్వాడాల్లో చిక్కిన 11 మంది ఈ గ్రూపునకు చెందినవారే. ఇది అల్ కాయిదా కంటే భయానకమైనదన్న అభిప్రాయం ఉంది. 1953లో స్థాపించిన హిజ్బుత్ తహ్రీర్ 50 దేశాల్లో వ్యాపించి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షలకు పైగా సభ్యులు ఉన్నారు. ఈ సంస్థపై యూకే, ఆసియా దేశాల్లో నిషేధం ఉన్నప్పటికీ కార్యకలాపాలు సాగిస్తోంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ఇప్పటికీ తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. అరెస్టయిన వారిలో భోపాల్ గ్యాస్ దుర్ఘటన బాధితుడి కుమారుడు మహమ్మద్ వసీం కూడా ఉన్నాడు. మధ్యప్రదేశ్ పోలీసులు పట్టుకున్న 16 మందిని భోపాల్ తరలించి ఓ రహస్య ప్రదేశంలో విచారిస్తున్నారు. హైదరాబాద్‌లో మొదట పలాయనం చిత్తగించి తరువాత దొరికిన ఉగ్రవాది సల్మాన్‌ని కూడా అక్కడికే తీసుకువెళ్లారు. దొరికిన వారిలో ఐదుగురు హిందూ యువతులను వివాహాలు చేసుకున్న సంగతి కూడా బయటపడింది. అలాగే ఇద్దరు హిందువులు మతం మార్చుకుని ఈ కుట్రలో భాగస్వాములయ్యారు. ఈ కేసులో అరెస్టయిన 16 మందిలో ఏడుగురు లవ్ జిహాద్ కేసులలో కూడా ఉన్నారని మధ్యప్రదేశ్ హోం శాఖ మంత్రి నరోత్తమ్ మిశ్రా కూడా చెప్పారు. మిశ్రా చెప్పిన వివరాల ప్రకారం ఆ ఏడుగురు కూడా మొదట హిందువులే. ఇస్లాం తీసుకున్నామని తరువాత దర్యాప్తులో చెప్పారని ఆయన అంటున్నారు. వీరేమీ చదువుకోని వారు కాదు. నిరక్షరాస్యులు కూడా కాదు. ఒక ఫార్మసీ ప్రొఫెసర్, ఒక ఇంజనీర్, కొందరు ఉపాధ్యాయులు. ఫార్మసీ చదువుకున్న ఆ ప్రొఫెసరే హైదరాబాద్‌లో ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ నడుపుతున్న వైద్య కళాశాలలో పనిచేసేవాడు. ఇతడి పేరు మహమ్మద్ సలీం. హిందువుగా ఉన్నప్పుడు పేరు సౌరభ్ రాజవైద్య. పదవీ విరమణ చేసిన ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ అశోక్ జైన్ కుమారుడు. వీరిది భోపాల్. హైదరాబాద్ నగరంలో చిక్కిన ఆరుగురిలో ముగ్గురు గతంలో భోపాల్‌లోనే ఉండేవారనీ, నాలుగేళ్ల క్రితమే వారు నగరానికి వచ్చారనీ సమాచారం. ముగ్గురు గతంలో మతమార్పిడి ద్వారా ముస్లింలుగా మారి ఇస్లాం బోధనలు సాగిస్తున్నారని కూడా పోలీసులు గుర్తించారు. ఇది విస్తుపోయే సమాచారమే.



కొన్నేళ్లుగా భారతదేశంలో దీని కార్యకలాపాలు చాపకింద నీరులా సాగుతున్నాయి. మొదట దీనిని చాలా సంస్థలు పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఇది ఐఎస్ఐఎస్ కంటే ప్రమాదకరమైనదని తరువాత తేలింది. కొంతవరకు దీని సమాచారం భారత్ వద్ద కూడా ఉంది. అది అంతర్జాతీయ నిఘా సంస్థల ద్వారా లభించిన సమాచారం. దీనికి 50 దేశాలలో సభ్యులు ఉన్న సంగతి అలా తెలిసినదే. దక్షిణ ఆసియాకు సంబంధించి దీని ప్రభావం ప్రధానంగా పాకిస్తాన్, బంగ్లాకే పరిమితమన్న భావన ఉండేది. కానీ ఇజ్రాయెల్ ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా నిరసన పేరుతో ఈ సంస్థ ఢిల్లీలోని బాట్లా హౌస్ వద్ద కార్యక్రమం నిర్వహించింది. ఇది 2010లో జరిగింది. తహ్రీర్ భారత్‌లో నిర్వహించిన కార్యక్రమంగా దీనిని మన నిఘా వర్గాలు గుర్తించాయి. అప్పుడు కొందరిని అరెస్టు చేసి ప్రశ్నించారు కూడా. అయితే హఠాత్తుగా ఈ సంస్థ సంగతి బయటపడింది. కిందటి సంవత్సరం ఫిబ్రవరిలో తమిళనాడులో జియావుద్దీన్ బఖావి అనే ఉగ్రవాది భద్రతా సిబ్బందికి దొరికిపోయాడు. అప్పుడే హిజ్బుత్ తహ్రీర్ సంస్థ




పేరు వెలుగులోకి వచ్చింది. ఆ సంస్థకు ప్రపంచ వ్యాప్తంగా సభ్యులున్నారని, ఇండియాలోనూ సానుభూతిపరులున్నారని అధికారులు గుర్తించారు. ఆ సానుభూతిపరులను గుర్తించే క్రమంలోనే మధ్యప్రదేశ్‌లోని భోపాల్, ఛింద్వారా నగరాల్లో కొందరిని పట్టుకున్నారు. ఆ సమయంలో దొరికిన సమాచారం ఆధారంగా హైదరాబాద్‌లో ఉన్న ఆరుగురిపై నిఘా పెట్టారు. ఈ సమయంలో వారి గురించి పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించిన తర్వాతే అదుపులోకి తీసుకున్నట్టు ఏటీఎస్ పోలీసులు వెల్లడించారు. కాగా కుత్బుల్లాపూర్ పరిధిలోని జగద్గిరిగుట్ట, రొడామిస్త్రీ నగర్, గాజులరామారం, దేవేందర్ నగర్, కైసర్ నగర్, సూరారం కాలనీ, సాయిబాబానగర్ ప్రాంతాలలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులు ఎక్కువ శాతం నివాసం ఉంటున్నారు. ఈ ప్రాంతంలో పోలీసుల నిఘా లేక పోవడంతోనే అసాంఘిక శక్తులు దీన్ని తమ అడ్డాగా మార్చుకుంటున్నాయని, కాబట్టి నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

హిజ్బుత్ తహ్రీర్ మీద యుకేతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి ఆసియా దేశాల్లో నిషేధం ఉన్నా దీని కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే అనుమానాలున్నాయి. ఇస్లామిక్ రాడికలిజం సాగిస్తున్నారనే అనుమానంతో తొలుత భోపాల్‌లో ఉన్న అనుమానితులపై నిఘా పెట్టిన అధికారులు వారిలో సంప్రదింపుల ఆధారంగా హైదరాబాద్‌పై కూడా దృష్టి సారించారు. 15 నెలల పాటు నిఘా సాగించారు. కానీ ఒక్కరిని కూడా అదుపులోకి తీసుకోలేదు. హెచ్చరించలేదు. అంత జాగ్రత్త పడ్డారు. ఒక్కరు చిక్కితే మిగతా వారు పరారవుతారనే ఆలోచన, వారితో లింకై ఉన్నవారి గురించి పూర్తి ఆధారాలు సేకరించడానికి కాస్త సమయం తీసుకున్నారు. ఆ తర్వాత మే 9న ముహూర్తం పెట్టి భోపాల్, ఛింద్వారా, హైదరాబాద్‌లలో ఏకకాలంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు.

ప్రధానంగా భోపాల్ కేంద్రంగా పనిచేస్తున్నప్పటికీ హైదరాబాద్‌లో దీని విస్తృతి తక్కువేమీ కాదు. నగరంలోని మల్లెపల్లి, ఆసిఫ్‌నగర్, గోల్కొండ, టోలీచౌకి ప్రాంతాల్లో నివసించిన ఆ ఆరుగురు ఉగ్రవాదులు ఇక్కడ బయాన్ పేరుతో తరచూ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు సమాచారం ఉంది. హైదరాబాద్‌లో చిక్కిన వారిలో ప్రధాన నిందితుడు మహమ్మద్ సలీం అలియాస్ సౌరభ్‌రాజ్ 2018లో ఇక్కడికి వచ్చినట్లు గుర్తించారు. ఓ వైద్య కళాశాలలో ఉద్యోగం సంపాదించి తన కుటుంబాన్ని నగరానికి తీసుకువచ్చాడు. పెద్ద స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి జనాన్ని సమీకరించేవారని, గోల్కొండలోని సలీం ఇంట్లోనే సమావేశాలు నిర్వహించేవారని మధ్యప్రదేశ్ ఏటీఎస్ పోలీసులు గుర్తించారు. ఆ సమావేశాలకు హాజరైనవారి గురించి తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు.

తక్కువ మందే అయినా ఏర్పాట్లు పెద్దగానే ఉన్నాయని దాడుల తరువాత అర్థమైంది. హైదరాబాద్‌లో ఇంటెలిజెన్స్ అధికారులు (ఐబీ), తెలంగాణ రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులతో కలిసి గోల్కొండ, టోలీచౌకీ, మల్లెపల్లి, జవహర్‌నగర్, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో వీరు తనిఖీలు నిర్వహించారు. మహమ్మద్ సలీమ్, అబ్దుల్ రెహ్మాన్, మహ్మద్ అబ్బాస్, షేక్ జునైద్, మహ్మద్ హమీద్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం పక్కా సమాచారంతో మేడ్చల్ జిల్లా జవహర్ నగర్‌లోని విఘ్నేశ్వర కాలనీలో ఉన్న సల్మాన్ నివాసంలో తనిఖీలు చేసి, ఎయిర్‌గన్‌తో పాటు పిల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తనిఖీలు చేస్తున్నారన్న సమాచారంతో సల్మాన్ పారిపోయాడు. అయితే అతణ్ని మరునాడు ఉదయం పట్టుకుని భోపాల్ తరలించారు. మినీ ఇండియాగా




# తహ్రీర్... ఎందుకు పుట్టింది?

ఇస్లామిక్ మతోన్మాద సంస్థలు, ఉగ్రవాద సంఘాలు కలుగుల నుంచి ఎలుకలు వచ్చినట్టు ఎక్కడెక్కడి నుంచో బయటకు వస్తున్నాయి. పాత వాటిని చావగొట్టి చెవులు మూస్తూ ఉంటే, కొత్త పేర్లతో మళ్లీ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయి. లేకపోతే ఎక్కడో చరిత్ర పుటలలో మారుమూల పడి ఉన్న ప్రేతాత్మల వంటి పురాతన సంస్థలకు మళ్లీ ప్రాణప్రతిష్ట చేసి కార్యకలాపాలకు సమాయత్తం చేస్తున్నారు. అలాంటిదే హిజ్బుత్ తహ్రీర్. హిజ్బుత్ తహ్రీర్ అంటే విమోచన సంస్థ. లేదా విమోచన కోసం పనిచేసే పక్షం.

హిజ్బుత్ అంతర్జాతీయ ముస్లిం రాజకీయ పక్షం. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు దీని పేరు పెద్దగా వినిపించకపోయినా ఇండోనేషియా రాజధాని జకార్తాలో తరచుగా ఇది సమావేశాలు నిర్వహించుకుంటుంది. నాటి పరిస్థితులను బట్టి 1953లో జెరూసలేంలో ఈ సంస్థ ఆవిర్భవించింది. తాకి అల్ దిన్ అల్ నభాని (1909–1977) దీనిని స్థాపించాడు. ఇతడు పాలస్తీనాకు చెందిన ఇస్లామిక్ పండితుడు. నాటి పరిస్థితులలో అంటే ఇరవయ్యో శతాబ్దం మధ్యలో ఇస్లాం దేశాలలో నెలకొన్న పరిస్థితుల కారణంగానే తహ్రీర్ సంస్థ ఏర్పాటు అవసరమైందని ఇతడు చెప్పేవాడు. 1914 నాటి మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఖలీఫా ప్రాబల్యం అంతరించడం, 1948 నాటి అరబ్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధాలు, పాలస్తీనా ఆక్రమణ వంటి

పేరుగాంచిన జవహర్ నగర్ కార్పొరేషన్లో సల్మాన్ అనే ఉగ్రవాదిని అరెస్ట్ చేశారంటూ వార్తలు రావడంతో ఆ ప్రాంతవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం యాకూబ్ అనే వ్యక్తి సుమారు 20 ఏళ్ల క్రితం జవహర్ నగర్, బాలాజీనగర్‌లోని శివాజీనగర్‌లో స్థిరపడ్డాడు. అతనికి నలుగురు కుమారుల్లో ఒకడు సలాం అలియాస్ సల్మాన్ (27). అతడు వెల్డింగ్ పనులు చేసేవాడు. ఎప్పుడూ ఎవరితో గొడవలు పడేవాడు కాదు. చెప్పిన పని చేసి వెళ్లిపోయేవాడు. మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్టు చేసిన హమీద్ జగద్గిరిగుట్టలో రహస్య జీవితం గడుపుతున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతణ్ని బయట ఎప్పుడూ చూడలేదని సమాచారం. బయటకు వెళ్లే సమయంలో ముఖం కనిపించకుండా హెల్మెట్ ధరించేవాడు. రాత్రి ఎప్పటికో వచ్చేవాడు. ఇంట్లో నలుగురు చిన్నపిల్లలు, భార్య ఉన్నా మనుషులు లేనట్టుగానే కనిపించేది. ఇంటి ముందు తలుపునకు ఎప్పుడూ తాళం వేసి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. హమీద్ వెల్డింగ్ పనిచేస్తుండేవాడని భార్య హమీదాబేగం కూడా చెప్పారు. రెండు సంవత్సరాలుగా వీరు మగ్దూంనగర్లో ఉంటున్నా పక్కంటి వారితో కూడా మాట్లాడిన దాఖలాలు లేవని చెప్పుకొంటున్నారు.

అలాగే.. పోలీసులు అదుపులోకి తీసుకున్న మరో ఉగ్రవాది మహ్మద్ సలీం అలియాస్ సౌరభ్ రాజ్ ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో ప్రొఫెసర్. అది అసదుద్దీన్ ఒవైసీది కావడం విచిత్రమే. అక్కడ ఒక విభాగానికి అధిపతిగా పనిచేస్తున్నట్లు సమాచారం. అతడికి భోపాల్‌లో ఉన్న హిజ్బుత్ తహ్రీర్ గ్రూపుతో సంబంధాలున్నట్లు మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులు గుర్తించారు. భోపాల్, ఛింద్వారాల్లో తమ చేతికి చిక్కిన 11మంది హిజ్బుత్ తహ్రీర్ గ్రూపులో కొందరు సలీంతో సంబంధాలు పెంచుకున్నారని వారికి తెలిసింది. ఒడిశాకు చెందిన అబ్దుల్ రెహ్మాన్ ప్రముఖ బహుళజాతి సంస్థ (ఎంఎన్సీ)లో క్లౌడ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. షేక్ జునైద్ పాతబస్తీలో డెంటిస్ట్. అబ్బాస్ ఆటో డ్రైవర్.

భోపాల్–హైదరాబాద్ ఉగ్రవాద కుట్ర బయటపడిన తరువాత కేంద్ర ప్రభుత్వం చురుకుగానే వ్యవహరించింది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించారు. దర్యాప్తు సందర్భంగా, దాడుల సందర్భంగా కొంత సమాచారం నిఘావర్గాలకు చిక్కింది. దీనిని బట్టి ఇది మైనారిటీలను లక్ష్యం చేసుకున్న దాడి అనడానికి వీలు లేనంత గట్టిగా ఆధారాలు లభించాయి. వారి వద్ద దొరికిన పత్రాలు, కేసెట్లు ఖలీఫా రాజ్యం గురించి ప్రస్తావించిన సంగతి బయటపడింది. కొందరు సభ్యులు సమావేశాలలో ప్రజాస్వామ్యం వద్దంటూ ఖలీఫా రాజ్యం గురించి ప్రబోధించారు. వీరి ఫోన్లలో పాకిస్తాన్ దేశీయుల నంబర్లు కూడా కొన్ని దొరికాయి.

వీరు యువకులను చేర్చుకుని రహస్యంగా తుపాకీ పేల్చడం వంటి పనులు నేర్పుతున్నట్టు కూడా బయటపడింది. ఇవన్నీ కూడా సమీపంలోని అటవీ ప్రాంతంలోనే (తెలంగాణలోనే) జరుగుతున్నట్టు కూడా బయటపడింది. దర్స్ పేరుతో జరిగే కార్యక్రమాలలో జిహాదీ సాహిత్యం పంచడం, నాయకులు ఉద్రేక పరిచే విధంగా ఉపన్యాసాలు ఇవ్వడం వంటివి కూడా చేశారని తెలిసింది. ఇందులో చేరిన యువకులు సంస్థ లక్ష్యం నెరవేరడానికి ప్రాణాలు కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని చెప్పేవారు.

తెలంగాణను, అందులోను దేశానికే గర్వ కారణంగా నిలుస్తున్న హైదరాబాద్‌ను ఉగ్రవాద చెర నుంచి తప్పించవలసిన బాధ్యతను తక్షణమే ప్రభుత్వాలు స్వీకరించాలి. నిజామాబాద్‌లో, భైంసాలో ఆ మధ్య పట్టుబడిన ఉగ్రవాద మూకల వ్యవహారాలు చూసినా దీని తక్షణ అవసరం ఏమిటో కూడా బోధపడుతుంది. ఐటీ పరిశ్రమకు, వైద్యరంగానికి గొప్ప కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌లో నగరం ఉగ్రవాద మూఠాల జాడలు ప్రగతికి దోహదపడేవి కాదు. సెక్యులర్ అని చెప్పుకునే పార్టీలు ఉగ్రవాద నిర్మూలనలో రాజకీయాలు నెరపడం సరికాదు. బుజ్జగింపుతో మైనారిటీలలో ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం నగరానికే కాదు, దేశానికి కూడా చేటు. ఈ విషయంలో బీజేపీ నాయకులు ఏం చెప్పినా అందులో హిందుత్వను చూడడం, ముస్లిం వ్యతిరేకతను చూడడం వాస్తవిక దృష్టి అనిపించుకోదు. ఉగ్రవాదానికీ మతానికీ సంబంధం లేదు. ఉగ్రవాదానికి మతం లేదు. హింసోన్మాదం మాత్రమే ఉగ్రవాదానికి ఆలంబనగా ఉంటుంది. సాహిత్య పరంగా, కళల పరంగా హైదరాబాద్‌కు ఉన్న ఖ్యాతి వేరు. ఇక్కడి ముస్లింలు ఉగ్రవాదులకు మద్దతుగా నిలిచారన్న అపకీర్తి మూట కట్టుకోవడం సరికాదు.

**జాగృతి డెస్క్**

## 2014 నుంచి ...


యాసిన్ భత్కల్

**20**14 నుంచి 2018 వరకు చూసినా హైదరాబాద్ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలు వందలలో నమోదైనాయి. అవి పెరుగుతూనే ఉన్నాయి. 2018లో మూడు, 2017లో 14, 2016లో 31, 2015లో 45, 2014లో 28 అరెస్టులు జరిగాయి. ఇండియన్ ముజాహిదీన్ నాయకుడు యాసిన్ భత్కల్ హైదరాబాద్ నుంచి తన భార్యతో మాట్లాడినట్టు నిఘా వర్గాలు కనిపెట్టాయి. అది కూడా జైలు నుంచి. డెమాస్కస్ సాయంతో తాను త్వరలోనే బయటపడతానని అతడు ఫోన్‌లో భార్యకు చెప్పాడు. బర్ధమాన్ పేలుళ్లకు సంబంధించి ఖలేదా మహ్మద్ అనే మైన్మార్ జాతీయుడిని 2014లో ఇక్కడే అరెస్టుచేశారు. ఇతడిని హైదరాబాద్‌లోనే జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. అలాగే సిమీ కార్యకర్తలు ఎందరినో ఇక్కడే అరెస్టు చేశారు. ఈ జాబితా చాలా పెద్దది. ★

పరిణామాలతో ఆయన ఇలాంటి ఒక సంస్థ ఏర్పాటు గురించి ఆలోచించాడు. ఖలీఫా నాయకత్వంలో ఉండే ఏక ప్రపంచాన్ని నిర్మించడంతోనే ముస్లిం సమాజానికి పూర్వ వైభవం వస్తుందని సిద్ధాంతీకరించుకున్నాడు. అంటే చరిత్ర మొత్తం కనిపించినట్టే ఇస్లాంకూ, రాజకీయాలకూ భేదం లేదనే ఇతడూ నమ్మకానికి వచ్చాడు. అంతకు ముందు ఈజిప్ట్‌లో మొదలైన (1928) ముస్లిం బ్రదర్ హుడ్, భారత్‌లో మొదలైన (1941) జమాత్ ఇ ఇస్లామీ ఇదే బాటలో నడిచాయి.

తహ్రీర్ పక్ష సభ్యులను రష్యా, మధ్య ఆసియా, టర్కియే, మధ్య ప్రాచ్యంలో తరచు అరెస్టు చేస్తుంటారు. ఆ మధ్య అరబ్బు దేశాలలో మొదలైన తిరుగుబాట్ల నేపథ్యంలో ఇది ఒక బలీయమైన శక్తిగా హఠాత్తుగా రూపుదిద్దుకుంది. ట్యునీసియా వ్యవహారాలలో కీలకపాత్ర పోషించినందు వల్ల ఈ ప్రాధాన్యం వచ్చింది. నిజానికి సోవియెట్ రష్యా పతనమే దీని పునరుత్థానానికి మార్గం చూపింది. తరువాత ఈజిప్ట్, సిరియాలలో వచ్చిన అలజడులలో కూడా దీని పేరు విస్తృతంగా వినిపించింది. ఇది ముస్లిం దేశాలలో ఖలీఫా పాలన ఉండాలని వాదిస్తుంది.

మూడు దశలలో తన ఆశయాన్ని అమలు చేయడం తహ్రీర్ సంస్థ ప్రణాళిక. మొదటి దశలో మేధావులైన వారిని సంస్థలో చేర్చుకుంటారు. ప్రవక్త తన బోధనలను మొదటిసారి లోకానికి పరిచయం చేసినప్పుడు చూపించిన సహనం, నిభాయింపు వీరు చూపుతారు. రెండో దశలో ముస్లిం సమాజంతో మమేకం అవుతారు. అంటే సంస్థ సిద్ధాంతాన్ని సమాజంలో ప్రవేశపెడతారు. అలాగే అమలుకు కూడా పాటుపడతారు. తరువాత ఇస్లామిక్ రాజ్యం ఏర్పాటు. అంటే దీని ఆశయం కూడా ఇస్లామిక్ రాజ్య స్థాపన మాత్రమే. ఇందుకు అనుసరించే మార్గం జిహాద్. ★

కర్ణాటక ఓటర్లు మూడు దశాబ్దాలకు పైగా.. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 38 ఏళ్లుగా ఒక అప్రకటిత సంప్రదాయంగా పాటిస్తూ వచ్చిన మార్పునే మళ్లీ పాటించారు. అందుకు అనుకూలంగానే తీర్పునిచ్చారు. మే 10వ తేదీన జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ (బీజేపీ)ని కాదని, ప్రతిపక్ష (కాంగ్రెస్)కి పట్టం కట్టారు. అక్కడ వరుసగా ఏ పార్టీకి కూడా రెండోసారి అధికారం ఇవ్వని ప్రజలు ఈసారీ అదే చేశారు.



కర్ణాటక ఎన్నికలు

# బీజేపీకి తగ్గింది సీట్లే.. ఓట్లు కాదు!

ఒక కర్ణాటకలోనే కాదు, కేరళ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, అసోం సహా మరికొన్ని రాష్ట్రాల్లో కూడా గతంలో ఇదే ఆనవాయితీ కొనసాగింది. అయితే, ఇటీవల కాలంలో ఆ రాష్ట్రాల ఓటర్లు ఆనవాయితీకి భిన్నంగా తీర్పునిచ్చారు. కేరళలో ఎల్డీఎఫ్‌కు; ఉత్తరాఖండ్, అసోం రాష్ట్రాల్లో బీజేపీకి వరుసగా రెండవసారి అధికారం అప్పగించారు. ఉత్తరప్రదేశ్‌లో 37 ఏళ్ల తర్వాత వరుసగా రెండోసారి అధికారం నిలబెట్టుకున్న ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ రికార్డు సృష్టించారు. 1985లో జరిగిన అవిభక్త ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీ తివారీ వరుసగా రెండవసారి విజయం సాధించి అధికారం నిలబెట్టుకున్నారు. కానీ, కర్ణాటకకు వచ్చే సరికి.. పాత పద్ధతిలోనే అధికారం చేతులు మారింది. బీజేపీ చేతుల్లోని అధికారం కాంగ్రెస్ చేతికి చేరింది. అంటే, కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడం భూమి బద్దలయ్యే బ్రహ్మాండ పరిణామం ఏమీ కాదనే అనుకోవాలి. రాజకీయ చక్ర భ్రమణంలో చోటుచేసుకున్న సహజ పరిణామం. కాకపోతే జాతీయ స్థాయిలో అవసాన దశకు చేరుకున్న కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక ఓటర్లు గెలుపు ఊపిరి పోశారు. అలాగే, 2024లో బీజేపీని ఓడించడం తమతో అయ్యే పనికాదని నిర్ణయానికి వచ్చిన ప్రతిపక్షాలకు, ముఖ్యంగా కాంగ్రెస్ పంచన చేరి రాజకీయ ఉనికిని కాపాడుకోవాలని తహతహలాడుతున్న కమ్యూనిస్ట్ పార్టీలకు, ఏదో విధంగా ప్రాంతీయ అధికారాన్ని నిలుపుకోవాలని తహతహలాడుతున్న తృణమూల్ కాంగ్రెస్ వంటి ప్రాంతీయ పార్టీలకు కాంగ్రెస్ గెలుపు తీపి కబురు అందించింది. ఆ విధంగా కర్ణాటక విజయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశం అయింది, అంతే. కర్ణాటక ఎన్నికల ఫలితాలకు అంతకు మించిన విశేషం జోడించి ఏదో జరిగిపోయిందనో, జరిగిపోతోందనో హైరానా పడాల్సిన అవసరం లేదు.



రాజనాల బాలకృష్ణ
సీనియర్ జర్నలిస్ట్

### గెలుపు గెలుపే!

కారణాలు ఏవైనా ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమం. కాబట్టి ప్రజల తీర్పును అందరూ ఆమోదించవలసిందే. అందులో రెండో అభిప్రాయానికి తావు లేదు. గెలుపు గెలుపే. ఓటమి ఓటమే. గెలుపును ఆస్వాదిస్తున్న పార్టీలు, నాయకులు తమ ముందున్న కర్తవ్యాన్ని గుర్తెరిగి అడుగులు వేస్తే, ఓటమి చెందిన పార్టీలు, నాయకులు లోపం ఎక్కడ జరిగిందో ఆత్మ'పరీక్ష' చేసుకుని గెలుపు వైపు అడుగులు వేయవలసి ఉంటుంది. ఈ ఎన్నికల్లో అధికార బీజేపీని ప్రతిపక్ష స్థాయికి పరిమితం చేసిన కర్ణాటక ఓటర్లు... కింగ్ మేకర్‌గా చక్రం తిప్పాలనుకున్న మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి నేతృత్వంలోని జేడీఎస్ ఆశలనూ గల్లంతు చేశారు. బీజేపీ సీట్లు కోల్పోయినా ఓటుశాతం మాత్రం అలాగే ఉంది. 2018 ఎన్నికల్లో వచ్చిన 36 శాతం ఓటుషేర్‌ను బీజేపీ నిలబెట్టుకుంది. అయినా, 38 సిట్టింగ్ స్థానాలను కోల్పోయింది. ఇక జేడీఎస్ సీట్లతో పాటు ఓట్లు కూడా కోల్పోయింది. 2018లో 18 శాతం ఓట్లతో 37 సీట్లు గెలుచుకున్న జేడీఎస్.. ఈసారి 5 శాతం ఓట్లు కోల్పోయి 18 సీట్లకు పరిమితమైంది.

ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే.. 2018లో ఆ పార్టీ 38.04 శాతం ఓట్లతో 80 సీట్లు గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో 42.88 శాతం ఓట్లతో 135 సీట్లు గెలుచుకుంది. అంటే గత ఎన్నికల కంటే ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీకి కేవలం 4.48 శాతం ఓట్లే అధికంగా పోలయ్యాయి. దీంతో 57 స్థానాలు అధికంగా లభించాయి. అదే సమయంలో ఒక శాతం కంటే తక్కువగా, అంటే 0.22 శాతం ఓట్లను మాత్రమే కోల్పోయిన బీజేపీ 38 సిట్టింగ్ స్థానాలు కోల్పోయింది. జేడీఎస్ కోల్పోయిన ఓట్లు నేరుగా కాంగ్రెస్ పార్టీకి ట్రాన్స్‌ఫర్ అవడం వలన జేడీఎస్‌తో పాటు బీజేపీ కూడా గణనీయ సంఖ్యలో సీట్లు కోల్పోయింది. అందువల్లనే బీజేపీ కేవలం రెండు వేల కంటే తక్కువ ఓట్ల తేడాతో సుమారు 100

సీట్ల (రెండువేల కంటే తక్కువ 58, వెయ్యి కంటే తక్కువ 41)లో ఓడిపోయింది. అయితే, ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించేది ఓట్ల తేడా కాదు. ఆధిక్యత మాత్రమే. అది ఒక్క ఓటైనా, గెలుపు గెలుపే. ఓట్ల లెక్కలు ఎలా ఉన్నా సీట్ల లెక్కల్లో కాంగ్రెస్ గెలిచింది. బీజేపీ ఓడిపోయింది. ఇదీ.. 2023 కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు సారాంశం.



**కారణాలెన్నో..**

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎందుకు గెలిచింది? ఎలా గెలిచింది? అని ఆలోచిస్తే.. అనేక కారణాలు కనిపిస్తాయి. అలాగే, బీజేపీ ఎందుకు ఓడిపోయిందని చర్చిస్తే అందుకూ ఎన్నో కారణాలు కనిపిస్తాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన ఐదు ఉచిత పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో గట్టి ప్రభావం చూపాయి. యువత, మహిళలే టార్గెట్‌గా కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఐదు గ్యారెంటీలు అంటూ ప్రకటించింది. ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించే గృహజ్యోతి పథకం, రాష్ట్రంలోని 1.5 కోట్ల మంది మహిళలకు స్త్రీశక్తి పేరిట ఒక్కొక్కరికి రూ. 2వేల ఆర్థికసాయం అందించే పథకం, అన్నభాగ్య పథకం కింద ప్రతి పేదకుటుంబానికి 10 కిలోల బియ్యం, యువనిధి యోజన కింద నిరుద్యోగ పట్టభద్రులు, డిప్లొమా పట్టాదారులకు నెలకు రూ. 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత రవాణా వసతి.. ఇలా అనేక తాయిలాలను కాంగ్రెస్ ఎరగా వేసి గెలిచింది. అలాగే, బీజేపీ ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానాన్ని తొలగించి కర్ణాటక విద్యా విధానం అమలు చేస్తామని తెలిపింది. మరోవైపు ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ రద్దును తొలగిస్తామని, ఎస్సీలకు 17 శాతం, ఎస్టీలకు 7 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జనాభా దమాషాగా రిజర్వేషన్ ప్రమాణాలను సవరిస్తామని పార్టీ తెలిపింది. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఉన్న 50 శాతం రిజర్వేషన్లను 75 శాతానికి పెంచుతామని చెప్పింది. ఈ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతవరకు నిలబెట్టుకుంటుందనేది అనుమానమే అయినా, ఆ పార్టీ గెలుపునకు మాత్రం ఈ హామీలే పునాదులు వేశాయి. అలాగే, ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ అధికారం హస్తం చేతికి చిక్కదనే నిర్ణయానికి వచ్చిన పార్టీ నాయకులు తాత్కాలికంగానే అయినా తమ మధ్యన ఉన్న దీర్ఘకాల విభేదాలు పక్కన పెట్టారు. ముందు ఎన్నికల్లో గెలుద్దాం, ఆ తర్వాత మన సంగతి చూసుకుందామని పీసీసీ చీఫ్ డీకే శివకుమార్, సీఎల్పీ నేత సిద్ధరామయ్య సయోధ్యను చక్కగా నటించారు. మరీ ముఖ్యంగా బీజేపీ స్థానిక నాయకత్వం చేసిన తప్పులు, అందుకు జాతీయ నాయకత్వం జోడించిన మరికొన్ని తప్పులు కూడా కాంగ్రెస్ పార్టీకి ఊపిరి పోశాయి. అదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం అమూల్, నందిపాల వివాదం వంటి స్థానిక సమస్యలు, వివాదాలను పరిష్కరించడంలో విఫల మైందనే అభిప్రాయం ఉంది.




ఆ విషయం ఎలా ఉన్నా.. కర్ణాటక గెలుపును కాంగ్రెస్ పార్టీతో పాటు మరొకొందరు మేధావులు జాతీయ స్థాయికి అన్వయించి విశ్లేషణలు వినిపిస్తు న్నారు. అంతేకాదు, గీత దాటి ఉత్తర, దక్షిణ భారత విభజన తెచ్చే విధంగా ప్రమాదకర విశ్లేషణలు చేస్తు న్నారు. నిజానికి నిన్నటి వరకు దక్షిణ భారతదేశంలో ఎక్కడా కాంగ్రెస్ ప్రభుత్వం లేదు. తమిళనాడులో అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్నా, ప్రభుత్వంలో చోటు లేదు. ఇంకా చిత్రం ఏమంటే దక్షిణాదికి చెందిన కాంగ్రెస్ పార్టీ యాక్సిడెంటల్ ప్రెసిడెంట్ ఖర్గే ఈ చర్చకు తెర తీశారు. బీజేపీ ముక్త దక్షిణ భారత్ సాధించామని ఖర్గే పేర్కొన్నారు.

అదొకటి అలా ఉంటే.. కాంగ్రెస్ నాయకులు, కొందరు మేధావులు, కుహనా లౌకికవాదులు కర్ణాటక గెలుపుతో దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుందనే కలలు కంటున్నారు. కథనాలు వినిపిస్తున్నారు. నిజమే, అంపశయ్యపై ఉన్న వ్యక్తిలో ఏ చిన్న కదలిక వచ్చినా సహజంగానే వారిలో ఆశలు చిగురిస్తాయి. ఇప్పుడు కాంగ్రెస్‌లోనూ అంతే. అన్ని సందర్భాల్లో ఫలితం ఒకేలా ఉండాలనే నియమం లేదు కదా.

2018 చివర్లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయింది. అయినా, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటక సహా నాలుగు రాష్ట్రాలను బీజేపీ స్వీప్ చేసింది. కర్ణాటకలో 28 లోక్‌సభ సీట్లకు 26 (బీజేపీ మద్దతుతో గెలిచిన స్వతంత్ర అభ్యర్థి సుమలతతో కలిపి) స్థానాలు గెలుచుకుంది. మధ్యప్రదేశ్‌లో 29కి 28 సీట్లు బీజేపీ గెలిచింది. ఛత్తీస్‌ఘడ్‌లోనూ ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ 9 సీట్లు గెలిస్తే.. అధికార కాంగ్రెస్ 2 సీట్లకే పరిమితమైంది. రాజస్తాన్‌లో అయితే మొత్తం 25 సీట్లలో 24 బీజేపీ, మిగిలిన ఒక స్థానం బీజేపీ మిత్ర పక్షం ఆర్ఎల్పీ గెలిచాయి. ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఖాతానే తెరవలేదు. అలాగే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఎల్డీఎఫ్.. లోక్‌సభ ఎన్నికల్లో చతికిలపడింది. మొత్తం 20 లోక్‌సభ స్థానాలున్న కేరళలో కాంగ్రెస్ 15, కాంగ్రెస్ మిత్ర పక్షాలు 4 స్థానాలు గెలుచుకున్నాయి. కాబట్టి.. 2023లో కర్ణాటకలో గెలిచిన కాంగ్రెస్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలుస్తుందనుకోవడం అజ్ఞానం, కాదంటే అమాయకత్వం అవుతుంది. అలాగే, కర్ణాటక గెలుపు రానున్న రోజుల్లో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు బాటలు వేస్తుందనుకోవడం కూడా అజ్ఞానమే. ★

# ఓడినా వాడని కన్నడ


మే 13న వెలువడిన కర్ణాటక శాసనసభ ఎన్నికల ఫలితాలు ఉత్కంఠను రేపాయి. వీటి మీద ఎవరి అంచనాలు వారివి. అధికారంలో ఉన్న బీజేపీ ఓడిపోయి (66), కాంగ్రెసు మంచి మెజారిటీతో (135) అధికారంలోకి వచ్చింది. ఈ వార్త వినగానే కాంగ్రెసు నేత రాహుల్‌గాంధీ 'ద్వేషం మీద ప్రేమ జయించింది' అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ 'ద్రవిడ ధరిత్రిపై బీజేపీకి మనుగడ లేదు. ఇక్కడ నుంచి తరిమేశాం!' అన్నారు. కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 'ఆ ఫలితాలే తెలంగాణలో పునరావృతం అవుతాయి' అన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 'వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వంద సీట్ల కంటే ఎక్కువ రావ'ని వెంటనే జ్యోతిష్యం చెప్పారు. ఇందులో ఎవరి కోణం వారిదే తప్ప, నిష్పాక్షిక విశ్లేషణ అని చెప్పుకోదగ్గ అంచనా ఏదీ వాటిలో లేదు. ఇవాళ్టి రాజకీయ పార్టీల నుంచి వాటిని ఆశ్రయించి ఉన్న, అంతర్జాతీయ శక్తుల కనుసన్నలలో నడిచే మీడియా నుంచి ఇంతకంటే ఎక్కువ ఆశించడం కూడా తప్పు. ఇంతకూ జరిగిందేమిటి?

బీజేపీకి 36 శాతం ఓటు బ్యాంకులో దాదాపు మార్పేమీ లేదు. 2018లో 36.4 శాతం కాగా, ఇప్పుడు 36 శాతం. అయినా బీజేపీ మట్టికరిచిందని అంతా వ్యాఖ్యానిస్తున్నారు. అంటే విజయం అసెంబ్లీలోనే కనిపించాలని వీరి ఉద్దేశం. దీనిని కాదనలేం కానీ, బీజేపీకి ప్రజాబలం యథాతథమే నన్న వాస్తవం జోలికి ఎవరూ వెళ్లడం లేదు. ఇక్కడ కమలం ఓడింది. కానీ 'వాడి' పోలేదన్నదే నిజం. హెచ్.డి.కుమారస్వామి జనతాదళ్ (ఎస్) పార్టీ ఓటు బ్యాంకులో 6 శాతం కాంగ్రెసుకు చేరింది. దీనివలన గణాంకాలు మారాయి. బీజేపీ 'అవినీతి' గురించి కాంగ్రెసు విస్తృత ప్రచారం చేసింది. ప్రభుత్వ వ్యతిరేకత గురించి మీడియా ఊదరగొట్టింది. ఇక్కడ గురవింద సామెతను గుర్తు చేసుకోక తప్పదు. ప్రస్తుతం రాహుల్‌గాంధీ, సోనియా గాంధీ ఇద్దరూ నేషనల్ హెరాల్డ్ అక్రమ ఆర్థిక వ్యవహారాల కేసులో బెయిల్‌పైనే బయట తిరుగుతున్నారు. అలనాటి స్వాతంత్ర్య సమరయోధులు తమ ఆస్తులు అమ్మి ఇచ్చిన మూలధనంతో స్థాపించిన పత్రిక అది. కాంగ్రెస్ చరిత్రలో తవ్విన కొద్దీ అవినీతి వ్యవహారాలు బయటపడతాయి. యూపీఏ అధికారంలో ఉండగా జరిగిన లక్షల కోట్ల అవినీతి వ్యవహారాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. వీటికి సోనియా, రాహుల్ సూత్రధారులు. కార్తీ చిదంబరం, మోతీలాల్ ఓరా పాత్రధారులు. కాబట్టి కాంగ్రెస్ వారు అవినీతి గురించి మాట్లాడటమేమిటి? ఒక రాష్ట్ర ఎన్నికల విజయం వీరి మలిన కుడ్యాన్ని వైట్‌వాష్ చేయగలదా?


సోనియాగాంధీ భారతదేశానికి మతమార్పిడుల కోసం వచ్చారు. కర్ణాటకలో ముస్లిం- క్రైస్తవ- కమ్యూనిష్టు వర్గాలు బహిరంగంగా కాంగ్రెసుకు మద్దతునిచ్చాయి. అంతేకాదు, నిషిద్ధ పీఎఫ్ఐ ఉగ్రవాద సంస్థ రాజకీయ విభాగం ఎస్‌డీపీఐ తన అభ్యర్థులను కాంగ్రెసుకు అనుకూలంగా పోరులో బలహీనపరిచింది. బహుశా బజ్రంగ్‌దళ్‌పై నిషేధం విధిస్తామని కాంగ్రెస్ చెప్పి ఉండవచ్చు. మొదట పాతిక సీట్లలో పోటీకి దిగుతామని బీరాలు పలికిన ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ కేవలం రెండే సీట్లకు పోటీ చేశారు. రెండింటిలోను ధరావతు దక్కలేదు. కాంగ్రెస్‌ను ప్రజలు ఈసారి ఎన్నుకున్నారు అన్న ఒక వాస్తవాన్ని గుర్తు పెట్టుకుంటూనే కొన్ని విషయాలు చెప్పుకోవాలి. ఇవేమీ జాతీయ భద్రతకు, జాతి గౌరవానికి మేలు చేసేవి కావు. కాంగ్రెస్ పార్టీకి జాతీయవాదుల పట్ల ముందు నుంచి ఉన్న వైఖరినే కర్ణాటకలోను ప్రదర్శించింది. అందుకే టిప్పుసుల్తాను జయంతి జరిపింది. స్వాతంత్ర్య వీర సావర్కర్‌ను అవమానించింది. హిజాబ్ వివాదానికి మూలం కర్ణాటక రాష్ట్రమే. హిజాబ్‌ను పాఠశాలల్లో అనుమతించనవసరం లేదని కోర్టులు తీర్పు చెప్పినా, వారికే మద్దతుగా నిలిచాయి కాంగ్రెస్, ఇతర పార్టీలు. పీఎఫ్ఐ అనుబంధ క్యాంపస్ ఫ్రంట్ నిర్వాకమే హిజాబ్ వివాదం. కాంగ్రెసు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డి.కె.శివకుమార్‌పై ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడిచేస్తే బాత్‌రూంలో గోడల నిండా వజ్రాలు, నోట్ల కట్టలు లభించాయి. గోమాంసం తింటే తప్పేమిటి? అని ప్రశ్నించాడు కాంగ్రెసు నాయకుడు సిద్ధ రామయ్య. కర్ణాటకలో హనుమంతుడు ఓడిపోలేదు. రోమ్ పోపు గెలిచాడు. తాజా వార్త ఏమిటంటే, బజ్రంగ్‌దళ్‌ను పీఎఫ్ఐ వంటి ఉగ్రవాద సంస్థ పక్కన నిలబెట్టినందుకు పంజాబ్‌కు చెందిన ఒక హిందువు కోర్టును ఆశ్రయించాడు. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు నోటీసులు వచ్చాయి. రాజస్తాన్‌లో జరుగుతున్నవి, మధ్యప్రదేశ్ నాయకుడు దిగ్గిరాజా వ్యాఖ్యలు ఏవి గమనించినా హిందూ వ్యతిరేక పార్టీగా ముద్ర వేయించుకోవడానికి కాంగ్రెస్‌కు ఎలాంటి వెరపూ లేదనే తేలుతుంది.

ఇక ద్రవిడవాదం గురించి మాట్లాడే స్టాలిన్ అనే పేరు తమిళం కాదు. వాళ్ల నాన్న కరుణానిధి పేరు సంస్కృతం. వాళ్ల టీవీ ఛానల్ 'ఉదయ' అంటే సంస్కృతం పేరు. వీళ్లకి ఆది నుంచి హిందీ, హిందూ అంటే అకారణ ద్వేషం. ఇక సంస్కృతం అంటే తీవ్రమైన వ్యతిరేకత.

హమ్మయ్య...ఈసారి మన పనితీరును ఎవరూ తప్పు పట్టలేదు!



# కమలం




'అసలు ప్రేమ జయించింది' అంటూ రాహుల్ స్పందించడమే పెద్ద ప్రహసనం కాదా? విద్వేషాన్ని గురించి కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రాహుల్‌గాంధీ మాట్లాడట మేమిటి? 1984లో ఢిల్లీ నడివీధులలో వేలాది సిక్కులను ఊచకోత కోసింది ఎవరు? 1975లో రాజ్యాంగాన్ని పక్కనపెట్టి జాతిపై అత్యవసర పరిస్థితిని విధించింది ఎవరు?

నేతాజీ సుభాష్‌బాబును హింసించి చంపింది ఎవరు? 'కుక్క' అని పిలిచింది ఎవరు? బయటకు నెట్టి ఆ కుర్చీలో బలవంతంగా కూర్చున్నది ఎవరు? కాంగ్రెస్‌లో నెహ్రూ నాయకత్వంలో పటేల్‌కు ఏం జరిగిందో జాతి మరచిపోలేదు.

**అప్పుడే చరిత్ర మరచిపోయారా?**


రాజకీయాల్లో గెలుపోటములు సహజం. కాని ఇవాళ కాంగ్రెసు పార్టీ మూల సిద్ధాంతాలు ఏమిటి? ఒకే రాజకీయ కుటుంబం మళ్లీ మళ్లీ అధికారంలో ఉండటం. చిత్రంగా కాంగ్రెస్‌ను అంటకాగుతున్న పార్టీలన్నీ ఇదే పోకడను ఆశ్రయిస్తున్నాయి. డీఎంకే, తృణమూల్, ఆర్జేడీ ఇదే పంథాలో ఉన్నాయి. ఇవన్నీ కలసి బీజేపీని ఓడించడానికి ఏకం కావాలని అనుకోవడమే వింత.

రాజకీయాల్లో హత్యలు ఉండవు. ఆత్మహత్యలే ఉంటాయి అన్నాడొక తత్వవేత్త. వెయ్యేళ్ల బానిసత్వాన్ని మరచిపోయారా? 75 సంవత్సరాల ఏక కుటుంబ పాలనలోని దోపిడీ మరిచిపోవాలా?

కర్ణాటకలో ముస్లిం ఓట్లను గంపగుత్తగా తన ఖాతాలో వేసుకొని గెలిచిన రాహుల్‌గాంధీ 1947లో భారతదేశాన్ని మత ప్రాతిపదిక మీద విభజించారని– ఆ ఘన కార్యం చేసింది ఈ కాంగ్రెసు పార్టీయేననీ సౌకర్యంగా మరచిపోయాడు.

కర్ణాటకలో లింగాయతులకు వక్కళిగలకూ మధ్య కులయుద్ధం నడుస్తున్నది. ఇది కృష్ణరాయలు పాలించిన రత్నాల సీమకు శోభస్కరం కాదు.

కర్ణాటకలో జరిగిన ఎన్నికలకు విదేశాల నుండి బీజేపీని ఓడించడానికి నిధులు ఎవరెవరు పంపారో విచారణలో తేలుతుంది. తెలంగాణ నుండి హెచ్‌డి కుమారస్వామికి ప్రత్యక్షంగా నిధులు అందాయి. అయినా ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. అలాగే బీఎస్పీ వంటి పార్టీలు కూడా గెలువలేదు.



ప్రొ. ముదిగొండ శివప్రసాద్
విశ్రాంత ఆచార్యుడు

కర్ణాటకలో బలమైన లింగాయత్ నాయకుడు బీఎస్ యడ్యూరప్పను పక్కన పెట్టడం బీజేపీకి బాగా నష్టం చేసింది. ఆ పార్టీలో పదవులు స్వీకరించడానికి వయోఃపరిమితి విధించుకున్న సంగతి ఒకటి ఉన్నా ఈ మాట అనుకోక తప్పదు.

కన్నడ రాజకీయాల్లో లింగాయతులది కీలక పాత్ర. వీరు జనాభాలో 17 శాతం ఉన్నారు. నిజలింగప్ప, వీరేంద్రపాటిల్, బీడీ జెట్టి వంటి వారంతా లింగాయతులే. వీరంతా లోగడ కాంగ్రెసు నాయకులు. యడ్యూరప్ప కాలం నుండి వీరు బీజేపీకి అనుకూలమైనారు. లింగయతులలో మళ్లీ వీరశైవులు, లింగాయతులు అనే రెండు వర్గాలున్నాయి. వీరికీ ఉడిపి విశ్వేశ్వరతీర్థ (మధ్య) వర్గాలకూ సాన్నిహిత్యం లేదు. మైసూరు ప్రాంతంలో వక్కళిక ప్రాబల్యం ఎక్కువ. వీరూ రైతు వర్గానికి చెందినవారే. అయితే వీరు వైష్ణవులు. ఎస్.ఎం.కృష్ణ వంటివారు ఈ గ్రూపునకు చెందినవారు. మల్లికార్జున ఖర్గే క్రైస్తవ సోనియాకు వీర విధేయుడు. ఈయన కూడా లింగయత్ వర్గానికి చెందినవాడే.

నిజానికి అసెంబ్లీ ఎన్నికలు స్థానిక సమస్యల మీద జరుగుతాయి. కానీ దేశవ్యాప్తంగా బలంగా ఉన్న బీజేపీకి అక్కడ స్థానిక నాయకత్వం పటిష్టంగా లేదు. న్యూఢిల్లీ నుండి నరేంద్రమోదీ, అమిత్‌షాలను పిలిపించి వారి గ్లామర్‌తో ఎన్నికలు గెలవాలను కోవడం బీజేపీ చేసిన వ్యూహాత్మక తప్పిదం. కర్ణాటక ఫలితాలు పక్కనే ఉన్న తెలంగాణ మీద ప్రభావం చూపుతాయని చాలామంది నమ్ముతున్నారు. అయితే, ఇప్పుడు తెలంగాణలో ఏం జరుగుతుంది? బీజేపీని ఓడించటం కోసం అందరూ కలువబోతున్నారు. ఇదే కర్ణాటక ఫార్ములా. ఒకే ఒక్క దేశభక్తి పార్టీ మీద ఇంత విద్వేషమా? ఇంతకీ కర్ణాటక ఫలితాలు వెలువడిన మర్నాడే ఉత్తరప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు వెలువడినాయి. వాటి గురించి లాంఛనంగానే మన మీడియా వ్యాఖ్యానించింది. ఇక ఏ బీజేపీయేతర నేత వాటి మీద వ్యాఖ్యానించ లేదు. అక్కడ బీజేపీ సునామీ సృష్టించింది. ఏవో కొన్ని చానళ్లు తప్ప మీడియా కూడా సరైన రీతిలో వీటి గురించి విశ్లేషించలేదు. బీజేపీ ఓడిపోతే, లేదా ఏదైనా చిక్కుల్లో పడితే అది ప్రపంచ వార్త. అదే బీజేపీకి విజయం సమకూడితే చిన్న వార్త.

రాహుల్‌గాంధీ ఇటీవల భారత్ జోడో యాత్ర చేశారు. అతని వెనుక మాఫియా జోడో వర్గాలు నడిచాయి. స్వాతంత్ర్య వీరసావర్కర్‌ను అడ్డమైన తిట్లు తిట్టిన రాహుల్‌గాంధీని ఒక జాతీయ నాయకునిగా భారత సమాజం అంగీకరించటం ఈ జాతి చేసుకొన్న మహాపాపం. 2006లో చైనా వెళ్లి వారితో చేతులు కలిపి రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కు అక్రమంగా నిధులు తెచ్చుకున్న మాట నిజమా కాదా?

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెసుపార్టీ అస్తమించింది. కాని తెలంగాణలో ఈ కర్ణాటక విజయంతో కాంగ్రెసుకు కొత్త ఆశలు చిగురించాయి. ఎం.ఐ.ఎం. ఓట్ల కోసం ఇటు బీఆర్ఎస్ అటు కాంగ్రెస్ ఇక పోటాపోటీగా ప్రయత్నిస్తాయి. ఈ ఎన్నికలలో జేడీ(ఎస్) అనే అవకాశవాద ప్రాంతీయ పార్టీ అంత రించటం శుభసూచకమే. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఫలితాలు వెలువడిన తరువాత శాసనసభా పక్ష నేత సిద్ధరామయ్య, ప్రదేశ్‌కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ సీఎం పదవి కోసం చేసిన హంగామా, అలకలు, ఆరాటాలు మాత్రం జాతికి మంచి వినోదాన్నే ఇచ్చాయి.

**కొసమెరుపు**

బీజేపీ ఓడిపోయి, కాంగ్రెస్ పార్టీ గెలిచింది కాబట్టి ఈ ఎన్నికలలో ఈవీఎం రగడ రేగలేదు. అదే బీజేపీ గెలిచి ఉంటే ఈవీఎంలనీ, ఎన్నికల కమిషన్‌నీ కూడా ప్రతిపక్షాలు తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేవే. కాబట్టి ఈసారి ఎన్నికల కమిషన్‌కు కాస్త వెసులుబాటు. ★

# 'పస్తులుండండి!

పాల్ నెహెంగి మెకంజీ...
పేదరికంతో, అంతఃకలహాలతో, చమురు మాఫియాతో నిరంతరం తల్లడిల్లిపోయే కెన్యాకు చెందినవాడు. ఏకైక గుర్తింపు క్రైస్తవ మతబోధకుడు. గుడ్‌న్యూస్ ఇంటర్నేషనల్ చర్చ్ ఇతడిదే. ఇతడిని ఉగ్రవాదిగా, భ్రాతృహంతకుడిగా నిరూపించడానికి అక్కడి షకాహోలా ప్రభుత్వం ఎన్ని చట్టాలు ఉన్నాయో పడి పడి వెతుకుతున్నది. కిలిఫీ అనే చోట ఉన్న ఇతడి కేంద్రంలో వందలాదిగా కుళ్లిన మానవ కళేబరాలు దొరికాయి. ఇంతకీ ఇతడు తనకు తానుగా క్రైస్తవ మత ప్రబోధకుడుగా ప్రకటించుకున్న వాడు మాత్రమే. ఈ పాప భారం మోసిన స్థలం షాకాహోలా గ్రామం. కిలిఫీ కౌంటీలో ఉన్న మలిందీ అనే పర్యాటక కేంద్రానికి సమీపంగానే ఉంటుంది. మిలిందీలోనే ఇతడి గుడ్ న్యూస్ ఇంటర్నేషనల్ చర్చ్ ఉంది. గట్టి ఎండతోనూ, గట్టి ఆకులు ఉన్న చెట్లతోను ఒక రకమైన ప్రశాంతత ఉండే షాకాహోలా గ్రామమే ఏప్రిల్ నుంచి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది.


మెకంజీ

క్రైస్తవంలో కనిపించే మతోన్మాదం, ప్రబోధాల ఉన్మాదం దారుణంగా తయారవుతున్నది. పైగా వాటిని ప్రదర్శించి వీడియోలలో దేశాల మీదకి వదిలి పెడతారు. మెకంజీ చేసింది కూడా ఇదే. మన దేశంలో కూడా కరోనాను తొక్కేస్తా అంటూ ఒక పాస్టర్ వీరంగం వేస్తున్నట్టు చూపించే వీడియోలు ఎన్నో వచ్చాయి. చనిపోయారంటూ ఎవరినో తీసుకు వచ్చి, పాస్టర్ నీళ్లు చల్లితే లేచి కూర్చోవడం వంటివి కూడా వీడియోలలో వస్తున్నాయి. ఇక రోగాలు నయం చేయడం, అందులో మహిమలు గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. గుండెలు బాదుకోవడం, మూర్ఛ వచ్చినట్టు తన్నుకోవడం పాస్టర్ వచ్చి చేయి వేయగానే, బైబిల్ వాక్యాలు చదవగానే వారికి నయం కావడం ఇవన్నీ కూడా ప్రదర్శిస్తూ ఉంటారు. అయితే ఇవి ఏవీ కూడా మెకంజీ 'క్రైస్తవం' ముందు దిగదుడుపే.

మూఢత్వం మాటున మెకంజీ ప్రదర్శించిన క్రూరత్వంతో కెన్యా ప్రభుత్వమే కదిలిపోయింది. ఇప్పటిదాకా జరిగిన ఉదంతాన్ని బట్టి తమ ప్రభుత్వం విఫలమైందని కెన్యా హోంశాఖ అంగీకరించింది. అలాగే ఇకపై ఇలాంటి దారుణాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హోంశాఖ కేబినెట్ కార్యదర్శి కితూరె కిండీకి చెప్పారు. ప్రభుత్వ డిటెక్టివ్‌లు అతడి కేంద్రం మీద దాడి చేసిన తరువాత విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. పరలోక ప్రాప్తి, అందుకు పస్తులతో మరణం ఇతని సిద్ధాంతం. ఈ మత ప్రచారకుడు చేసిన ఘోరం మాటలకు అందనిది. అందుకే ఏప్రిల్ మధ్యలోనే ఇతడిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశాధ్యక్షుడు విలియం ర్యూటో కూడా మెకంజీ ఒక నేరగాడని వ్యాఖ్యానించారు. ఇదంతా ఉగ్రవాదమే కాబట్టి అతడి మీద చర్య తీసుకోవాలని కూడా ఆదేశించాడు.

కొందరు డిటెక్టివ్‌లో ఇతడి రహస్య క్రీస్తు ఆరాధన గుట్టు బయటపెట్టిన తరువాత ఒక్కసారి దేశం విలవిలలాడింది. ఏమిటా ఆరాధన. ఆకలితో మలమల మాడిపోవాలి. ఆకలితోనే మరణించాలి. ఆకలితో ఎక్కువ కాలం గడిపి, ఆఖరికి పస్తులతో మరణిస్తే క్రీస్తు దర్శనం సులభంగా దొరుకుతుంది. దీనికి అతడు పెట్టిన పేరు 'మీట్ జీసస్'. కెన్యా వంటి పేద ఆఫ్రికా దేశంలో నానాటికీ మూఢ నమ్మకాలు వెర్రితలలు వేస్తున్నాయి. మెకంజీతో పాటు ఇంకొక మత బోధకుడు కూడా దాదాపు ఇలాంటి అకృత్యాలకే తన అనుచరులను ప్రోత్సహించినట్టు బయటపడింది. కొద్దివారాల క్రితం మిలిందీ దగ్గరి లాంగోబయా పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు పిల్లల అనుమానాస్పద మృతి ఉదంతం మెకంజీ డొంకను కదిలించింది. షాకాహోలా గ్రామంలోనే మార్చి 16, 17 తేదీలలో ఇద్దరు మైనర్ బాలురను పెద్దగా లోతుగా తవ్వని గోతులలోనే పూడ్చి పెట్టడడంతో విషయం తెలిసింది. శవ పరీక్షలో ఆ ఇద్దరు పిల్లలు తిండిలేక పోవడం వల్ల మరణించిన వాస్తవం తెలిసిపోయింది. ఇంతకీ మెకంజీ కూడా ఏడుగురు పిల్లల తండ్రి. కానీ వీళ్ల గతి ఏమైందో తెలియదు. తను బోధించే క్రైస్తవం శైలి ఇదేనని, కానీ దీనిని తాను 2019లోనే ఆపేశానని చెబుతున్నాడు. అయినా తాను ఎప్పుడూ తన అభిప్రాయాలను ఇతరుల మీద రుద్దలేదని కూడా చెప్పాడు.


ఒక పక్క మెకంజీ రాక్షసత్వం కెన్యాను వణికిస్తుంటే, ఎజకీల్ ఒడిరో అనే మరొక మత ప్రబోధకుడిని కూడా అలాంటి ఆరోపణలతోనే అరెస్టు చేశారు. తన అనుచరులను సామూహికంగా హత్య చేశాడన్న అభియోగం ఇతని మీద మోపారు. మెకంజీ మాదిరిగానే ఇతడిని కూడా ఏప్రిల్ 27 ప్రాంతంలోనే అరెస్ట్ చేశారు. అయితే మెకంజీ ప్రమేయంతో జరిగిన ఆత్మహత్యలకీ, వీటికీ ఏమీ సంబంధం లేదని పోలీసులు చెప్పారు. ఇతడిది కూడా మెకంజీ నివాసం ఉంటున్న మిలిందీ ప్రాంతమే. కానీ ఇతడు ఉండేది మిలిందీకి దక్షిణాదిన. అక్కడ ఉన్న ఇతడి చర్చ్‌లో 40,000 మంది కూర్చొని ప్రార్థనలు వినొచ్చు. తాను విక్రయించే గుడ్డముక్కల వల్ల రోగాలు తగ్గిపోతాయని ఇతడు ప్రచారం చేస్తాడు. ఈ ఇద్దరి మత గురువుల పైత్యాలు బయటపడిన తరువాత దేశంలో చర్చ్‌ల మీద నిఘా ఉంచుతామని హోంశాఖ వెల్లడించింది.



గుడ్‌న్యూస్ ఇంటర్నేషనల్ చర్చ్

మెకంజీ సృష్టి 'మీట్ జీసస్' లేదా దూమ్సడే

# ప్రభువును చేరండి!'



ఎజకీల్

కిల్లింగ్స్‌గా చెబుతున్న ఈ ఉన్మాదంలో చాలా హృదయ విదారకమైన వాస్తవాలు బయటపడుతున్నాయి. పిల్లలు త్వరగా చావడం కోసం పాకలలో ఐదేసి రోజులు నీళ్లు, ఆహారం లేకుండా బంధించారు. ఆ తరువాత తీసుకెళ్లి ఖననం చేసేవారు. ఒకరో ఇద్దరో కొన ఊపిరితో ఉన్నప్పటికీ ఈ క్రీస్తు విశ్వాసులు కరుణించలేదు. మోక్షానికి ఆలస్యం కాకుండా అలాగే పాతిపెట్టారు. మీట్ జీసస్ కార్యక్రమంలో మొదటి అవకాశం పిల్లలకే ఇచ్చాడు మెకంజీ. అంటే పిల్లల్నే బలిపశువులని చేశాడు. ఇవే ఇప్పుడు ప్రపంచంతో పాటు ఆఫ్రికాలోని కెన్యా కూడా విస్తుపోతోంది. ఏప్రిల్ నెలలో ఆరంభమైన దీని దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. అప్పటి నుంచి పాతిపెట్టిన శవాలను వెలికి తీసే కార్యక్రమం జరుగుతూనే ఉంది. మే 15వ తేదీ నాటికి 201 శవాలను వెలికి తీశారు. కేవలం ఫోరెన్సిక్ పరీక్షల కోసమే అక్కడి పోలీసులు ఈ పని చేస్తున్నారు. ఇవన్నీ కెన్యా ఆగ్నేయ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో దొరికినవే.

మెకంజీ బోధన ప్రకారం జీసస్‌ను చేరుకునే అవకాశం మొదట పిల్లలకు ఇస్తారు. అంటే పిల్లల్ని తిండి నీళ్లూ ఇవ్వకుండా చంపుతారు. ఒక రకంగా ప్రేరేపిత ఆత్మహత్యలు. ఇతడికి బాలల మీద అంత కక్ష ఎందుకో అర్థం కాదు. తరువాత అవకాశం పెద్దలది. ఈ విషయాలను ఒకప్పుడు ఇదే ఆరాధనలో ఉండి తరువాత బయటపడిన ఒక మాజీ బోధకుడు టైటస్ కటానా న్యూయార్క్ టైమ్స్‌కు వెల్లడించినవే. మెకంజీ దొంగవేషాలను ముందే కనుగొని 2015లో ఇతడు ఆ ఆరాధనకి స్వస్తి పలికాడు. పిల్లలను పాకలలో బంధించి నీళ్లూ తిండి ఇవ్వకుండా చంపడం ఒకటి. అక్కడ నుంచి దుప్పట్లలో చుట్టి పట్టుకు వచ్చేవారు. మరొకటి నిరాహారంగా ఎండలో ఉంచడం. దీనితో పిల్లలు కచ్చితంగా వేగంగా మరణించేవారు. మెకంజీ మోసంలో పడినవారు కొన్ని వందల మంది. వారిలో 600 మందికి పైగా కనిపించడం లేదు. కాబట్టి వీరు చనిపోయే ఉంటారని అనుమానిస్తున్నారు. కొన్ని శవాల చేతులు వైర్లతో బిగించి ఉన్నాయి. అంటే వారు తిరుగుబాటు చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంకా ఆశ్చర్యం– కొన్ని శవాలకు కొన్ని భాగాలు లేవు. కాబట్టి ఇందులో కిడ్నీ ర్యాకెట్ కోణం కూడా ఉందన్న అనుమానాలు ఉన్నాయి. మెకంజీ ఎలాంటి దొంగ ప్రచారకుడో ప్రజలకు కనిపెట్టే అవకాశం అతడే ఇచ్చాడు. అయినా క్రీస్తు బోధనల మాయలో పడిన కెన్యా ప్రజలు దానిని గుర్తించడానికి నిరాకరించారు. మెకంజీ మంచి భవంతిలో, నిండా సామాగ్రి, టీవీ వంటి సమస్త సౌకర్యాలు ఉన్న ఇంట్లో నివాసం ఉండేవాడు. అనుచరులను మాత్రం పాలిథిన్ గుడ్డలు కప్పిన తాత్కాలిక పందిళ్లలో బతకమనేవాడు.

మెకంజీని పోలీసులు అరెస్టు చేసినప్పటికీ అతడు గతంలో చెప్పిన దైవవాక్యాలు అతడి చానల్ గుడ్‌న్యూస్ ఇంటర్నేషనల్‌లో ఇప్పటికీ ప్రసారమవుతున్నాయని బీబీసీ వెల్లడించింది. అవేమిటో వినాల్సిందే. పిల్లలు ఏడుస్తున్నారా? ఆకలేసి అయి ఉంటుంది. ఆ ఆకలితోనే వాళ్లని చచ్చిపోనివ్వండి అని అతడు అనేవాడు. సంప్రదాయ విద్యలన్నీ చేటు చేసేవేనని అతడు అనేవాడు. ఇది శాతాను విద్య అట. ఈ చదువు చెప్పేవారంతా స్వప్రయోజనపరులు మాత్రమేనని అతడు తేల్చిపారేశాడు. ఏకరూప దుస్తులు అమ్మడం, పాఠ్య పుస్తకాలు రాయడం, పెన్నులు తయారు చేయడం ఇదంతా ఒట్టి చెత్త అని కూడా సిద్ధాంతీకరించాడు మెకంజీ. మీ డబ్బు గుంజి వాళ్లు బాగుపడుతున్నారు. మీరు మాత్రం పేదలుగా ఉండి పోతున్నారంటూ సరికొత్త సోషలిజం చెప్పి వాపోయేవాడు కూడా. బైబిల్ ఆమోదం లేదు కాబట్టి ఈ చదువులు చదవకండి అంటూ ప్రచారం మొదలెట్టినందుకు మెకంజీని 2017, 2018లలో అరెస్టు కూడా చేశారు. చదువంటే సెక్స్ ఎడ్యుకేషన్ కూడా ఉంటుంది. కాబట్టి వీళ్లే స్వలింగ వివాహాలు కావాలంటారు అని కూడా మెకంజీ సూత్రీకరించాడు. శాటానిక్ చెప్పే ఈ చదువులతో గేలు, స్వలింగ సంపర్కులు మాత్రమే తయారవుతారని కూడా తేల్చాడు. ఇతడు ఆధునిక వైద్యానికి కూడా బద్ధ శత్రువు. ప్రసవ సమయంలో మందులు వాడకండి అని మహిళలకు చెప్పేవాడు. పుట్టిన పిల్లలకి టీకాలు అవీ వేయించవద్దని కూడా హితబోధ చేశాడు. పిల్లికి ఎలక సాక్ష్యమన్నట్టు, ఇతడి వాగుడుకు దివ్యత్వాన్ని అంటగట్టడానికి కొందరు కిరాయిభక్తులు కూడా తగిన పాత్ర పోషిస్తూ ఉంటారు. ప్రసవ సమయంలో మందులు వద్దన్న మెకంజీ బోధ తనకు నచ్చిందని, ఆ విధంగా చేసి, సిజేరియన్ అవసరం లేకుండానే తాను బిడ్డను కన్నానని ఒక మహిళ వాగ్మూలం ఇచ్చింది. ఈ ప్రేరణతోనే తమ పక్కింట్లో చిన్నారికి వ్యాక్సిన్లు అవీ వద్దని చెప్పానని ఆమె సగర్వంగా చెప్పింది. డాక్టర్లు వేరే దేవుడిని ఆరాధిస్తారు కాబట్టి వాళ్లు వేసే వ్యాక్సిన్లు వాడకండని చెబుతాడట మెకంజీ.

గుడ్ న్యూస్ ఇంటర్నేషనల్ చర్చ్ మత గురువు మెకంజీ జూన్ 2023కి సృష్టి అంతమైపోతుందని బోధించేవాడు. ఇది నిజమేనని నమ్మేసిన స్టీఫెన్ మిటీ భార్య బహేతి జోన్ తన ఆరుగురు పిల్లలతో సహా పస్తులతో మాడి చనిపోయింది. పైగా ఆమె అప్పటికి గర్భవతి. నా మనుమలు, మనుమరాండ్రు ఆకలితో ఎలా అలమటించి ఉంటారో అని అంతా అయ్యాక ఒక వృద్ధురాలు శాపనార్థాలు పెట్టారు.



– జాగృతి డెస్క్

**వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు నిరాశాజనకంగా ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి సహకారం అందక యువత భవిత ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటి వరకు దారిచూపిన ఐటీ రంగం కూడా ఆర్థికమాంద్యం కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో యువత దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంది.**



# 2.30 లక్షల






డిగ్రీ చదివిన విద్యార్థులు సైతం ఉద్యోగాలు లేక ఇంటి వద్దే ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంపన్న కుటుంబాలు, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువతకు ఇప్పటికిప్పుడు ఎలాంటి సమస్యలు లేకున్నా, పేద కుటుంబాలకు మాత్రం ఆర్థిక సమస్యలు పెరిగి పోతున్నాయి. డిగ్రీ లేదా ఇంజనీరింగ్ చదివితే ఏదైనా ఉద్యోగం వస్తుంది, అప్పులు తీర్చుకుని అయిదు వేళ్లు నోట్లో కెళ్తాయనుకున్న తల్లిదండ్రుల కల కల్లగా మారింది. కొందరికి ఉద్యోగాలొచ్చినా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం చెల్లించకపోవడంతో సకాలంలో సర్టిఫికెట్లు అందక ఉద్యోగాల్లో చేరలేకపోతున్నారు. కొందరికి అపాయింట్‌మెంట్‌లు ఇచ్చినా విధులకు మాత్రం తీసుకోలేదు. ఉద్యోగ అవకాశాలు రాక, జీవితంలో స్థిరపడక పోవడంతో వివాహాలు కూడా కావడం లేదు. ఈ కారణాలన్నిటితో ఏపీ యువత తీవ్ర నిరాశలో ఉంది. అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని, కాంట్రాక్టు ఉద్యోగాలు రెగ్యులర్ చేస్తానని చెప్పిన జగన్మోహన్ రెడ్డి తమను నిలువునా మోసం చేశారని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. బీజేపీ నిర్వహిస్తోన్న ఛార్జిషీట్ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగులు, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంపై ప్రభుత్వంపై ఛార్జిషీట్లు నమోదు చేస్తున్నారు.

ఒక పక్క ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతుంటే వచ్చిన వారికి కూడా సర్టిఫికెట్లు అందక ఉద్యోగాలు కోల్పోతున్నారు. రాష్ట్రంలో ఉన్నత చదువులు అభ్యసించిన వారిలో ఇంజనీరింగ్ చదివిన వారు 70 శాతం మంది దాకా ఉన్నారు. ప్రభుత్వం వృత్తి విద్యాకోర్సులు (ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చరల్, ఫార్మసీ, ఇతర మెడికల్ కోర్సులు, డిప్లమా), సాధారణ డిగ్రీ కోర్సులు చదివే వారికి ఫీజు రియింబర్స్‌మెంట్ పథకం అమలు చేస్తోంది. అయితే ప్రచార యావ, ఓటర్లను ఆకర్షించే క్రమంలో కళాశాలలకు నేరుగా ఫీజులను చెల్లించక విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఫీజులను ప్రభుత్వం జమచేస్తోంది. ఏడాది ఫీజును ఒకేసారి చెల్లించక నాలుగు విడతలుగా చెల్లిస్తోంది. కాని మధ్యలో కొన్ని విడతలు చెల్లించకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే రీయింబర్స్‌మెంట్‌పైనే ఆశలు పెట్టుకుని చదివే విద్యార్థులు సమస్యలకు గురయ్యారు. వీరికి క్యాంపస్ సెలక్షన్‌లు వచ్చినా పూర్తి ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు స్పష్టం చేయడంతో చేసేది లేక ఉద్యోగాలు వదిలేసుకుంటున్నారు. అప్పులు పుట్టిన వారు కొందరు డబ్బు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. ఈ విషయంపై ఎన్ని వినతులు, విజ్ఞాపనలు, ఆందోళనలు, ఉద్యమాలు చేసినా ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చా పీజీ చదువుతున్న విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదు. దాంతో వారికి సర్టిఫికెట్లు రాక, మూడేళ్లుగా ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్నారు. ఈ విషయంపై కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఫీజు చెల్లించాల్సిందే నని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే సగం ఫీజు చెల్లిస్తామని ఒకసారి, 60 శాతం, 70 శాతమని కొర్రీలు పెడుతున్నట్లు కళాశాలల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి.

**హామీలన్నీ అటకెక్కాయి!**

ముఖ్యమంత్రి కాకముందు జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తూ రాష్ట్రంలోని వివిధ శాఖల్లో మొత్తం 2.40 లక్షల ప్రభుత్వోద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొంటూ అధికారంలోకి రాగానే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటించడం ద్వారా వాటిని భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని, పోలీసు కానిస్టేబుల్ ఖాళీలు భర్తీ చేస్తామని కూడా హామీ ఇచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగాలు రెగ్యులర్ చేస్తామన్నారు. పల్లె ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వలస పోనవసరం లేకుండా వారికి గ్రామాల్లోనే ఉపాధి కల్పిస్తామన్నారు. కాని అధికారంలోకి వచ్చాక ఏ హామీని అమలు చేయలేదు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదు. మెగా డీఎస్సీ లేదు. నిరుద్యోగుల పోరాటంతో దిగి వచ్చి ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయలేదు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తున్నారు. నవరత్నాల పథకాల అమలు కోసం వార్డు సచివాలయ ఉద్యోగాలు ప్రకటించి భర్తీచేశారు. వాలంటీర్ల పేరుతో తమ అనుచరులకు ప్రభుత్వం ద్వారా జీతం ఇప్పించి పార్టీ కార్యక్రమాలకు వాడుకుంటున్నట్లు విపక్షాలు ఆరోపిస్తున్నాయి.



**వల్లూరు జయప్రకాష్ నారాయణ**
చైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు,
కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ



ఉద్యోగాల కల్పన జరగకపోవడంతో రాష్ట్రంలో 2019 ఏప్రిల్ నాటికి 4.0 శాతం ఉన్న నిరుద్యోగిత శాతం 2023 ఏప్రిల్ నాటికి 6.6 శాతానికి పెరిగినట్లు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ నివేదిక వెల్లడించింది. జాతీయ సగటు కంటే నిరుద్యోగ పట్టభద్రులు రాష్ట్రంలో రెండింతలు ఎక్కువగా ఉన్నారని ఆ సంస్థ విడుదల చేసిన సర్వేలో తేలింది. రాష్ట్రంలోని నిరుద్యోగుల్లో 73 శాతానికి పైగా పట్టభద్రులే. జాతీయ స్థాయిలో పట్టభద్రల నిరుద్యోగిత రేటు 17.23 శాతం ఉంటే రాష్ట్రంలో 35.14 శాతంగా ఉంది. ఉపాధి, ఉద్యోగాలు లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి చెప్పడం వాస్తవం కాదా?

# ఉద్యోగాలేవీ?

**పెరుగుతున్న నిరుద్యోగిత**

ఉద్యోగాల కల్పన జరగకపోవడంతో రాష్ట్రంలో 2019 ఏప్రిల్ నాటికి 4.0 శాతం ఉన్న నిరుద్యోగిత శాతం 2023 ఏప్రిల్ నాటికి 6.6 శాతానికి పెరిగినట్లు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ నివేదిక వెల్లడించింది. జాతీయ సగటు కంటే నిరుద్యోగ పట్టభద్రులు రాష్ట్రంలో రెండింతలు ఎక్కువగా ఉన్నారని ఆ సంస్థ విడుదల చేసిన సర్వేలో తేలింది. రాష్ట్రంలోని నిరుద్యోగుల్లో 73 శాతానికి పైగా పట్టభద్రులే. జాతీయ స్థాయిలో పట్టభద్రల నిరుద్యోగిత రేటు 17.23 శాతం ఉంటే రాష్ట్రంలో 35.14 శాతంగా ఉంది. ఉపాధి, ఉద్యోగాలు లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి చెప్పడం వాస్తవం కాదా? కమీషన్ల కక్కుర్తితో మూడున్నరేళ్లలో 17 లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి తమ ఉపాధికి గండి కొట్టడంపై లక్షలాది యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


**మౌలిక వసతుల కల్పనపై చిత్తశుద్ధి లేదు!**


వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేకపోవడం కూడా ఉపాధి అవకాశాలను కోల్పోయేలా చేసింది. ఈ ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కూడా నిర్లక్ష్యం చేసింది. నాలుగేళ్లలో రూ.2.20 లక్షల కోట్ల నగదును సంక్షేమ పథకాలకు పంపిణీ చేశామన్న ప్రభుత్వం మౌలిక సదుపాయాలకు మాత్రం అందులో పదిశాతం కూడా ఖర్చుపెట్టలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్, కాకినాడ పెట్రోకెమికల్ సమూహం, శ్రీకాళహస్తి ఎలక్ట్రానిక్స్ పారిశ్రామిక క్లస్టర్, బెంగళూరు–చెన్నై పారిశ్రామిక క్లస్టర్, శ్రీసిటి పారిశ్రామిక సమూహం, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో రెండు సమీకృత పారిశ్రామిక టౌన్‌షిప్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మ్యానుఫాక్చరింగ్ జోన్)ల ఏర్పాటుకు కేంద్రం అనుమతి వచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టుల అమలుకు ఉత్సాహం చూపించలేదు. ఈ ప్రాజెక్టులకు భూసేకరణ చేయక పోవడంతో పరిశ్రమలు ఏర్పడలేదు. ఫలితంగా యువతకు కొలువులు లేకుండా పోయాయి. వీటిలో సగం ఏర్పాటైనా 10 లక్షల మందికి పైగా ఉద్యోగాలొచ్చేవి.

**ఐటీలో వెనుకబాటు**

ప్రభుత్వం పనితీరు, పోకడలు రాష్ట్రంలో ఐటీ రంగంపై కూడా ప్రభావం చూపించాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగం నాలుగేళ్ల నుంచి ఆశాజనకంగా లేదు. ప్రధాన ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎంపికలు నాలుగేళ్ల నుంచి బాగా తగ్గిపోయాయి. గత ఏడాది ఎంపికైన వారిని కూడా ఇప్పటికీ ఉద్యోగాలకు పిలవలేదు. ఇందులో బహుళ జాతి కంపెనీలు కూడా ఉన్నాయి. ఇదో సమస్య అయితే చదివిన వారికి రాష్ట్రంలో ఉద్యోగాలు లభించడం లేదు.

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఉత్తర భారతదేశం వెళ్లాల్సి వస్తోంది. రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ కంపెనీల ఏర్పాటుకు అవసరమైన వాతావరణం లేకపోవడం, ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు కంపెనీల రాకకు అవరోధంగా మారినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. అందువల్ల ఏపీలో అసలు ఐటీ ఇండస్ట్రీ ఏమాత్రం ఆశాజనకంగా లేదు. అయిదేళ్ల క్రితం గన్నవరంలో నిర్మించిన హెచ్‌సీఎల్‌తో పాటు మరో నాలుగైదు కంపెనీలు తప్ప ఉన్నవన్నీ స్టార్టప్‌లే. 2021–22లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి జరిగిన ఐటీ ఎగుమతుల విలువ కేవలం రూ.926 కోట్లే. భారతదేశం నుంచి జరిగిన ఐటీ ఎగుమతుల్లో ఇది 0.14 శాతం మాత్రమే. గత ఐదేళ్లలో ఐటీ ఎగుమతుల్లో ఏపీ వాటా 0.2 శాతం కంటే తక్కువ గానే ఉంది. ఐటీరంగం పట్ల ప్రభుత్వ ఉదాసీనత వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ★





# కీలకపాత్రధారి కైక

దశరథుని మూడవ భార్య కైకేయి.రామాయణాన్ని కీలక మలుపు తిప్పిన పాత్ర. ఆమే లేకపోతే రాముడు వనవాసానికి వెళ్లేవాడు కాదు, వేలాదిమంది దుష్టరాక్షసుల సహా రావణ సంహారం జరిగి ఉండేది కాదు. అసలు రామావతార ఉద్దేశ్యమే రావణ సంహారం కాబట్టి అందుకు అవసరమైన కీలకమైన కైకది నిజం చెప్పాలంటే పెద్ద పాత్రే.

రామ లక్ష్మణ భరత శతృఘ్నులకు పెండ్లిండ్లయి నిత్యకల్యాణం పచ్చతోరణంగా ఉంది. పన్నెండు ఏళ్లు గడిచాయి. కాలం బలీయం. ఎప్పుడూ ఒకేలా నడవదు.

దశరథుడికి తనకేదో ఏదో ప్రాణాపాయం ఉన్నట్టు అమంగళాలు స్ఫురించాయి. అపాయం పొంచి ఉన్నదని కార్తాంతికులు తెలుసుకొన్నారు. రాజ్యం రాజు లేనిదిగా క్షణం గూడ ఉండగూడదు కాబట్టి రామ పట్టాభిషేకానికి వసిష్ఠుడు ఆపద్ధర్మ ముహూర్తం పెట్టాడు. దశరథుడు రాముణ్ణి పిలిచి,'రేపు నీ యువరాజ్యపట్టాభిషేకం' అని చెప్పి, పాటించవలసిన నియమాలు చెప్పాడు. రాముడు సరే అన్నాడు. ఈ శుభ సందర్భాన...

అయోధ్యాపురం వీధివీధి మంగళతోరణాలు, తీర్చిదిద్దిన సుమమాలలతో చూడముచ్చటగా ఉన్నాయి. ఎక్కడికక్కడ నృత్యగానాలు ఏర్పాటు చేశారు. ఎటు చూసినా జయజయధ్వానాలు మారుమోగుతున్నాయి. రాజభవనంలో వేడుక అంటే ఎవరికీ వారికి తమ ఇంట్లో వేడుక మాదిరిగానే ఉంది.

కైకేయి దగ్గర పనిచేసే మంధరకు ఆమె పట్ల మమతానురాగాలు ఉన్నాయి. రామ పట్టాభిషేక సమాచారాన్ని కైకకు తెలిపినప్పుడు, సంతోషం పట్టలేక తన మెడలోని హారం వెంటనే మంధరకిచ్చింది.

రాజ్యం కైకేయి కుమారుడికి కాకుండా కౌసల్య తనయుడు శ్రీరాముడికి దక్కడం నచ్చని మంధర తన మాటలతో కైక మనసును కలుషితం చేసింది. 'రేపటి నుంచి కౌసల్య పెత్తనం కొనసాగుతుంది. నిన్ను నీ బిడ్డను ఎవరూ లెక్క పెట్టరు. దీనిని ఆపడానికి ఒకటే మార్గం. మహారాజు నీకు ఎపుడో వరాలిచ్చినట్టు చెప్పావు గదా! ఆ రెండు వరాలు కోరు' అని సలహా చెప్పింది.

మంధర మాటలతో కైకేయికి మనసంతా భారమైంది. ' తాను ఇలా ఆలోచించలేదే.. నిజంగానే తెలివి తక్కువగా వ్యవహరించాను

ఆధ్యాత్మికం

## ❋ 'మొక్క'బడి ❋



బేరీపండ్లను ఆంగ్లంలో పియర్ ఫ్రూట్ అంటారు. ఇది అధిక పోషక విలువలు, రుచిగల స్వభావం కలిగిన రుచికి, పోషక విలువలకే కాదు, ఆరోగ్యానికి కూడా బాగా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి శక్తిమంతంగా పనిచేస్తుంది. ఇది మన శరీరానికి ఆరోగ్యకరమైన సరైన జీర్ణ వ్యవస్థను సృష్టిస్తుంది. అలాగే, ఇది కురుల ఆరోగ్యానికి, చర్మపోషణకు బాగా పని చేస్తుంది.

నెల రోజులపాటు రోజుకొక బేరీ పండును తింటే శరీరంలోని క్యాన్సర్ కణాలు బలహీన పడతాయి. రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బేరీ పళ్లు గుండె ఆరోగ్యాన్ని

అనుకుంది. మంధరకు తనమీద ప్రేమ ఉండబట్టి జరగబోయే పరిణామాన్ని తెలియ చెప్పింది. బహుశా దేవుడే ఆమెకి ఆ బుద్ధి పుట్టించాడేమో.. సరే, ఇప్పటికైనా మించిపోయింది లేదు.. ఈ పట్టాభిషేకాన్ని ఎలాగైనా ఆపాలి' అనుకుంది.

ఒకమారు దేవదానవ యుద్ధంలో దేవేంద్రుడికి సహాయంగా దశరథుడు పాల్గొన్నాడు. ముచ్చటపడి దశరథునితో పాటు ఆ యుద్ధానికి వెళ్లిన కైక, సమరంలో రథం శీల ఊడిపోతూ ఉంటే సరిచేసి సహకరించింది. అప్పుడాయన ముచ్చట పడి రెండు వరాలు అనుగ్రహించగా, 'అవసరమైనప్పుడు అడుగుతాను' అని సమాధానమిచ్చింది. అదే ఇప్పుడు మంధర గుర్తు చేసింది. ఆ రెండు వరాలను ఇప్పుడు కోరుకుంటే సరి.. ఆయన ఎటూ మాట తప్పుడు కనుక తన కోరిక నెరవేరుతుంది' అనుకుంది. అలకపానుపెక్కింది.

శుభవార్త చెబుదామని సంతోషంగా వచ్చిన దశరథుడికి భిన్న వాతావరణం కనిపించింది. తనకు ఇచ్చిన రెండు వరాలుగా, తన కుమారుడు భరతుడికి పట్టాభిషేకం చేయాలని, రాముడిని 14 సంవత్సరాలు వనవాసానికి పంపాలని కోరింది. దిగులతో మంచం పట్టిన ఆయన సీతారామలక్ష్మణులు అడవులకు వెళ్లిన 15 రోజులకు దివంగతులయ్యాడు. ఆ సమయంలో మేనమామ ఇంట ఉన్న భరతుడు, అయోధ్యకు వచ్చి విషయాలు తెలుసుకొని పరితపించాడు. అనుచిత వరాలు కోరిన తల్లిపై కత్తి దూశాడు.

తండ్రి మరణానికి కారణమైన ఆమె వధ్యురాలే అని నిర్ధారణకు వచ్చాడు. తల్లి 'నీవే చక్రవర్తివి, పట్టాభిషేకం చేసుకో' అంటున్నది. పట్టరాని కోపంతో భరతుడు ఆ మాటలను వినలేక, 'తల్లిని చంపిన పాతకి మొగం చూడడు రాముడు' అనే ఒక్క విచారంతో కైకను వధించక విడిచాడు.

దశరథుడు అంత మొండిగా రాముడికే రాజ్యం ఇవ్వాలనుకోవడమూ, భరతుడు తల్లినే వధించాలని నిశ్చయించడం వెనక ఉన్నదీ, చివరికి నెరవేరిందీ ఒకటే ధర్మం. 'పెద్దవాడే రాజ్యాధికార బాధ్యత స్వీకరించాలి. అతడే సర్వవిధాలా అర్హుడు. మిగిలిన కారణాలన్నీ ఆ ధర్మం ముందు తోసివేయదగినవే' అనేది ఆ సనాతన ధర్మం.'

అతడు ఏ కారణం చేతనైనా అయోగ్యుడుగా నిర్ధారణ ఐనపుడే తర్వాతి వాడికి రాజ్యాధికార సంక్రమిస్తుంది. రాముడు పదునాలుగు సంవత్సరాలు రాజ్యాధికారానికి దూరమైతే ఆయనకు హక్కు లేకుండా పోయి, శాశ్వతంగా తన కొడుకే రాజుగా స్థిరపడిపోయి, తన మనుమలే వారసులౌతారని కైక ఆశ.

భరతుడేమో తనకే విధంగానూ రాజ్యం ప్రాప్తించగూడదనే ధర్మ నిశ్చయంలో ఉన్న వాడు. రామవనవాస గడువు ముగిసిన వెంటనే భరతుడు అన్నకు రాజ్యాన్ని భక్తిపూర్వకంగా అప్పగించాడు.

కుమారుడి ధర్మ దీక్ష ముందు కైకమ్మ స్వార్థం, అజ్ఞానం సిగ్గుతో తలవంచుకొన్నాయి. కైకను ఎవరు ఎంత ఆడిపోసుకున్నా, చుప్పనాతి అని తిట్టుకున్నా, ఆమె లేకుంటే రామాయణం కీలకమలుపు తిరిగేది కాదు కాబట్టి రామాయణంలో ఆమె పాత్ర చిరస్మరణీయం. ★

# బహుళ ప్రయోజనాల 'బేరీ'

మెరుగుపరుస్తాయి. హృదయ స్పందనలను నియంత్రించడానికి తోడ్పడతాయి. అలాగే, శరీరం అంతటా రక్తం సక్రమంగా ప్రవహించేందుకు గుండెకు సులభంగా పోషణ లభిస్తుంది. ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మధుమేహులు బేరీ పండును తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. దీనిని ముక్కలుగా తరగి వాటిపై కొద్దిగా ఉప్పు వేసి ప్రతిరోజూ తినడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. మృతకణాలలో అయిన కణాల పునరుత్పత్తి స్థానంలో పనిచేస్తుంది. రోజూ బేరీపళ్లు తినగలిగే పిల్లలకు ఇది మంచి ఎంపిక. ఈ పండును తినడం వల్ల వారి శరీరం అభివృద్ధి చెందుతుంది. బరువు తగ్గడానికి బేరీ పండు బాగా ఉపకరిస్తుంది.

ఈసారి పియర్ ఫ్రూట్స్ తెచ్చినప్పుడు వాటి విత్తనాలను ఇంటి ఆవరణలో నాటి సంరక్షించేందుకు ప్రయత్నించడం మంచిది. ★





# నిజమైన జీవితం

చెట్టుమీద పాకే గొంగళి పురుగు, జీవించడం అంటే ఏమిటో చెబుతుంది. అది మనిషి ముందే సీతాకోకచిలుకై ఎగిరి వెళ్తుంది. మనిషి మనసు మాత్రం గొంగళి పురుగులా ఉండిపోతోంది. 'ఎప్పటికైనా ఎదగాలి, ఎగరాలి' అని ప్రణాళిక సిద్ధం చేసుకోవడంతోనే మానవుడి సమయమంతా గడచిపోతోంది.

జీవించడంలో ఎంత ఉదాత్తత, ఔన్నత్యం ఉంటాయో తెలుసుకోవాలని ప్రకృతి పలు విధాలుగా బోధిస్తోంది.

అంతటా ఒకే రకమైన ప్రేమతత్వం పంచుతున్నా– ఈ జీవితం ఎందుకో, ఎలా జీవించాలో మనిషికి ఇంకా అవగాహన కావడం లేదు.

ఏదో విధంగా బతకడమన్నది నిజమైన జీవనం అనిపించుకోదు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టడమూ జీవనం కాదు. బతుకు బండిని ఎలాగోలా లాగించడమన్నదే మానవుడి అంతిమ లక్ష్యం కాకూడదు...! మనం ఎక్కడి నుండి వచ్చాం? ఎందుకు వచ్చాం? ఏమి చేస్తున్నాం? ఏమి చేయాలి? మనం ఎక్కడికి వెళతాము ? అనే ప్రశ్నలు మీలో తలెత్తి, వాటి గురించి వివరంగా తెలియజేసే జ్ఞానాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడమే నిజమైన జీవితం. ★

సన్నగా వాన చినుకులు!

బాల్కనీలోకి వచ్చాడు రిత్విక్. చేతిలో కాఫీ మగ్ ఉంది. మెల్లగా తాగుతూ ప్రకృతిలోకి చూస్తున్నాడు.

దూరంగా కొండ కనిపిస్తోంది. అక్కడక్కడ చెట్లు. కొమ్మలు వూగుతున్నాయి. వాటి మీద వాన చినుకులు పడుతున్నాయి.


ఇక్కడ నుండి నగరంలో ఓ భాగం కనిపిస్తుంది. అందుకే కాస్త దూరం అయినా మూడు గదుల ఫ్లాట్‌ని తీసుకున్నాడు. హైదరాబాద్‌కి వచ్చి అప్పుడే ఇరవై సంవత్సరాలు పూర్తి అవుతున్నాయి.

చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి ఏదో సాధించాలనుకున్నాడు. రకరకాల ప్రయత్నాలు చేశాడు. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే... నో రిగ్రెట్స్!

అక్కడే వుంటే కాస్త జీతం పెరిగి వుండేది. పెన్షన్ ఇంకాస్త ఎక్కువ వచ్చేది. తను మాత్రం కేవలం బతుకు కోసం, ఫైళ్ల మధ్య ఓ యంత్రంలా మిగిలిపోయి వుండేవాడు.

"నువ్వు చేయాల్సిన పని ఇది కాదు" అని మనసు ఎప్పటి నుంచో హెచ్చరికలు పంపుతూనే వుంది. అవసరాలు ఓ నిర్ణయాన్ని తీసుకోనివ్వలేదు. అవసరాలు-ఆశలు-ఆరాటాల మధ్య మనుషులు నలిగిపోతుంటారు. అందుకే కనీస జీవితాన్ని కాదనుకుని రిస్క్ చేయటానికి ధైర్యం చేయరు. సంవత్సరాలు గడిచిపోతుంటాయి. రిటైర్‌మెంట్‌కి రోజులు దగ్గరబడతాయి.

ఉద్యోగంలో వుండుంటే ఇదే రోజు చివరి రోజు!




ఎండిపై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

1



# మహా సంకల్పం





నాలుగు మంచి మాటలు చెబుతారు. శాలువాలు కప్పుతారు. మెమొంటోలు ఇస్తారు. కారులో చివరిసారి ఇంటి దగ్గర విడిచిపెడతారు. ఇరవై సంవత్సరాల క్రితం జరిగింది ఇదే.

ఆ చివరి క్షణాల్లో, ఉద్వేగంతో కళ్లు తడిసి పోతున్నాయి.

"ఇది మీరు కోరుకున్న జీవితం. కన్నీళ్లు ఎందుకు?" అంది హారిక నా చేతిని అందుకుని.

"మీ అమ్మా నాన్నల్ని వదిలి వస్తున్నప్పుడు నీకు దుఃఖం రాలేదా".

ఆమె మాట్లాడలేకపోయింది.

"నాతో కొత్త జీవితం ఎలా వుంటుందో తెలియదు. అయినా ఓ ఆశ. మనదైన బతుకు బతుకు తామన్న ఉత్సాహం వుంటుంది. అంత మాత్రాన నిన్నటి జీవితం మనల్ని అంత త్వరగా వదులు తుందా?" అన్నాడు.

వాన చినుకుల వేగం పెరిగింది.

గాలి ఓ జల్లుని ముఖాన్ని తాకేలా చేసింది.

రెండడుగులు వెనక్కి వేసాడు.

చినుకుల్ని చూడటం రిత్విక్‌కి కొత్తకాదు. జడివానలు చూశాడు. మెరుపులు, ఉరుములు, ప్రచండగాలుల్ని అనుభూతి చెందాడు.

అతను తన జీవితాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించా లనుకుంటాడు. సమయం దొరకదు.

నిరంతరం అతన్ని సృజన ఆవరించింది. అక్షరాలు అతన్ని పెనవేసు కున్నాయి. మనసు మళ్లీ హెచ్చరికలు పంపిస్తోంది. 'నువ్వు అనుకున్నదేమిటి? నువ్వు చేస్తున్న దేమిటి? ఇది నీకు తృప్తిని ఇస్తోందా? ఇవ్వదు. ఆలోచనాపరులకీ, సృజనకారులకీ ఏదీ తృప్తిని ఇవ్వదు. ఏదో కావాలి! అదేంటో తెలుసు. అయినా ఆ గమ్యం ఎప్పుడూ దూరంగానే వుంటుంది.

అప్పుడు 'మానస' గుర్తొచ్చాడు.

రెండు సంవత్సరాలుగా అడుగుతున్నాడు.

"చినుకులు... వాన... నిన్నటివి. ఓ కథ రాసివ్వు. నేను గూడు రిక్షాబండి మీద చూసాను. 'అలనాటి వానచినుకులు' అని రాసుంది. అదే అంశం మీద పుస్తకం తీసుకురావాలనుంది. కథకుల్ని అడుగు తున్నాను. కొంత మంది యిచ్చారు. నీదే ఆలస్యం".

"అలనాటి వానచినుకులు"

ఆ పేరు వెనక రొమాంటిసిజం వుంది. అద్భుత మైన ప్రేమ కథ రాయవచ్చు. బీభత్స ప్రధానమైన బతుకు వాస్తవాల్ని చెప్పవచ్చు. అయినా రిత్విక్ కలం కదలలేదు.

"నేను ఓ సినిమా చర్చల్లో పాల్గొన్నప్పుడు నాకు కొంత డబ్బు వచ్చింది. అది బ్యాంకులో వేసాను. ఆ డబ్బుని ఎన్ని అవసరాలు వచ్చినా తీయలేదు. ఓ కలల పుస్తకం. అది నా తొలిపుస్తకం. ఇంతకు ముందెప్పుడో రెండు మూడు కథలు రాసాను. మీ అందరితో పాటు నేనూ ఓ కథ రాస్తున్నాను".

మానసకి ఎప్పటి నుండో రాస్తున్నవారు, కొత్తగా రాస్తున్న వారు, తమ కథల్ని పంపించారు.

"నువ్వు పోటీలకు మాత్రమే రాస్తావా? బహుమ తులు కావాలా? నువ్వు ఎంత త్వరగా రాస్తావో నాకు తెలుసు. ఎందుకని రాయలేకపోతున్నావు?"

అది రిత్విక్‌కి తెలియదు. ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకుండా రాసిన రచనలెన్నో వున్నాయి. పోటీలకు, బహుమతులకు మాత్రమే అయితే రిత్విక్ ఇన్ని రచనలు చేసుండేవాడు కాదు.

వానంటే భయమా?

చినుకులంటే ద్వేషమా?

రిత్విక్ జీవితంలో వాన చినుకుల వెనక భయానక అనుభవాలున్నాయా?

కలం కదలదు.

ఆలోచనలు గడ్డకట్టుకుపోతాయి.

చివరిసారిగా నిన్న చెప్పాడు.

"రెండు రోజుల్లో ప్రింటింగ్‌కి వెళ్తోంది పుస్తకం.

**రచయిత పరిచయం**



**పి. చంద్రశేఖర ఆజాద్**

మహా సంకల్పం నవలకు ***'జాగృతి'*** వారపత్రిక బహుమతి ప్రదానం చేసినందుకు సంపాదకవర్గానికి, న్యాయనిర్ణేతలకు ముందుగా కృతజ్ఞతలు. ఇంతకుముందు 'మా తాత గీత మా ప్రయాణం' నవలకు, అనేక కథలకు బహుమతులు అందుకున్నాను. ఆ కథలు, నవల కూడా పాఠకులు ఆదరణ పొందాయి. అలానే కుటుంబ విలువలు కాపాడుకోవాలనే ఉద్దేశంతో రాసిన ఈ నవలను కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

రేపటి వరకూ అవకాశం వుంది. ఇంక నీఇష్టం".

"ఇప్పుడు రాస్తాను. అనుకోని ఈ వాన చినుకులు నన్ను హెచ్చరిస్తున్నాయి" అనుకున్నాడు రిత్విక్.

అప్పుడు ఫోన్ రింగయిన శబ్దం.

హారిక తీసుకొనివచ్చింది. ఎవరు అన్నట్లు చూసాడు.

"కొత్త నెంబర్" అంది. అందుకుని టాక్ బటన్ ప్రెస్ చేసి 'హలో' అన్నాడు.

"నేను బుద్ధ... గోవింద్ బుద్ధ".

''మీరా!'' అరిచినంత పని చేసాడు నమ్మలేనట్లుగా.

"ఎలా వున్నావు రిత్విక్?"

"బాగున్నాను సర్".

"నీ కమిట్‌మెంట్స్ గురించి నాకు తెలియదు. నువ్వు నా కోసం మినిమమ్ రెండు నెలల టైమ్ స్పెండ్ చేయగలవా?"

"అదీ... సర్" అని నసుగుతున్నాడు.

"కంగారు పడకు. ముందు నీ పనులు పూర్తి చేసుకో. నీకు ఎప్పటికి వీలు అవుతుందో చెప్పు. నీకు పాస్ పోర్ట్ వుందా?"

"వారం రోజుల్లో అది లాప్సవుతుంది. రెన్యూవల్ చేయించాలి సర్".

"వెంటనే ఆ పని చెయ్యి. ఇది నా పర్సనల్ నెంబర్. ఫీడ్ చేసుకో. నువ్వు ఎప్పుడయినా నాతో మాట్లాడవచ్చు. ఓ వేళ నేను ఫోన్ తీయకపోయినా ఏమీ అనుకోవద్దు. తర్వాత నేను చేస్తాను".

రిత్విక్ రచనా జీవితంలో అది పెద్ద మలుపు. ఆ నవల పేరుని గోవింద మార్చాడు. అంతకు ముందు రెండు నవలలు ఆయన ప్రచురించారు. అప్పుడు ఆయన రాసిన నాలుగు మంచి మాటలు అతనికి ఎప్పుడూ గుర్తుంటాయి. మానస అలనాటి వాన చినుకుల మీద కథ రాయమన్నప్పుడు ఆ నవల గుర్తు వచ్చింది. వాన మీద కొన్ని కథలు కూడా రాసాడు. ఇప్పుడు గోవింద్ ఫోన్ అందుకున్నప్పుడు కూడా వాన చినుకులు. ఇలాంటి యాదృచ్ఛిక సంఘటనలు రిత్విక్ జీవితంలో అనేకం వున్నాయి.



"అలాగే సర్".

"మరో విషయం. కొంత కాలం పాటు ఏదీ ఒప్పుకోవద్దు. అది రెండు నెలలు కావచ్చు. ఆరు నెలలు కావచ్చు."

"సర్...".

"నా ఆరోగ్యం కూడా అంత బాగుండటం లేదు రిత్విక్. మరీ ఆలస్యం చేయకు. ఉంటాను." అని ఫోన్ కట్ చేసాడు.

వాన చినుకులు తగ్గాయి.

"ఎవరు మాట్లాడింది?" అడుగుతోంది హారిక.

"గోవింద బుద్ధ".

"వారా!" అంది ఆశ్చర్యంగా. తలూపాడు.

"ఏమంటున్నారు?"

"రెండు నెలల నుంచి ఆరు నెలల దాకా నేను వారితో వుండాలంట".

"అదెలా కుదురుతుంది? నిన్ననే ఓ సీరియల్ వాళ్లు పిలిచారు. ఈ రోజు మాట్లాడాలి అన్నారు" అంది హారిక.




"ఆలోచిద్దాం. ఇంత సడన్‌గా గోవింద ఫోన్ చేయగలరని ఎలా అనుకుంటాను? ఆయన ఎందుకు పిలుస్తున్నారో తెలియదు. అందులోనూ తన ఆరోగ్యం బాగుండటం లేదు అన్నారు".

"నిజంగానా! సరే. ఏదొకటి చేయవచ్చు. మీరు టెన్షన్ పడవద్దు" అని లోపలకు వెళ్లింది.

వాన చినుకులు మళ్లీ మొదలయ్యాయి.

ఇంతకు ముందు వచ్చినవి ఆనాటి వాన చినుకులా? ఈనాటి వాన చినుకులా? అయిదు నిమిషాల క్రితం కురిసినవి కూడా నిన్నటివే. ఆనాటివే కదా? అసలు ఆ నాటి అనుకోవటానికి కొలబద్ద ఏమిటి అనుకున్నాడు.

'మానస' గుర్తొచ్చాడు.

"మానసగారూ మీరు ప్రింటింగ్‌కి వెళ్లిపోండి. ఆ కథ నేను రాయలేక పోతున్నాను".

కొద్ది సేపు మానస మాట్లాడలేదు.

"అలాగే రిత్విక్" అన్నాడు తర్వాత.

* * *

రిత్విక్ ఆలోచనల్లో వున్నాడు.

మూడు దశాబ్దాల క్రితం అతను రాసిన నవల గుర్తొచ్చింది. నల్లటి దట్టమైన ఓ రాక్షస మేఘం ఓ బీభత్స వాతావరణాన్ని సృష్టించటానికి కమ్ముకొస్తోంది. అది ప్రారంభ వాక్యం. ఆ నవల పేరు 'వర్షం కురవని రాత్రి'. అయిదు రోజుల్లో రాసాడు. రెండు మూడు పత్రికలు ఆ నవలను తిరస్కరించినప్పుడు బాధపడ్డాడు. మంచి నవలలు రాయమనటం వేరు. ఆదరించటం వేరు. ఆ నవలకు బహుమతి ఇచ్చింది గోవింద్ బుద్ధ.

రిత్విక్ రచనా జీవితంలో అది పెద్ద మలుపు. ఆ నవల పేరుని గోవింద మార్చాడు. అంతకు ముందు రెండు నవలలు ఆయన ప్రచురించారు. అప్పుడు ఆయన రాసిన నాలుగు మంచి మాటలు అతనికి ఎప్పుడూ గుర్తుంటాయి. మానస అలనాటి వాన చినుకుల మీద కథ రాయమన్నప్పుడు ఆ నవల గుర్తు వచ్చింది. వాన మీద కొన్ని కథలు కూడా రాసాడు.

ఇప్పుడు గోవింద్ ఫోన్ అందుకున్నప్పుడు కూడా వాన చినుకులు. ఇలాంటి యాదృచ్ఛిక సంఘటనలు రిత్విక్ జీవితంలో అనేకం వున్నాయి. అతని ఆలోచనలు గోవింద్ మీదకు మళ్లాయి.

మూడున్నర దశాబ్దాలుగా ఆయనతో అనుబంధం వుంది. ఈ మధ్య కాలంలో తన కథలూ, నవలలు ప్రచురించటం లేదు. మూడు సంవత్సరాలయింది. ఏది పంపినా వెనక్కి తిరిగి వస్తోంది. ఇన్ని సంవత్సరాల్లో అతన్ని కలుసుకుంది కేవలం మూడు సందర్భాల్లో మాత్రమే. అందులో ఒకటి వాళ్ల అమ్మాయి పెళ్లిలో.

నిజానికి గోవింద్ పత్రిక కోసం రిత్విక్ నవలలు రాసాడు. ఆయన ప్రచురించకపోతే ఇంకే పత్రిక ప్రచురించదు. ఆ ప్రయత్నాలు విఫలం అయ్యాయి. అందుకని అరుదుగానే రాస్తున్నాడు. ఆ సంస్థకి రెండు పత్రికలు. ఒకటి మాస పత్రిక. ఇంకోటి వార పత్రిక. మాస పత్రికలో క్రమంగా సీరియస్ రచనలకు చోటు తగ్గిపోయింది. అయినా అరుదుగా వచ్చేవి.

అలాంటిది ఇప్పుడు గోవింద్ నుండి ఫోన్! పాస్‌పోర్ట్ గురించి అడుగుతున్నారు. కొన్ని నెలల

సమయం కావాలంటున్నారు. తనను మాత్రమే పిలవటానికి కారణం ఏమిటి? కొన్ని వందల మంది గోవింద్‌కి తెలుసు. ఆయన రమ్మంటే మరో సంశయం లేకుండా వెళ్లేవారున్నారు. అలాంటిది...?

ఇది ఇతరులతో పంచుకునే అంశం కాదు. రహస్యంగా వుంచాలి. రిత్విక్‌కి తెలిసినంత వరకు గోవింద్ బుద్ధ అత్యంత సున్నితమైన మనిషి. ఆయన ఎప్పుడు ఎలాంటి మూడ్‌లో వుంటారో తెలియదంటారు. అలాంటి వ్యక్తితో తను ప్రయాణం చేయగలడా? అనే సందేహం కలవరపెడుతోంది.

దానికి ముందు తనకు వస్తున్న అవకాశాలన్నీ వదులుకోవాలి. అందుకు అభ్యంతరం లేదు. తమకున్న ఇద్దరు పిల్లలు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఒకడు విశాఖలో, ఇంకొకడు బెంగళూరులో వుంటున్నాడు.

తనూ, హారిక సినీ, టీ.వీ. ఇండస్ట్రీ వుంది కాబట్టి హైదరాబాద్‌లో వుంటున్నారు.

"ఎందుకింత సీరియస్‌గా ఆలోచిస్తున్నారు?" అంటూ హారిక వచ్చింది.

"కూర్చో" అన్నాడు. సోఫాలో ఎదురుగా కూర్చుంది.

"ఇప్పుడు ఆలోచిస్తుంటే చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. వారం పది రోజులయితే ఫర్వా లేదు. నెలలంటున్నారు. ఇక్కడ మనిద్దరం వుంటున్నాం. రేపటి నుండి నువ్వు ఒక్కదానివి వుండాలి".

"నా గురించా మీ దిగులు? కొంతకాలం నేను విశాఖ, బెంగళూరుల మధ్య తిరుగుతాను. పిల్లలు కూడా మీరు హైదరాబాద్ నుండి కదలటం లేదంటున్నారు. నేను ఇంకోటి ఆలోచిస్తున్నాను".

"అదేంటి?"

"మీరు సినిమాలకు పని చేయాలని ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. తర్వాత టీ.వీ. సీరియల్స్ రాస్తున్నారు. ఇప్పుడవన్నీ వదిలి వెళ్లటానికి బాధగా వుందేమో అనుకుంటున్నాను" అంది హారిక.

"అలా అని కాదు. ఈ మధ్య సీరియల్స్ రాయటం తగ్గించాను. కథలూ, నవలలూ ఇది వరకటిలా రాయలేకపోతున్నాను. నా ఆరోగ్యం ఇది వరకటిలా లేదు. నాకూ బీ.పీ., షుగర్ ఎటాక్ అయ్యాయి. అవి పక్క నుంచు. నేను ఉద్యోగానికి రాజీనామా ఇవ్వాలనుకున్నప్పుడు అందరూ వద్దన్నారు. అప్పుడు నేను కలుసుకుంది గోవింద్ గారిని. ఆ రోజు గేట్ దాకా వచ్చి పంపించారు. అప్పుడాయన అన్నమాట మరిచిపోలేను. ఇన్ కేస్ ఆఫ్ ఫెయిల్యూర్ డోంట్ వర్రీ రిత్విక్. ఐ విల్ బీ విత్ యు. నువ్వు ఎప్పుడయినా మన సంస్థలోకి రావచ్చు అన్నారు. నీకు గుర్తుందా?"

"ఎలా మరిచిపోతానండి!"

"అనుకున్నట్లుగా నేను సినిమాలకు పని చేయలేకపోయాను. బతకటం కోసం టీ.వీ.కి రాసాను. కొన్ని వేల ఎపిసోడ్లు రాసాక నాకు ఆ మోజు పోయింది. మరీ ఖాళీగా వుంటున్నాను. మిత్రులు బలవంతం చేసారు – ఈ ఒక్క సీరియల్ రాయమని. అందుకు ఒప్పుకున్నాను. మనం కుదరదంటే ఇంకొకరిని చూసుకుంటారు".

"మరేంటి సమస్య?"

"గోవింద్ గారు పాస్‌పోర్ట్ అంటున్నారు. అంటే విదేశాలు కూడా వెళ్లాల్సి వుంటుందా అని అనుమానం వస్తోంది".

"అంతకంటే ఏం కావాలి?"

ఆశ్చర్యంగా చూసాడు రిత్విక్.

"మీరు పాస్‌పోర్ట్ తీసుకుంది విదేశాలు వెళ్లటానికే కదా! ఇప్పటికి రెండు సార్లు రెన్యూవల్ చేయించారు. అరవై దాటాక మీకు అదృష్టం కలిసి వస్తుందేమో!"

"నువ్వు లేకుండానా?" అన్నాడు. ఆమె కళ్లు పెద్దవయ్యాయి.

"ఇది అదృష్టం అంటావా?" అంతలోనే అడిగాడు.

"నాకు విదేశాలు చూడాలని ఎప్పుడూ లేదు. అందుకే మీరు నాకూ పాస్‌పోర్ట్ తీసుకుంటానన్నా వద్దన్నాను. అది అదృష్టం కాదు అని మీరు అనుకుంటే అదే మాట గోవింద్ గారికి చెప్పండి".

**(సశేషం)**


**జాగృతి ఆధ్వర్యంలో ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి**

**స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక**

**'నవలల పోటీ- 2023'కి రచయితలను ఆహ్వానిస్తున్నాం..**



**1936-2022**

**ప్రథమ బహుమతి రూ. 25,000**

**ద్వితీయ బహుమతి రూ. 20,000**

**సూచనలు :**

➺ ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి. ➺ నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు. ➺ సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. వ్రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు. ➺ నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా మొబైల్ నంబర్‌తో సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి. ➺ ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

➺ **నవలలు పంపవలసిన చిరునామా : 3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.**

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 21 జూన్, 2023**




# ఖాన్ కొత్త గేమ్

**పాకిస్తాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ అధినేత ఇమ్రాన్‌ఖాన్ (70) అరెస్ట్ ఊహించిందే. పదవి పోయిన తర్వాత ఇంతకాలం అరెస్ట్ కాకుండా నెట్టుకురావడంలో ఇమ్రాన్‌ఖాన్ చరిత్ర సృష్టించారనే చెప్పాలి. కానీ న్యాయస్థానం ఎదుటే ఆయనను భద్రతాదళాలు ఈడ్చుకుంటూ తీసుకుపోవడం అందరినీ విస్తుపోయేటట్టు చేసింది. పాకిస్తాన్‌లో అధ్యక్ష, ప్రధాని, ఆర్మీచీఫ్ వంటి ఉన్నతస్థానాల్లో పనిచేసిన వారికి ఆ పదవుల్లో ఉన్నంత వరకే రక్ష! పదవి పోయిందంటే ఇక వారి పతనం మొదలైనట్టే. విచారణలు, జైళ్లు, అవసరమైతే మరణ దండనలు! పాకిస్తాన్‌లో గతం నుంచి వర్తమానం వరకు జరుగుతున్న చరిత్ర ఇదే! పదవిని కోల్పోయిన తర్వాత ఆ దేశ అధ్యక్షులు, ప్రధానులు విదేశాల్లో స్థిర పడటానికి ప్రధాన కారణం ఇదే! కాకపోతే ఇమ్రాన్‌ఖాన్ గత ప్రధానుల మాదిరిగా కాకుండా దేశంలోనే ఉండి సైన్యానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్నారు.**

ప్రజాదరణే శ్రీరామరక్షగా ఇప్పటి వరకు అరెస్ట్ కాకుండా ఆపగలిగినా వెంటాడి, వేధించే ప్రభుత్వ వ్యవస్థల ముందు ఈ రక్షణ కొంతమేర మాత్రమే ఉపయోగపడుతుందన్న నగ్నసత్యాన్ని ఇమ్రాన్‌ఖాన్ ఉదంతం వెల్లడి చేస్తున్నది. ఆ విధంగా పాక్‌లో అరెస్టయిన 7వ మాజీ ప్రధానిగా ఆయన చరిత్రలో నిలిచారు. విపక్షనేతగా ఇంతకాలం దేశంలోనే ఉంటూ, ప్రభుత్వాన్ని, సైన్యాన్ని తూర్పారబడుతూ పాక్ ప్రజల్లో ప్రతిష్టను పెంచుకున్న నాయకుడిగా కూడా ఇమ్రాన్‌ఖాన్ తనదైన ముద్రవేశారు. ఎట్టకేలకు పాక్ పారామిలటరీ మే 9, 2023న ఇమ్రాన్‌ఖాన్ ఇస్లామాబాద్ హైకోర్టులో ఉండగా లోపలికి ప్రవేశించి మరీ అరెస్ట్ చేశారు. తోషాఖానా కేసులో విచారణకు ఖాన్ గైర్హాజరవుతుండటంతో ఇస్లామాబాద్‌లోని డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ఆయన అరెస్ట్‌కు ఆదేశాలు జారీచేసింది. అయితే విచిత్రంగా ఆయన మే 9న అల్–ఖదీర్ ట్రస్ట్ అవినీతి కేసులో అరెస్టవడం గమనార్హం.

ఇంతకూ ఈ కేసులో ప్రధాన ఆరోపణ ఏంటంటే…గత ఏడాది జూన్‌లో ఖాన్ ఆయన భార్య బుష్రాబీబీలు, పాకిస్తాన్‌లో స్థిరాస్తి దిగ్గజ వ్యాపారి మాలిక్ రియాజ్ నుంచి కొన్ని బిలియన్ల రూపాయల (మిలియన్ల డాలర్లు) విలువైన భూమిని విద్యాసంస్థను నెలకొల్పే మిషతో తమ అధీనంలోని 'అల్ ఖదీర్ ట్రస్ట్' కోసం పొందారని, ఇందుకు ప్రతిగా క్విడ్ ప్రో కో కింద అతనికి దేశ ఖజానాకు నష్టం కలిగించే రీతిలో 239 మిలియన్ డాలర్ల మేర ప్రయోజనం కలిగించారన్నది ప్రధాన ఆరోపణ. ఇదిలావుండగా గత ఏడాది తనపై జరిగిన హత్యాయత్నంలో ఐఎస్ఐకు చెందిన ఉన్నతాధికారి ఫైజల్ నజీర్ ప్రమేయం ఉన్నదని ఇమ్రాన్‌ఖాన్ గతంలో మాదిరిగానే మే 7న కూడా ఆరోపించారు. వీటిని ఖండిస్తూ సైన్యానికి చెందిన మీడియా విభాగం ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) ప్రకటన విడుదల చేసిన తర్వాత ఈ అరెస్ట్ జరగడం గమనార్హం. ఇక్కడ గమనించాల్సిన అంశమేంటంటే ఖాన్‌ను అరెస్ట్ చేసింది పోలీసులు కాదు పాక్ రేంజర్లు. అంటే పారా మిలిటరీ దళం. అంతర్గత భద్రత మాత్రమే వీరి బాధ్యత. పోలీసులు కాకుండా రేంజర్లు అరెస్ట్ చేశారంటే దీని వెనుక సైన్యం ఉన్నదనే అర్థం.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

### అనుబంధం వికటిస్తే విధ్వంసమే

ఒకప్పుడు సైన్యంతో ఉన్న గాఢమైన 'అనుబంధం' ఖాన్‌ను అందలం ఎక్కిస్తే, వికటించిన 'బంధం' పదవీచ్యుతుడిని చేసింది. ఇందులో ప్రధానపాత్ర పోషించిన సైన్యం గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజాగ్రహానికి గురవుతోంది. పాక్ సైన్యానికి తొలిసారి ప్రజల నుంచి ఎదురవుతున్న చేదు అనుభవం ఇది! అసలే అప్పులు పుట్టక ఆర్థికంగా నానా ఇబ్బందులు పడుతుంటే ఇమ్రాన్ ఖాన్ కారణంగా రగిలిన రావణ కాష్టం…'పాము తన తోకను తానే మింగుతున్న' చందంగా పరిస్థితిని దిగజార్చింది. ఇమ్రాన్‌ఖాన్ ఎటూ తప్పించుకోకుండా వందకు పైగా కేసులు బనాయించినా వచ్చే అక్టోబర్‌లో జరిగే ఎన్నికల్లో ఆయన పార్టీ అప్రతిహత విజయానికి ప్రస్తుత పరిణామాలు రాచబాట వేస్తాయనడంలో సందేహంలేదు.

### రాజకీయ సంక్షోభం

విపక్షాలన్నీ పాకిస్తాన్ డెమోక్రటిక్ ఫ్రంట్‌గా (సైన్యం ప్రమేయం లేకుండా ఏదీ జరగదు) ఏర్పడి 2022లో ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని డిప్యూటీ స్పీకర్ ఖాసిమ్ ఖాన్ సూరీ డిస్మిస్ చేయడంతో దేశంలో రాజకీయ సంక్షోభం మొదలైంది. ఇది 2022 ఏప్రిల్ 3 నుంచి 10దాకా కొన సాగింది. తర్వాత ఖాన్ సిఫారసు మేరకు దేశాధ్యక్షుడు అరీఫ్ అల్వీ నేషనల్ అసెంబ్లీని రద్దు చేయడంతో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడింది. అయితే సుప్రీంకోర్టు నేషనల్ అసెంబ్లీని పునరుద్ధరించిన తర్వాత, ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో ఖాన్ ప్రభుత్వం కుప్పకూలిపోయింది. తర్వాత ప్రధానమంత్రి పదవిని షహబాద్ షరీఫ్ చేపట్టారు. అయితే ఖాన్ మాత్రం తాను పదవి కోల్పోవడం వెనుక అమెరికా హస్తముందంటూ ఆరోపించడం మొదలుపెట్టారు. 2022 ఆగస్టు నెలలో పాకిస్తాన్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ ఇమ్రాన్ ఖాన్‌కు వ్యతిరేకంగా తోషాఖానా కేసును పెట్టింది. తోషాఖానా బహుమతుల వివరాలను వార్షిక ఆస్తుల వివరాలతో పాటు ఎన్నికల సంఘానికి సమర్పించ లేదనేది ప్రధాన ఆరోపణ. దీనిపై విచారణ ప్రారంభించిన ఎన్నికల సంఘం అక్టోబర్ 21,2022న ఇమ్రాన్‌ను పార్లమెంట్ నుంచి అనర్హుడిగా ప్రకటించింది. రాజ్యాంగంలోని 63(1)(పి) ప్రకారం ఆయనపై క్రిమినల్ విచారణ చేపట్టాలని ట్రైల్‌కోర్టుకు ఆదేశాలు పంపింది. కాగా, తక్షణమే ఎన్నికలు జరపాలని, ఆర్మీచీఫ్‌ను తొలగించాలన్న ఇమ్రాన్ డిమాండ్‌ను ప్రభుత్వం తిరస్కరించడంతో అక్టోబర్ 28, 2022న లాహోర్ నుంచి ఇస్లామాబాద్ మార్చ్ చేపట్టారు. తర్వాత నవంబర్ 3వతేదీన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పంజాబ్‌లోని వజీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తుండగా, ఖాన్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో, ఆయన గన్‌మెన్ సహా తొమ్మిది మంది పార్టీ కార్యకర్తలు గాయపడగా, ఒక కార్యకర్త మరణించాడు. ఇమ్రాన్‌ఖాన్‌తో పాటు సెనెటర్ ఫైజల్ జావెద్‌ఖాన్ కూడా ఈ సంఘటనలో



గాయపడ్డారు.

**జర్నలిస్టు లాగిన తీగ...**

ప్రధానిగా ఇమ్రాన్‌ఖాన్‌కు విదేశాలనుంచి అందిన బహుమతుల వివరాలు తెలియజేయా లంటూ ఇస్లామాబాద్‌కు చెందిన రాణా అబ్రార్ ఖలీద్ అనే జర్నలిస్టు 2021లో సమాచార హక్కు చట్టం కింద పాకిస్తాన్ ఇన్ఫర్మేషన్ కమిషన్ (పీఐసీ)కి ఒక దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని అందజేయాలని పీఐసీ, కేబినెట్ డివిజన్‌ను ఆదేశించింది. ఈ సమాచారాన్ని అబ్రార్‌కు పదిరోజుల్లో అందజేస్తామని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచుతామని కేబినెట్ డివిజన్ పేర్కొంది. ఆ తర్వాత కేబినెట్ డివిజన్ మాటమార్చి, పీఐసీ తనకు ఇటువంటి ఆదేశాలు ఇవ్వడం చట్టవిరుద్ధమంటూ ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తోషాఖానా బహుమతుల వివరాలు చట్టం ప్రకారం ఎవరికీ తెలియజేయడం సాధ్యం కాదంటూ వాదించింది. చివరకు 2022 ఏప్రిల్‌లో హైకోర్టు, పీఐసీ ఆదేశాలకు అనుగుణంగా.. బహుమతుల వివరాలను వెల్లడించాలని డిప్యూటీ అటార్నీ జనరల్ అర్షద్ ఖయానీని ఆదేశించింది. అయితే 2018 నుంచి ఇమ్రాన్‌ఖాన్ తోషాఖానా వివరాలను బహిరంగ పరచడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఎట్టకేలకు గత ఏడాది సెప్టెంబర్ 8న ఎన్నికల సంఘానికి ఆయన జవాబిస్తూ, విదేశాలనుంచి వచ్చిన బహుమతుల్లో నాలుగింటిని అమ్ముకున్నట్లు అంగీకరించారు. దీంతో ఎన్నికల సంఘం ఆయన్ను పార్లమెంట్ సభ్యుడిగా అనర్హుడిగా ప్రకటిస్తూ కేసును క్రిమినల్ విచారణ కోసం ట్రైల్‌కోర్టుకు పంపింది. అయితే ఎన్నికల సంఘం తీర్పును ఖాన్ అక్టోబర్ 22,2022న ఇస్లామాబాద్ హైకోర్టులో సవాలు చేయడం కొసమెరుపు.

**తోషాఖానా అంటే...**

1974లో ఏర్పాటైన తోషాఖానా కేబినెట్ డివిజన్ అధీనంలో ఉంటుంది. విదేశీ ప్రతినిధులు పాక్ రాజకీయ నాయకులు, అధికార్లు, దౌత్యవేత్తలు, మిలిటరీ అధికార్లు మొదలైన వారికి ఇచ్చే బహుమతులను ఇక్కడ భద్రపరుస్తారు. పాక్‌లోని నిబంధనల ప్రకారం ఆయా డిగ్నిటరీలు తమకు వచ్చిన బహుమతుల వివరాలను కేబినెట్ డివిజన్‌కు తెలిపి, తోషాఖానాలో భద్రపరచేందుకు అప్పగించాలి. ఇమ్రాన్ ఇందుకు విరుద్ధంగా తనకు వచ్చిన బహుమతులను నేరుగా బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడని, మొహిసిన్ షహనవాజ్ రంఝాతో పాటు మరికొంతమంది సంకీర్ణ ప్రభుత్వంలోని నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.


**కొనసాగిన విధ్వంసకాండ**

ప్రజల్లో మంచి పలుకుబడి ఉన్న ఖాన్‌కు మద్దతుగా ఈ అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ పాక్‌లో పెద్దఎత్తున అలర్లు చెలరేగాయి. ఖాన్ అరెస్ట్‌తో ఇస్లామాబాద్, కరాచీ, లాహోర్, పెషావర్లలో ఆయన మద్దతుదార్లు పెద్దఎత్తున అల్లర్లకు పాల్పడ్డారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా కనీసం 290 మంది గాయపడ్డారు. పెషావర్‌లో రేడియో పాకిస్తాన్ కార్యాలయాన్ని తగులబెట్టారు. లాహోర్‌లోని మిలిటరీ కార్ప్స్ కమాండర్ ఇంటిపై దాడిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. సైనిక ప్రధాన కార్యాలయంపై దాడికి పాల్పడారు. వాళ్లను సైన్యం అడ్డుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించటం విశేషం. పోలీస్ స్టేషన్ల నుంచి ఆయుధాలను లూటీ చేస్తున్నారు. పెషావర్‌లో పారామిలటరీ దళాలపై కాల్పులకు దిగారు. అయితే కాల్పులు జరిపిన వారు ప్రొఫెషనల్స్ కాకపోవడంతో ఎవరికీ గాయాలు కాలేదు. కాల్పులకు పాల్పడిన వారిని మాత్రం అరెస్ట్ చేశారు. లండన్‌లో పాకిస్తాన్ హైకమిషన్ ఎదుట ఖాన్ మద్దతుదార్లు నిరసన ప్రదర్శన చేశారు. ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్ వల్ల ఇంతటి వ్యతిరేకత ఎదుర్కొనాల్సి వస్తుందని బహుశా సైన్యం ఊహించి ఉండదు. ఇంత విధ్వంసం జరుగుతుండగానే, ఖాన్ అరెస్ట్ చట్టబద్ధమేనని ఇస్లామాబాద్ కోర్టు ప్రకటించింది. అయితే 11వ తేదీన పాక్ సుప్రీంకోర్టు, ఖాన్ అరెస్ట్ చట్టవిరుద్ధమని ప్రకటించడమే కాదు, ఆయన్ను వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. ఇమ్రాన్ అరెస్ట్‌ను జర్నలిస్టులు, లాయర్లు ప్రశ్నిస్తున్నారు. అరెస్ట్ చట్టవిరుద్ధమని దేశంలో విమర్శలు వెల్లువెత్తుతున్నా ఖాన్‌ను ఒక రహస్యప్రదేశానికి తరలించి విచారిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

**ఇమ్రాన్‌కు పెరగనున్న ప్రజాదరణ**

ప్రస్తుత అరెస్ట్‌ను పాక్‌లోని చాలామంది ప్రజలు 'రాజకీయ వేధింపులు' గానే చూస్తున్నారు. ఇమ్రాన్‌కు వ్యతిరేకంగా ఎన్ని ఆధారాలున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతేకాదు నేషనల్ అకౌంటబులిటీ బ్యూరోను తమ ప్రత్యర్థులను వేధించడానికి ప్రభుత్వం ఒక ఉపకరణంగా వాడుకుంటున్నదన్న అభిప్రాయం ప్రజల్లో బలపడే అవకాశముంది. గతంలో ఖాన్ ప్రభుత్వం, ప్రస్తుత ప్రధాని షహబాజ్ షరీఫ్‌ను అరెస్ట్ చేయడానికి ఈ బ్యూరోనే ఉపయోగించుకున్న సంగతి గుర్తుకు తెచ్చుకోవాలి. ప్రస్తుత పరిణామాలు ఖాన్ పలుకుబడిని మరింతగా పెంచుతాయి. ముఖ్యంగా సైన్యానికి వ్యతిరేకంగా గళం విప్పుతున్న నేతగా ఆయన మరింత ప్రజాదరణ పొందవచ్చు. నిజం చెప్పాలంటే మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, ప్రస్తుత ప్రధాని ఆయన సోదరుడు అయిన షహబాజ్ షరీఫ్‌ల కంటే, ప్రజాదరణలో ఖాన్ ఎంతో ముందున్నాడు. వచ్చే అక్టోబర్‌లో దేశంలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ లోగా ఖాన్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించవచ్చు. ముఖ్యంగా ఆయనపై అనర్హత వేటుకు ప్రయత్నించవచ్చు. ఒకవేళ ఖాన్‌ను జైలుకు పంపినా ఆయన పార్టీ పాకిస్తాన్ తెహరిక్ ఇ ఇన్సాఫ్ అధికారంలోకి వచ్చే అవకాశాలే ఎక్కువ. ★






"అంటే మీరు, గాంధీజీ హత్య కేసులో నన్ను అరెస్ట్ చేయడానికి వచ్చారు!"

ఫిబ్రవరి 5, 1948న బొంబాయి ఇంటెలిజెన్స్ శాఖ అధిపతి జంషెడ్‌జీ దొరాబ్ నగర్వాలా శివాజీ పార్క్ నివాసానికి సిబ్బందితో వచ్చి తలుపు తట్టాడు. ఇతడినే జిమ్మీ నగర్వాలా అని కూడా పిలిచేవారు. అది హిందూ మహాసభ నాయకుడు వినాయక్ దామోదర్ సావర్కర్ నివాసం. తలుపు తెరిచిన సావర్కర్, విషయం చెప్పాక అన్నమాట అది. ఎలాంటి అభియోగం మోపకుండానే ఆయనను బొంబాయిలోనే ఆర్థర్ రోడ్ జైలుకు తరలించారు. సావర్కర్ అనే మహోన్నత దేశభక్తుడిపై నాటి భారత ప్రభుత్వం ఒక హంతకునిగా ముద్ర వేసిన దారుణ క్షణమది.

నిజానికి, జనవరి 31,1948న ఆ శివాజీ పార్క్ నివాసానికి వచ్చిన దొరాబ్ నగర్వాలా చాలా కాగితాలు, 143 ఫైళ్లు, దాదాపు 10,000 ఉత్తరాలు స్వాధీనం చేసుకున్నాడు. సావర్కర్‌ను మాత్రం అరెస్ట్ చేయలేదు. ఇదంతా ఆ జనవరి 30, 1948 సాయంత్రం ఢిల్లీలోని బిర్లా హౌస్ ఆవరణలో జరిగిన గాంధీజీ హత్యకు సంబంధించిన వ్యవహారమే. ఇంతకీ ఆయన మీద నేరం రుజువైందా? ఆ విషయమే ఈ వ్యాసం చర్చిస్తుంది. యాభయ్ సంవత్సరాల శిక్షవేసి అండమాన్ కారాగారంలో పరాయి ప్రభుత్వం పెట్టిన మానసిక శారీరక క్షోభ కంటే, స్వతంత్ర భారతదేశంలో గాంధీజీ హత్య పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుతో ఆయన అనుభవించిన క్షోభే ఘోరమైనది. చరిత్రలో ముగ్గురు సావర్కర్‌లు ఉన్నారు, వారు సోదరులు. మనకు వీర్ సావర్కర్ చాలావరకు తెలుసు. ఆయన అన్నగారు గణేశ్ దామోదర్ సావర్కర్. ఈయన కూడా నాసిక్ కలెక్టర్ జాక్సన్ హత్య కుట్రలో భాగస్వామిగా వీర్ సావర్కర్‌తో పాటు అండమాన్ సెల్యూలర్ జైలులో దాదాపు దశాబ్దం కఠిన శిక్ష అనుభవించారు. 1945లోనే కన్నుమూశారు. అలా అజ్ఞాత యోధునిగా మిగిలిపోయారు. చివరి సోదరుడు డాక్టర్ నారాయణ్ దామోదర్ సావర్కర్. గాంధీజీ హత్యానంతరం ఈయనను కాంగ్రెస్ పార్టీ 'అహింసామూకలు' కొట్టి చంపేశాయి.



వర్తమానం గతానికి బందీ. ఇది వాస్తవం కాకపోతే భారతదేశంలోని కొన్ని రాజకీయ పార్టీలు, వాటి నేతలు వినాయక్ దామోదర్ సావర్కర్ అనే స్వాతంత్ర్య సమరయోధుడిని గురించి ఎందుకు ప్రతికూల భావనలతో పదే పదే గుర్తు చేసుకుంటారు? గాంధీజీ హత్య కుట్రలో భాగస్వామి అని ఎందుకు వాదిస్తారు? కోర్టు ఆనాడు ఆ హత్యతో సంబంధం లేదని తీర్పు చెప్పి ఆయనను విడుదల చేసినా పాత పాట ఆపకుండా ఎందుకు పాడుతున్నారు? ఆర్ఎస్ఎస్ ఎదుగుదలను సహించలేని వారు, మొన్నటి భారతీయ జనసంఘ్, ఇప్పటి బీజేపీని ద్వేషించేవారు సావర్కర్ పేరును అడ్డం పెట్టుకుని హిందుత్వ మీద విషం కుమ్మరిస్తున్నారు. వీరి పరిజ్ఞానం మేరకు హిందుత్వకు ఆద్యుడు సావర్కర్. గాంధీజీ మరణించి 75 సంవత్సరాలైంది. సావర్కర్ కన్నుమూసి ఐదు దశాబ్దాలు గడిచాయి. అసలు హిందూ మహాసభ స్థాపకుడు కూడా ఆయన కాదు. అయినా సావర్కర్ అనే ఆ మూడు అక్షరాలు దేశంలో నిషిద్ధాక్షరాలుగానే చూస్తున్నారు కొందరు. కాంగ్రెస్, కమ్యూనిస్టు చరిత్రకారులు దాచేసిన చారిత్రక సత్యాలతో, విష ప్రచారాలతో సావర్కర్ అనే మహోన్నత త్యాగమూర్తి జీవితచరిత్ర వివాదాల పుట్టగా మారిపోయింది. ఇది అవాంఛనీయం.

సావర్కర్ భారత స్వాతంత్ర్యోద్యమంలో నిరుపమానమైన పాత్రను నిర్వహించారు. ఆయనది అహింసాయుత పంథా కాదు. అందులో దాపరికం లేదు. గాంధీజీ దేశం మొత్తాన్ని కదిలించిన ఉద్యమ సారథి. అహింసను నమ్మారు. బ్రిటిష్ జాతిని దేశం నుంచి పంపడానికి అహింసాపథం చాలదని నమ్మినవారు సావర్కర్. గాంధీజీ జీవితాంతం అహింసా సూత్రాన్ని పాటించారు. కానీ ఆయన అనుయాయుల అహింసావాదం అపద్ధర్మంగానే కనిపిస్తుంది. జనవరి 30,1948న నాథూరామ్ గాడ్సే గాంధీజీని హత్య చేస్తే, గాంధీజీ అహింసావాదాన్ని మనసావాచా నమ్ముతున్నామని చెప్పే గాంధేయులు అదేరోజు ఆ అహింసావాదాన్ని ఇంకా దారుణంగా హత్య చేశారు. ఒక చెంప కొడితే ఇంకో చెంప చూపమన్న గాంధీజీ ఆశయం కాస్తా, ఒక గాంధీ ప్రాణం వందల అమాయకుల ప్రాణాలు అన్న స్థితికి దిగిపోయింది. నాటి బొంబాయి ప్రెసిడెన్సీ ప్రీమియర్ బీజీ ఖేర్. హోంశాఖ మంత్రి మొరార్జీ దేశాయ్.

జనవరి 13, 1948న గాంధీజీ న్యూఢిల్లీలోని బిర్లా హౌస్‌లో ఆమరణ నిరాహార దీక్ష ఆరంభించారు. అప్పటికి ఆయన ప్రఖ్యాత పారిశ్రామికవేత్త జీడీ బిర్లా అతిథిగా ఆ భవనంలో ఉన్నారు. అదే సమయంలో ఢిల్లీలోనే పురానా ఖిలా అనే చోట హిందూ శరణార్థులకీ, ముస్లింలకీ మధ్య ఘర్షణ జరిగింది. సిక్కులు, హిందువులు, ముస్లింల మధ్య కక్షలూ కార్పణ్యాలను నిరోధించడానికి తాను ఆమరణ దీక్ష చేస్తున్నట్టు గాంధీజీ చెప్పినా, అసలు కథ వేరే. పాకిస్తాన్‌కు ఇస్తానన్న రూ. 55 కోట్లు భారత ప్రభుత్వం (నెహ్రూ ప్రభుత్వం) నిలిపివేసింది. కారణం–1947 అక్టోబర్‌లో గిరిజనుల పేరుతో పఠాన్‌లు, సైనికులు జమ్ముకశ్మీర్‌లో చొరబడ్డారు. భారత్–పాక్‌ల మధ్య జరిగిన తొలి యుద్ధం ఇదే. ఈ కారణంతో పాటు ఇంకొన్ని కారణాలతో ఆ మొత్తాన్ని నెహ్రూ ప్రభుత్వం పాకిస్తాన్‌కు చెల్లించకుండా ఆపింది. ఇది నచ్చని గాంధీజీ ఈ దీక్షకు దిగారన్నది వాస్తవం. ఇది గాంధీజీ చేపట్టిన 17వ నిరశన వ్రతం. అలాగే ఆయన జీవితంలో ఆఖరిది కూడా. జనవరి 18న ఇది ముగిసింది. అంటే గాంధీజీ నిరశన వ్రతం భారత్–పాక్ తొలి యుద్ధ సమయంలో చోటు చేసుకుంది. అక్టోబర్ 22, 1947న పాక్‌సేనలు గిరిజనుల ముసుగులో కశ్మీర్ మీద దురాక్రమణ చేశాయి. జనవరి 5, 1949న కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది.

ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ పుస్తకం 'గాంధీ: ది ఇయర్స్ దట్ ఛేంజ్డ్ ది వరల్డ్ 1914–1948'లో




ఆ కొద్దికాలంలో జరిగిన పరిణామాల మీద లోతైన పరిచయం కనిపిస్తుంది. ఈ భాగాలను హిందుస్తాన్ టైమ్స్ (సెప్టెంబర్ 8, 2018) ప్రచురించింది. నిరశన ఆరంభించిన రోజున సాయంత్రపు ప్రార్థనలలో గాంధీజీ పటేల్ మీద కూడా ముస్లిం వ్యతిరేక ముద్ర వేశారు. ముస్లింలు తనను, నెహ్రూనే విశ్వసిస్తున్నారు తప్ప, పటేల్‌ను కాదని అన్నారని గుహ రాశారు. హిందూ-ముస్లిం అంశం మీద ఆ ఇద్దరి నాయకుల మధ్య సయోధ్య కుదర్చే క్రమంలో గాంధీజీ జనవరి30, 1948 మధ్యాహ్నం బిర్లాహౌస్‌లోనే సర్దార్ పటేల్‌తో రెండు గంటలు చర్చించారు. తరువాత తన మనుమరాళ్లు అభా, మనుల సాయంతో సాయంత్రం ప్రార్థనల కోసం బిర్లా హౌస్ ప్రాంగణంలోకి వచ్చారు. అక్కడ అప్పటికే చేరుకున్న జనసమ్మర్దం నుంచి ఒక వ్యక్తి గాంధీజీ ముందుకు వచ్చి, వంగి పాదాభివందనం చేసి, వెంటనే నిలబడి కాల్చి చంపాడు. అతడే నాథూరామ్ గాడ్సే. నిస్సందేహంగా ఈ ఘట్టం చరిత్రకు మాయని మచ్చ. ప్రపంచాన్ని కదిపిన ఈ దురంతం జరిగి ఉండ వలసింది కాదు. అంతమాత్రాన గాంధీజీ హత్యను అడ్డం పెట్టుకుని నెహ్రూ ప్రభుత్వం తొక్కిన అడ్డతోవలు, 'అహింసామూర్తి' గాంధీజీ అనుయాయులయిన అహింసావాదులు సాగించిన హింసాకాండ చరిత్రలో చేరకూడని, ఎవరూ చర్చించకూడని అంశాలైపోతాయా?

78 ఏళ్ల గాంధీజీని చంపేనాటికి గాడ్సే వయసు 37 ఏళ్లు. కాంగ్రెస్ పోషణలోని చరిత్రకారులు, కమ్యూనిస్టు మేధావులు చారిత్రక అంశాలు దాచిన స్థాయిలో.. వక్రీకరించిన తీరులో ఇతడికీ, సావర్కర్‌కీ ఉన్న బంధాన్ని దాచి పెట్టే ప్రయత్నం ఎవరూ చేయలేదు. గాడ్సే 'దైనిక్ హిందూరాష్ట్ర' పత్రిక సంపాదకుడు. పత్రిక పేరు (మాస్ట్‌హెడ్) పక్కన అతడు ఒక బొమ్మను ముద్రించేవాడు. అది సావర్కర్‌ది. పైగా గాంధీజీ మీద తుపాకీ గుళ్లు కురిపించిన తరువాత గాడ్సే పలాయనం చిత్తగించే ప్రయత్నమే చేయలేదు. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాడు.

గాడ్సే తండ్రి తపాలా ఉద్యోగి. పేరు వినాయక్. ఆయనది తరుచు బదలీలు అయ్యే ఉద్యోగం. గాడ్సే మెట్రిక్యులేషన్ కృతార్థుడు కాలేకపోయినా, తరువాత చరిత్ర, సామాజికశాస్త్రం స్వయంగా అధ్యయనం చేశారు. తన 19వ ఏట 1929లో తండ్రి ఉద్యోగ రీత్యా రత్నగిరి జిల్లాకు వచ్చినప్పుడు మొదటిసారి సావర్కర్‌ను కలుసుకున్నారు. అప్పటికి అండమాన్ సెల్యులార్ కారాగారం నుంచి వచ్చిన సావర్కర్ జిల్లాలో ఇంటర్న్‌మెంట్‌లో ఉన్నారు. నాటి నుంచి సావర్కర్ చింతనతో గాడ్సే మమేకమయ్యారు. 1937లో సావర్కర్ రాజకీయాలలో తిరిగి క్రియాశీలక పాత్ర పోషించిన క్రమంలో గాడ్సే హిందూ మహాసభలో చేరాడు. నిజాంకు వ్యతిరేకంగా హిందూ మహాసభ కూడా ఉద్యమించిన సంగతి తెలిసిందే. 1938లో ఒక దళానికి నాయకత్వం వహించిన గాడ్సే ఒక సంవత్సరం కారాగార శిక్ష అనుభవించాడు. గాడ్సే హిందూ మహాసభలో చేరిన సమయంలోనే నారాయణ ఆప్టే కూడా అహమ్మద్‌నగర్ శాఖలో చేరాడు. అక్కడ సంస్థను నడుపుతున్నవారు విష్ణు కర్కరే. ఇతడు ఒక వ్యాపారి.

శివాజీ పార్క్ నివాసం నుంచి ఇంటెలిజెన్స్ శాఖ స్వాధీనం చేసుకున్నవి పదివేల ఉత్తరాలు. అందులో ఇరవై వరకు గాడ్సే రాసినవి. పన్నెండు వరకు కర్కరే రాసినవి. కానీ ఎందులోనూ గాంధీజీని చంపాలంటూ సూచనప్రాయంగా చెప్పినట్టు కనీస ఆధారాలు లేనేలేవు. దైనిక్ హిందూ రాష్ట్ర కంటే ముందు గాడ్సే 'అగ్రణి' అన్న పత్రికను నిర్వహించారు. అది తీవ్ర జాతీయవాద భావాలతో నడిచింది. దీనితో ఆ పత్రికను అణచివేయడానికి రూ. 6,000 ధరావతు కట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ధనం ఏర్పాటు చేయవలసిందిగా సావర్కర్‌కు గాడ్సే ఉత్తరం రాశాడు. అలాగే అగ్రణికి వ్యాసాలు రాయవలసిందిగా మరొక లేఖలో విన్నవించాడు. కానీ సావర్కర్ ఆ పత్రికకు వ్యాసాలు పంపలేదు. గాడ్సే, ఆప్టే, కర్కరేలను కేవలం హిందూ ఐక్యతావాదులు, లేదా హిందూ మహాసభ సభ్యులు అనడం కంటే, సావర్కరైట్స్ అనడం సబబన్న వాదన ఉంది. ఫిబ్రవరి 1-5 మధ్య గాంధీజీ హత్య నేపథ్యంలో బొంబాయి ప్రెసిడెన్సీలో జరిగిన అరాచకాలు బ్రిటిష్ పాలకులనే విస్తుపోయేటట్టు చేసి ఉండవచ్చు. ప్రెసిడెన్సీలోని హిందూ మహాసభ కార్యకర్తలను, వారి ఇళ్లను ముట్టడించారు. ఆర్ఎస్ఎస్ వారి పరిస్థితి అంతే. ఇళ్లు తగులబెట్టారు. హింసకు దిగారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఆ ఐదు రోజులలోనే 25,000 మందిని అదుపులోకి తీసుకున్నారు. బొంబాయి ఇంటెలిజెన్స్ విభాగం అదుపులోకి తీసుకున్న దాదాపు నెలరోజుల తరువాత మాత్రమే సావర్కర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు (మార్చి 3, 1948) చేశారు. ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం కింద కేసు పెట్టారు. ఆ తరువాత కూడా ఆయనను ఆర్థర్ రోడ్ జైలులోనే కొద్దికాలం ఉంచారు. ఎలాంటి అభియోగం నమోదు చేయకుండానే నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ ఎస్‌వి దేవధర్ అనే న్యాయవాది సావర్కర్ తరపున వాదించారు.

గాంధీజీ పంథా మీద, కాంగ్రెస్ మీద సావర్కర్‌కు ఉన్న వ్యతిరేకత కారణంగానే ఈ హత్య కేసులో నిందితునిగా చేర్చారన్నది పెద్ద ఆరోపణ. దాదాపు 75 ఏళ్లుగా సావర్కర్ కుటుంబాన్ని ఈ విధంగా అహింసావాదుల కాంగ్రెస్ వెంటాడుతోంది. గాంధీజీ హత్య, అందులో సావర్కర్ పాత్ర అన్న మాటలు బయటకు వచ్చిన వెంటనే ఆయన నివాసం సావర్కర్ సదన్ మీద (దాదర్) దాడి జరిగింది. నాథూరామ్ వినాయక్ గాడ్సే కాల్పులు జరిపాడని తెలియడం, ఆ వెంటనే ఆయన కులం గురించి వెల్లడించడంతో మహారాష్ట్రలోని ప్రధాన పట్టణాలలో ఆ కులమే లక్ష్యంగా హత్యాకాండ, హింసాకాండ జరిగాయి.

ఒక మనిషిని కొట్టి చంపడం అనే ఘట్టం అప్పుడే తొలిసారి స్వతంత్ర భారతదేశంలో జరిగింది. ఆ బలిపశువు ఎవరో కాదు, సాక్షాత్తు సావర్కర్ ఆఖరి తమ్ముడు. పేరు డాక్టర్ నారాయణ్ దామోదర్ సావర్కర్. బొంబాయిలోని ఆయన ఇంటి మీద గాంధీజీ భక్తులైన అహింసావాదులు దాడి చేశారు. గాంధీజీ మీద తమ భక్తి ప్రపత్తులను చాటుకోవడానికి అదే మంచి పద్ధతి అన్నట్టు పత్రికలేవీ ఈ విషయాలను ప్రచురించలేదు. అయితే చరిత్ర ఎప్పటికీ మరుగుననే ఉండిపోదు. బ్రిటిష్ పత్రికా రచయిత మౌరీన్ ప్యాటర్సన్ గాంధీజీ హత్యానంతర మారణకాండ మీద సేకరించిన సమాచారంలో ఇవి చేరాయి. డాక్టర్ నారాయణ్ దామోదర్ సావర్కర్‌ను జనం కొట్టి చంపిన విషయం కూడా ఆయనే నమోదు చేశారు. ఆ వ్యాసం పేరు 'ది షిఫ్టింగ్ ఫార్చ్యూన్స్ ఆఫ్ చిత్పవన్ బ్రాహ్మిన్స్: ది ఫోకస్ ఆన్ 1948'. అదే సమయంలో వీర్ సావర్కర్ ఇంటి మీద జరిగిన దాడి గురించి కూడా కొన్నిచోట్ల నమోదైంది. ఢిల్లీలో ఉన్న జాతీయ ఆర్కైవ్స్‌లో 'డిజిటైజ్డ్ ప్రైవేట్ పేపర్స్ ఆఫ్ సర్దార్ పటేల్: లెటర్స్ అండ్ న్యూస్‌పేపర్ ఆర్టికల్స్' అన్న విభాగంలో ఆ సమాచారం ఉంది. వీటి గురించి వీర్ సావర్కర్ చరిత్రకారుడు విక్రమ్ సంపత్ కూడా ప్రస్తావించారు. వీర్ సావర్కర్‌ను కాంగ్రెస్ వారి బారి నుంచి రక్షించే క్రమంలో డాక్టర్ నారాయణ్ దామోదర్ సావర్కర్ రక్షణ గురించి పోలీసులు విస్మరించారు. ఇంతకీ నారాయణ్ దామోదర్ ఇల్లు వీర్ సావర్కర్ ఇంటికి పొరుగునే ఉంది. విక్రమ్ సంపత్ డాక్టర్ నారాయణ్ సావర్కర్ మీద జరిగిన దాడిని వివరంగానే ఇచ్చారు. అదొక అమానుషకాండ. కొందరు ఇంటిలో ఉన్న నారాయణ్ సావర్కర్‌ను బయటకు ఈడ్చుకు వచ్చారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. చివరకు ఆయన నెత్తుటి మడుగులో పడిపోయారు. తలకి కూడా తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆయన కుటుంబాన్ని రహస్య స్థలానికి పంపారు. 20 మాసాల పాటు మృత్యువుతో సుదీర్ఘ పోరాటం జరిపి, అక్టోబర్ 19,1949న ఆయన కన్నుమూశారు.

'వీర్ వినాయక్ దామోదర్ సావర్కర్' పేరుతో విక్రమ్ సంపత్ పుస్తకం ఆ మధ్య రెండు భాగాలుగా వెలువడింది. 'ఆగ్రహంతో ఉన్న ఆ మూక రెండో లక్ష్యం దాదర్‌లోని సావర్కర్ నివాసమే. 500 నుంచి 1000 మంది సావర్కర్ ఇంటి ముందు చేరి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాళ్లు రువ్వడం మొదలుపెట్టారు. అప్పుటి ఒక వార్తాపత్రిక వెలువరించిన వార్త ప్రకారం సావర్కర్ పుస్తకాలు, చిత్రాలు, ఫోటోలు ఆ రోడ్డంతా చెల్లాచెదురుగా పడేసి, వాటికి నిప్పుపెట్టారు. బొంబాయి ప్రెసిడెన్సీ లోని ఇంకొన్ని ప్రదేశాలలో సావర్కర్ ఫోటోలను మొదట పగులకొట్టి తరువాత దహనం చేశారు.' అని విక్రమ్ సంపత్ పేర్కొన్నారు.

విక్రమ్ సంపత్ తన మరొక పుస్తకం 'సావర్కర్: ఏ కంటెస్టెడ్ లిగసి'లో ఇంకొన్ని వివరాలు ఇచ్చారు. ఇవి 420, 421 పేజీలలో కనిపిస్తాయి.'చాలామంది కింది అంతస్తులోకి (సావర్కర్ సదన్) దూసుకొచ్చారు. సావర్కర్ మాజీ కార్యదర్శి, ఇంగ్లిష్ వారపత్రిక 'ఫ్రీ హిందుస్తాన్' సంపాదకుడు భిడే గురూజీ నివాసం అదే. మొదటి అంతస్తులోని తన గదిలో సావర్కర్ విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే సావర్కర్ సహచరులు బాల్ సావర్కర్, భాస్కర్ శిందే సమయస్ఫూర్తి ఆనాడు వీర్ సావర్కర్, ఆయన భార్య యమున, కొడుకు విశ్వాస్‌ల ప్రాణాలు కాపాడింది. అంతకు ముందు రాత్రి 10 గంటల వేళ వీర్ సావర్కర్ కుటుంబీకులు కొందరినీ, ఆయన అంగ రక్షకుడు అప్పా కాసర్, వ్యక్తిగత కార్యదర్శి గజానన్ దామ్లేలనూ బొంబాయి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో భాస్కర్ శిందే సావర్కర్ సామాజిక వర్గం కాకున్నా కూడా కాంగ్రెస్ కార్యకర్తల దాష్టీకానికి గురయ్యాడు. కాంగ్రెస్ అహింసావాదుల చర్యలు చరిత్ర క్షమించే విధంగా లేవు. జనవరి 30, 1948 రాత్రే పూనాలో 50 మందిని గుర్తించి వెంటాడి చంపారు. వారంతా సావర్కర్ సామాజిక వర్గం వారే. అహింసావాదుల ఈ హింసోన్మాదం గాలితో పోటీపడుతూ దక్షిణ, పశ్చిమ మహారాష్ట్రలకు చేరింది. నాగపూర్, విదర్భ ఇలాంటి హత్యాకాండకు కేంద్రాలయ్యాయి. మొదట గాడ్సే ఇంటి పేరు ఉన్నవారిని వెతికి వెతికి చంపే ఉన్మాదం, తరువాత ఆ సామాజిక వర్గంలోనే ఉప కులాల వారిని కూడా చంపే వరకు పోయింది.



వీర్ సావర్కర్, నారాయణ్ సావర్కర్, గణేశ్ సావర్కర్

వీర్ సావర్కర్, ఆయన పెద్ద తమ్ముడు గణేశ్ దామోదర్ సావర్కర్ అండమాన్ జైలులో కఠిన శిక్ష అనుభవించారు. గడచిన ఏడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్, కమ్యూనిస్టులతో పాటు చాలామంది మేధావులు కూడా అండమాన్ జైలులో ఆయనను ఏకాంత చీకటికొట్లో ఉంచినట్టే, చరిత్రపుటలలో మారుమూల ఉంచాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. అండమాన్ నుంచి వచ్చి రత్నగిరి జిల్లాకు పరిమితమై అంటరానితనం నిర్మూలన కోసం ఉద్యమించిన ఈ సంస్కర్తను చరిత్రలో అంటరానివానిగా మిగల్చాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. హిందూత్వవాది అయినా ఆయన సంస్కరణ దృష్టిని నిరాకరించలేమని ఒక పక్క అంటూనే, ఆయన త్యాగాన్నీ, కాంగ్రెస్ వారి కుట్రనీ వేర్వేరుగా అంచనా వేసే విజ్ఞతను ప్రదర్శించలేకపోతున్నారు. గాంధీజీతో సావర్కర్ విభేదాలు 1909 నుంచి కనిపిస్తాయని రామచంద్ర గుహ అంటారు. వారిద్దరి వైరం ఉద్యమ పరమైనది కాకుండా, వ్యక్తిగతమని కూడా ఈ చరిత్రకారుడు చెబుతారు. దానికి ఆయన చూపిన ఆధారం ఇది: కస్తూర్బా గాంధీ మరణించిన తరువాత ఆమె పేరిట ఏర్పాటు చేయదలచిన స్మారక చిహ్నానికి విరాళం ఇవ్వడానికి సావర్కర్ నిరాకరించారు. ఇందుకు సావర్కర్ చెప్పిన కారణం గురించి కూడా గుహ పేర్కొన్నారు. 'బ్రిటిష్ ప్రభుత్వాన్ని సాయుధ పంథాలో కూల్చడానికి ప్రయత్నించి ఉరికంబాలను ఎక్కిన ఎందరో స్త్రీపురుషుల గురించి గాంధీజీ ఒక్క కన్నీటి

బొట్టు కూడా రాల్చలేదు కదా!' అన్నారట సావర్కర్. అలాగే ఇటీవలి కాలంలో కూడా సావర్కర్ క్షమాభిక్ష కోరిన పలాయతుడు అంటూ నోళ్లు పారేసుకున్న వారు ఉన్నారు. తాను క్షమాభిక్ష కోరిన అంశాన్ని (ఆరుసార్లు) సావర్కర్ ఏనాడూ నిరాకరించలేదు అంటారు ఆయన జీవితచరిత్రను రాసిన మరొక రచయిత వైభవ్ పురందరే. క్షమా విన్నపాల కారణంగానే సావర్కర్ చరిత్ర తన ఔన్నత్యం కోల్పోదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఒక రాజకీయ ఖైదీగా ఆయన తన హక్కును వినియోగించుకున్న అంశాన్నే ఇందులో చూడాలని గుర్తు చేశారు.

గాంధీజీ హత్య ఉదంతంలో వీర్ సావర్కర్ పాత్ర ఉన్నట్టు నిర్ధారణ కాలేదు కాబట్టే నిర్దోషిగా విడుదల చేశారని ఆయన మనుమడు రంజిత్ సావర్కర్ ఇటీవలనే చెప్పవలసి వచ్చింది. ఇందులో ఒక మలుపు ఉంది. ఆ సంచలనం అదే. గాడ్సేకు ఒక కాంగ్రెస్ నాయకుడే పిస్టల్ ఇచ్చి చంపమన్నాడని కూడా రంజిత్ చెప్పడంతో ఈ వ్యాఖ్యకు పదును వచ్చింది. ఈ అంశం మీద దర్యాప్తు జరపాలని కూడా ఆయన కోరారు. గాడ్సేకు సావర్కర్ పిస్టల్ సమకూర్చారని గాంధీజీ మనుమడు తుషార్ గాంధీ ఆరోపించిన నేపథ్యంలో రంజిత్ ఈ ఆరోపణ చేశారు. నిజానికి జనవరి 30, 1948 కంటే ముందు గాంధీజీ మీద మరొక హత్యాయత్నం (పేలుడుతో) జరిగింది. అందులో నిందితుడు మదన్‌లాల్ ఫావా. ఈ ఘటన జరిగిన నాటి నుంచి సావర్కర్ మీద పోలీస్ నిఘా ఉంచిన సంగతిని రంజిత్ గుర్తు చేశారు. ఆ పేలుడు జరిగిన తరువాత సావర్కర్ ఎవరినీ కలుసుకోలేదని పోలీస్ రికార్డులు చూస్తే తెలుస్తుందని రంజిత్ చెప్పారు. హత్యకు రెండు రోజుల ముందు తనను కలసిన గాడ్సేకు సావర్కర్ ఆయుధం అందచేశారన్న ఆరోపణ తప్పని దీనిని బట్టి అర్ధమవుతుందని ఆయన చెప్పారు.

గాంధీజీ హత్య కేసులో నాథూరామ్ గాడ్సే, వీర్ సావర్కర్, గోపాల్ గాడ్సే (నాథూరామ్ సోదరుడు), మదన్‌లాల్ ఫావా, శంకర్ కిష్టయ్య, దిగంబర్ బాడ్గే, నారాయణ్ ఆప్టే, విష్ణు కర్కరేలను నిందితులుగా అరెస్టు చేశారు. మే 27,1948న వీరిపై ఢిల్లీలోని ఎర్రకోటలో విచారణ మొదలయింది. ఈ ప్రత్యేక న్యాయస్థానానికి జస్టిస్ ఆత్మచరణ్ న్యాయమూర్తి. మొత్తం 149 మంది సాక్షులను విచారించారు. కానీ డిఫెన్స్ తరఫున ఎవరూ సాక్షి లేరు. నవంబర్ 8, 1949న గాడ్సే, ఆప్టేలకు మరణ దండన విధిస్తూ తీర్పు ఇచ్చారు. మిగిలిన ఆరుగురికి జీవిత ఖైదు విధించారు. గాడ్సే, ఆప్టేలకు విధించిన శిక్షను తగ్గించవలసిందిగా గాంధీజీ కుమారులు మణిలాల్ గాంధీ, రామదాస్ గాంధీ విన్నవించినా ప్రధాని నెహ్రూ, ఉప ప్రధాని వల్లభ్‌భాయ్ పటేల్, గవర్నర్



అండమాన్ జైలు

జనరల్ రాజాజీ అంగీకరించలేదు. నవంబర్ 15, 1949న ఆ ఇద్దరిని అంబాలా జైలులో ఉరితీశారు.

సావర్కర్ తన అరెస్టుకు ముందే లిఖిత పూర్వకంగా ఒక ప్రకటన వెలువరించారని ప్రఖ్యాత ఆంగ్ల దినపత్రిక 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' ఫిబ్రవరి 7, 1948న పేర్కొన్నది.'గాంధీజీ హత్య అంటే భ్రాతృహత్యతో సమానం. ఇప్పుడే ఆవిర్భవించిన దేశానికి ఇది చేటు చేస్తుంది' అన్నదే ఆ ప్రకటన సారాంశం. గాంధీజీ హత్యకు పూర్తి బాధ్యత తనదేనని నాథూరామ్ ప్రకటించాడు. దిగంబర్ బాడ్గే అప్రూవర్‌గా మారాడు. అతడు చెప్పిన ప్రకారం జనవరి 17, 1948న నాథూరామ్ బొంబాయి వెళ్లి సావర్కర్‌ను కలుసుకున్నాడు. వెంట ఆప్టే కూడా ఉన్నాడు. వారు తిరిగి వస్తుంటే సావర్కర్ విజయీభవ అని దీవించారు. కానీ ఈ వాగ్మూలాన్ని కోర్టు నిరాకరించింది. దీనితో ఆధారాలు దొరకనందున కోర్టు సావర్కర్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. వెనువెంటనే 'హిందూ జాతీయవాదాన్ని రెచ్చ గొట్టే' ప్రసంగాలు చేశారన్న ఆరోపణలతో స్వతంత్ర భారత ప్రభుత్వం మళ్లీ అరెస్టు చేసింది. తాను రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉంటానని మాట ఇచ్చిన తరువాత విడుదల చేశారు. రాజకీయోపన్యాసాలు మానేసినా, హిందూధర్మంలోని సున్నితమైన అంశాల గురించి ఆయన ప్రసంగించేవారు.

గాంధీజీని వ్యతిరేకించినంత మాత్రాన సావర్కర్ వంటి యోధులను విస్మరించడానికి భారతీయులంతా సిద్ధంగా లేరు. దేశ ప్రజలకు విశేష సేవలు అందించిన వీర్ సావర్కర్, బరీంద్రకుమార్ ఘోష్ (అరవింద్ ఘోష్ సోదరుడు), భూపేంద్రనాథ్ దత్త (వివేకానందుల సోదరుడు) వంటివారి త్యాగాలను గౌరవిద్దామంటూ రాజా మహేంద్ర ప్రతాప్ సింగ్ నవంబర్ 22, 1957న లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టారు. కానీ ఇది 45 ఓట్ల తేడాతో వీగిపోయింది. దేశభక్తికి వారంతా చిరునామాలే. కానీ గాంధీజీని అనుసరించలేదు. అదే వారు చేసిన పాపం. 1964లో నెహ్రూ మరణించాక లాల్ బహదూర్ శాస్త్రి సావర్కర్‌కు స్వాతంత్ర్య సమర యోధులకు ఇచ్చే పింఛన్ సౌకర్యం కల్పించారు.


జీవిత చరమాంకంలో కూడా సావర్కర్ రచనా వ్యాసంగాన్ని వీడలేదు. 'ఆత్మహత్య ఆత్మార్పణ కాదు' అన్న పేరుతో ఒక వ్యాసం రాశారు. దాదాపు ఇదే వారి అంతిమ రచన. చనిపోవడానికి కొద్ది రోజుల ముందు రాసినది. ఒక వ్యక్తి జీవితలక్ష్యం నెరవేరితే, నిర్వర్తించడానికి ఏమీ మిగలకపోతే మరణం ఆసన్నమయ్యే దాకా వేచి ఉండకుండా ఆత్మార్పణ చేసుకోవడమే ఉత్తమమని ఆ వ్యాసంలో ప్రతిపాదించారు. అలాంటి భావనకు వచ్చిన తరువాతే అది రాశారని అనిపిస్తుంది. ఫిబ్రవరి 1, 1966న ఆయన మందులు, ఆహారం ఆఖరికి మంచినీరు త్యజించారు. ఫిబ్రవరి 26, 1966న తుదిశ్వాస విడిచారు. మరణం తరువాత కూడా కాంగ్రెస్ సావర్కర్ పట్ల అదే వైరాన్నీ, ద్వేషాన్నీ కొనసాగించింది. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది. కానీ సంతాపదినాలనూ ప్రకటించలేదు. మంత్రి వర్గంలో ఏ ఒక్కరు నివాళీ ఘటించలేదు.

ఆ దేశభక్తుడిది పరాయి పాలకుల అండమాన్ జైలులో.. స్వతంత్ర భారత అహింసావాదుల వేటలో ఒకే రకమైన అనుభవమనిపిస్తుంది.

ఆత్మహత్య చేసుకునే పిరికితనం ఆయనకు లేదు. ఆత్మార్పణ చేసుకోవలసిన పరిస్థితులను జీవించి ఉండగానే అహింసావాదులు చుట్టూ చితిలా పేర్చారు. ఇదే సావర్కర్ జీవితం. ★




# ఓ క్షురకుడు, దర్జీ – ఓ నా
# నిజాం తలరాత మార్చాల




**కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు


**నిజాం ఏలుబడిలో తొలి బలిపశువులు భాష, సంస్కృతులే. 1911లో గద్దె ఎక్కిన నాటి నుండి ఒక పద్ధతి ప్రకారం తెలుగును తుడిచిపెట్టాడు. 1918లో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించాడు. ఉర్దూను బోధనా భాషగా ప్రకటించాడు. లక్నో నుండి ఉర్దూ విద్వాంసులను, కవులను రప్పించాడు. మెడిసిన్, ఇంజనీరింగ్ పాఠ్యపుస్తకాలను అందులోకి తర్జుమా చేయించాడు. తెలుగుకు తెలంగీ, బేడంగీ అని వెక్కిరింపు మొదలైంది. అందుకే దాశరథి కృష్ణమాచార్య నిజాంను 'ముసలినక్క' అని సంబోధించాడు. ఉస్మానియాలో నియమితులైన వారంతా బయటి వారే. దీనికి వ్యతిరేకంగా రాజ్యంలోని ముసల్మానులు 'ముల్కీ' (స్థానికుడు) ఉద్యమం తీసుకువచ్చారు.**

నిజాం రాజ్యం భారతదేశంలోని అతి పెద్ద సంస్థానం. కానీ ఈ రాజ్యంలో ఉన్నవి నాలుగు ఇంటర్మీడియట్ కళాశాలలు. ప్రతీ జిల్లాకు ఒక ఫౌఖాన్యా– హైస్కూలు, ప్రతీ తాలూకాకు ఒక వస్తాన్యా– మిడిల్ స్కూలు ఉండేవి. గ్రామాల్లో తహతాన్యా –ప్రయిమరీ స్కూలు ఉండేది. నిజాం నవాబు ఖాస్గీబడులు– వీధి బడులను ఫర్మానా ద్వారా నిషేధించాడు. అందువల్ల ఉపాధ్యాయులు తమ ఇళ్లలోనే తెలుగు చదువు చెప్పేవారు.

'ఆచంద్రతారార్కం నిజాం రాజ్యం వర్ధిల్లాలి' అనే ప్రార్థనతో తరగతులు ప్రారంభమయ్యేవి. ప్రతీ విద్యాలయంలో దీన్యాత్, అంటే మత విద్య (ఖురాన్ పీరియడ్) తప్పనిసరి. శుక్రవారం వారాంతపు సెలవు. ప్రధాన సెలవులలో ఒకటి హుజూర్ సాల్గిరా, అంటే ప్రభువు వారి జన్మదినం. ఆ రోజు పిల్లలందరూ ఊరేగింపుగా నరసింహస్వామి గుట్ట దగ్గర ఖేల్ మైదాన్‌కు చేరుకోవాలి. అన్ని మదర్సాల తుల్బా, అంటే అన్ని స్కూళ్ల విద్యార్థులు చేరు కుంటారు. మిఠాయి పంచుతారు. మొహరం పీర్ల పండుగకు 15 రోజులు సెలవులు. రంజాన్ ఏ కాలంలో వచ్చినా ఒంటిపూట బడి మాత్రమే. నిజాం కాలండర్ హిజ్రా ప్రకారం జరుగుతుంది. క్రీస్తు శకానికీ హిజ్రాశకానికీ సుమారు 500 సంవత్సరాలు తేడా ఉంటుంది. హిజ్రా అంటే మహమ్మద్ ప్రవక్త మక్కా వదలి మదీనా వెళ్లడం.

నిజాం రాజ్యంలో మత మార్పిడి, అందులోని విషాదం, నిస్సహాయత దయనీయంగా ఉండేవి. దాశరథి రంగాచార్యుల 'చిల్లరదేవుళ్లు' నవలలో బహదూర్ ఖాన్ మతం మార్చినప్పుడు ఎందరో స్త్రీల మంగళసూత్రాలను త్రెంచిన ఘట్టం చదువుతూ మాడపాటి హనుమంతరావు వెక్కెక్కి ఏడ్వడం ప్రారంభించారట. తరువాత ముఖం కడుక్కొని దాశరథితో అన్నారట. 'నీవు రాసిన తీరు నన్ను కదిలించింది, ఇటువంటి దృశ్యాలను ఎన్నిటినో ప్రేక్షకులుగా చూసిన దౌర్భాగ్యం మాది' అన్నారట. ఉస్మాన్ రాజ్యం అలాంటి పిశాచ రాజ్యం. నిజాంతో పాటు జాగీర్దారులు, దొరలు, దళారులు, వారి తాబేదారులు, పటేల్, పట్వారీలు మున్నగు వారంతా చోటా నిజాములే.

మహారాజుల దుశ్చర్యలను గురించి దివాన్ జర్మనీ దాస్ 'మహారాజా' అనే నవల్లో వారు ప్రజల రక్తాన్ని ఎలా పీల్చారో వివరించారు. 'మేలియా దో కే చీనార్' అనే తన ఆత్మకథలో కిషన్‌చందర్ అనే ఉర్దూ రచయిత కశ్మీర్‌లో ప్రజలను ఎలా పీడించారో వివరించాడు. ఓ కవి చెప్పినట్లు ఛెంఘిజ్‌ఖాన్, తామర్లేన్, నాదిర్షా, గజనీ, ఘోరీ, సికిందర్ ఎవరైతేనేం! ఒక్కొక్కడూ మహా హంతకుడు. అందుకే దాశరథి నిజాంను 'దగాకోరు, బడా చోర్ రజాకార్ పోషకుడవు' అన్నారు.

నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రజలు చైతన్యవంతులయ్యారు. అది చూసి నవాబు బెదిరి పోయాడు. ఈ జనమంతా తన మీద పడ్డట్లే భయ పడ్డాడు. నిజాంకు జనమంటే బెదురు, చదువంటే బెదురు, వెలుగంటే అదురు. అందుకే గస్తీ నిషాన్ తిర్యన్–53ను ప్రకటించాడు. అది నిజాం ప్రజల సమస్త హక్కులను హరించింది. వారిని కట్టేసింది, నోరు కుట్టేసింది. ఇదే సమయంలో 'సుల్తాన్ బజారు' పేరు చెప్పినా నిజాంకు భయమే. కారణం, అక్కడ రెసిడెంట్ పాలన. అంటే బ్రిటిష్ పాలన. అక్కడి యువకులే నిజాం పాలనకు చరమగీతం పాడ నిర్ణయించుకున్నారు.

హైదరాబాద్‌లోని సుల్తాన్ బజారుకు చెందిన ఓ బట్టల దుకాణాదారుడు, ఓ క్షురకుడు, ఆర్యా ఫోటో స్టూడియో యజమాని సత్యనారాయణ, ఓ దర్జీ నిజాం తలరాతను మార్చాలని హైదరాబాదు విమోచనోద్యమంలో భాగమయ్యారు. కోటి, అబిడ్స్ మధ్య సుల్తాన్ బజార్ ఉంటుంది. దీన్ని పూర్వం రెసిడెన్సీ బజార్ అనేవారు. ఇక్కడే బ్రిటిష్ రెసిడెంట్ ఉండేవాడు. తరువాత నవాబ్ సయ్యద్ సుల్తానుద్దీన్ పేరున సుల్తాన్ బజారైంది. ఇక్కడ 1892లో ఆర్యసమాజ్ శాఖను ప్రారంభించారు. ఇప్పుడున్న ఉమెన్స్ కాలేజీ నాటి బ్రిటిష్ రెసిడెంట్ కార్యాలయం. బ్రిటిష్ రెసిడెంట్ తాలూకా ఆఫీసర్లు ఈ ప్రాంతంలో మకాం చేసి ఉండేవారు. దీనిపై నిజాం ఏనాడూ దాడిచేయలేదు. కనుక దేవిదీన్ ఆర్య సమాజానికి ఈ భూమిని దానం చేశారు. ఇక్కడ ఆర్య బాల బాలికల పాఠశాల ఉండేది. పండిట్ రుద్రదేవ్, పండిట్ నరేంద్రదేవ్‌ల నాయకత్వం మత మార్పిడి లకు వ్యతిరేకంగా స్థానిక యువత సహాయంతో పోరాడారు. ఆయనే ఆర్య యువ క్రాంతిదళ్ స్థాపించారు.



నారాయణరావ్ పవార్ ఉద్యమం ఆసక్తికర మైనది ఈయన ఒక దళం ఆరంభించాడు. ఇందులో గన్‌ఫౌండ్రీ ప్రాంతవాసులు పండిట్ విశ్వనాథ్, రెడ్డి పోచానందం, లాలాగూడా రైల్వే కార్మికుడు

## ్యాయవాది
## ని చూశారా!

జి.నారాయణస్వామి, న్యూ బాంబే టైలర్స్ షాపు నడిపే బాలకిషన్, మోడరన్ హెయిర్ కటింగ్ సెలూన్ యజమాని గుండయ్య, శంషాబాద్ ప్రాంతవాసి జగదీష్, న్యాయవాది కొండా లక్ష్మణ్ బాపూజీ దళం సలహాదారు, ఫైనాన్షియర్ కూడా. దేవయ్యకు చెందిన దిల్షాద్ టాకీస్ ఎదురుగా ఉదయ్ క్లాత్ స్టోర్సు ఉండేది. రాత్రి రహస్య సమావేశాలు ఆ మేడపైన నిర్వహించేవారు. అక్కడకు హైదరాబాద్ పాత నగరం నుండి భీష్మదేవ్ అని మరో మిత్రుడు వచ్చేవాడు. బ్రిటిష్ ఇండియాలో 'షహీదీ కి పటోలీ' అనే పుస్తకం (అమరదళం) నిషేధించారు. రాజస్థాన్ నుండి బాలకిషన్ రహస్యంగా ఓ ప్రతిని తెప్పించాడు. ఆ పుస్తకం వారి విప్లవ జీవితాన్ని తీర్చిదిద్దింది.

కాని తమ దగ్గర ఆయుధాలు, బాంబులు కొనుగోలు చేయడానికి సరిపడా ధనం లేదు. హైదరాబాద్ నుండి వచ్చిన శరణార్థులకు హయగ్రీవా చారి ఆంధ్రాలో శరణాలయం నడుపుతున్నారు. ఆయనను సహాయం అర్థించగా, ఆర్థికంగా ఆదుకోలేకపోయారు. దానితో బాల్‌కిషన్ తన భార్య నగలు అమ్మగా వచ్చిన ధనంతో ఆయుధాలను కొన్నారు. ఉత్తర భారతం నుంచి అరబ్బు, కాంది శీకుల రైలు వస్తున్నది. దానిని అడ్డుకోవడానికి ఘట కేసర్ దగ్గర పట్టాలకు గల షిప్‌ప్లేట్లను తొలగించారు. కాని గాంగ్‌మేన్ సకాలంలో స్పందించి ట్రైనును రక్షించారు. తరువాత పోలీసు లైన్సుపై బాంబులు విసిరారు. అది కొంతవరకూ విజయవంతమైంది. ఇక ఏమైనా నిజాంను తుది ముట్టించడానికి ప్రణాళికను సిద్ధం చేశారు. సైన్యం, పోలీసుల కదలికలు, నిజాం దినచర్య పూర్తిగా అధ్యయనం చేశాకే ఈ పనికి పూనుకోవాలని ముస్లిం యువకుల వేషధారణతో పాతబస్తీ ఏరియా బాగా తిరిగి అవగాహన తెచ్చుకున్నారు. నారాయణరావు పవార్, బాలకిషన్ ముస్లింల వేషధారణలో చారుసాలా మైదానంలో మహ్మదాలీ జిన్నా ప్రసంగం విన్నాక వారిద్దరిలో ఆవేశకావేశాలు వచ్చాయి. ఆత్మ గౌరవం లేకుండా జీవించడంకంటే చనిపోవడం మేలని అక్కడే ప్రతిజ్ఞ తీసుకున్నారు. వీరు నేతాజీ ప్రసంగాలను ఆసక్తిగా వినేవారు. 'మీ రక్తం నాకివ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అనే నినాదం బాగా ఉద్రూతలూగించింది.

నిజాంపై బాంబులు విసిరి చంపాలని నిర్ణయించుకున్నారు. ఆపై ప్రాణత్యాగానికి కూడా సిద్ధంగా ఉన్నారు. రోజూ సాయంత్రం దార్ ఉ ల్‌షిపాలోని తన తల్లి సమాధిని సందర్శించడానికి నిజాం క్రమం తప్పకుండా అదే రూట్‌లో వస్తాడు. పండిట్ విశ్వనాథ్, నారాయణరావు పవార్ బాంబులు కొనడానికి బొంబాయి వెళ్లారు. షోలాపూర్‌లో కొండా లక్ష్మణ్‌ను కలిశారు. రజాకారులను ఎదుర్కోవడానికి తమకు బాంబులు కావాలన్నారు. నిజాంను ఎందుకు చంపకూడదు అని అతను అడిగినప్పుడు, నిజం చెప్పేశారు.

**నారాయణరావ్ పవార్, కొండా లక్ష్మణ్ బాపూజీ**

ఆయన ఆరువందల రూపాయిలు సాయం చేశారు. వెంటనే బొంబాయి వెళ్లి దీక్షిత్ మహారాజును కలిశారు. అతని నుండి రెండు బాంబులు కొన్నారు. తిరుగు ప్రయాణంలో కొండా లక్ష్మణ్‌ను కలువగా ఆయన మూడు రివాల్వర్‌లు, మూడు విషం సీసాలు సిద్ధం చేసి ఉంచారు. బందీలుగా రహస్యాలు బయట పెట్టడం కంటే చనిపోవడమే మేలని సూచించి మూడు విషం సీసాలు ఇచ్చారు.

నిజాంను ఎందుకు చంపాలని అనుకున్నామో వివరంగా రాసి నారాయణ స్వామికి ఇచ్చారు. ప్రణాళిక అమలు చేసే రోజు ఆ ప్రతిని ప్రెస్‌కు రేడియోకు ఇవ్వాలని చెప్పారు. దానిపై నారాయణ రావు పవార్ ముందు దాడి చేయాలి, అక్కడ కుదరక పోతే జగదీశ్, అదీ వీలు పడకపోతే గుండయ్య నిజాంను చంపాలి. ఇది ప్రణాళిక. నారాయణరావు పవార్ నిజాంపై బాంబు విసిరాడు. అయితే అది కారు డోరుకు తగిలి, రోడ్డుపై పడి పెద్ద శబ్దం చేసింది. దానితో నిజాం ప్రాణాలతో బయటపడ్డాడు.

జగదీశ్, గుండయ్యలు తప్పించుకున్నారు. నారాయణరావును పట్టేశారు. నిజాంను సురక్షిత ప్రాంతానికి తీసుకువెళ్లారు. జవాన్లు పవార్‌ను విచక్షణా రహితంగా కొట్టారు. పవార్ హిందువా, మహ్మదీయుడా అని తెలుసుకోవడానికి అతని బట్టలు విప్పారు. 'ఖత్నా' 'సున్తీ' చేయనందున హిందువుగా గుర్తించారు. ఎదురు సెల్‌లో గుండయ్య కన్పించాడు. వరంగల్‌లో గల ఆయన తండ్రికి కబురు పెట్టారు. తండ్రి వచ్చి చూసి ధైర్యం చెప్పి వెళ్లిపోయారు.

పవార్‌కు చివరకు కోర్టు మరణశిక్ష, గుండయ్యకు, జగదీష్‌కు ఆజన్మ కారాగార శిక్షలు విధించింది. పవార్ ఉరిశిక్షను సెషన్స్ కోర్టు ఖాయం చేయగానే పండిట్ రాంప్రసాద్ బిస్మిల్ ఉద్యమకారుని కవిత్వంలోని ఆ పంక్తులు బిగ్గరగా చదివారు.

"సర్ కటా సక్తే హై లేకిన్ సార్
జూకా సక్తే నహీ"
(తలను నరికి వేయవచ్చును, కానీ తల వంచకూడదు)

నారాయణరావ్ పవార్ సాహసం గురించి నిజామాబాద్ కారాగారంలో ఉండగా దాశరథికి తెలిసింది. ఒక కవిత రాశారు.

'ఒక కప్పు అగ్నిరసం తాగించిన/ నీ హస్తం విసిరిన రవిగోళం (గ్రెనైడ్)/ నరకాసుర మర్దనానికి నడిచిన యాదవ యోధుని (కృష్ణుడు) కోదండ వినిర్గత బాణ –నాలుగు డిసెంబర్ 47/ నారాయణరావు నీలో అగ్ని సముద్రం ఉందట నిజమేనా?/ అగ్ని మనిషి నారాయణరావ్'

చివరకు సెప్టెంబరు 17, 1948 నాటి పోలీసు చర్య తరువాత వారు విడుదలయ్యారు. ★

## కథ

మార్కెట్లోకి కొత్తగా వచ్చిన బైకు మీద రిత్విక్ వేగంగా వచ్చి ఒక చిన్న వీధి మొదట్లో ఆగి, కనిపించినంత మేర వీధినంతా ఒకసారి పరిశీలనగా చూశాడు. ఎదురు చూస్తున్నవాళ్లు కనిపించకపోయేసరికి దీర్ఘంగా నిట్టూర్పు విడిచి బైకుని రోడ్డు పక్కన చెట్టు కింద పార్కు చేశాడు. ఎవరో తననే చూస్తున్నట్టు అనిపించి వెనక్కి తిరిగి చూసారు. ఎదురుగా ఉన్న ఇంటి అరుగుమీద వాలు కుర్చీలో కూర్చుని, తననే చూస్తూ రమ్మని చేతులు ఊపుతున్న ముసలతను కనిపించాడు. దాదాపు ఎనభై సంవత్సరాలుండొచ్చు. అతనికి తలంతా పండిపోయి, నుదుట విభూతి రేఖలతో, మెడలో రుద్రాక్ష మాలలతో కూర్చుని ఉన్నాడు.

"ఏం కావాలి తాతగారు? ఏవైనా కొని తెమ్మంటారా?" అని అడిగాడు రిత్విక్ దగ్గరగా వెళ్లి.

"ఏం వద్దుగానీ, చాలా సేపట్నించీ రోడ్డునే చూస్తూ ఉండిపోయావు. ఇలా వచ్చి కూర్చో. నువ్వు ఎదురుచూస్తున్న అమ్మాయి రాగానే వెళ్లిపోదువుగానిలే" ముసిముసి నవ్వులు నవ్వుతూ అన్నాడు ఆయన.

తననే సందేహంగా చూస్తున్న రిత్విక్‌ని చూసి "ఇదేమిట్రా, ముక్కూ మొఖం తెలవని ముసలోడు మనకింత మర్యాద ఇస్తున్నాడేమిటి? అని ఆలోచిస్తున్నావు కదూ!" అన్నాడు. అవునన్నట్లుగా తలవూపాడు రిత్విక్.

"నాకు నీలాంటి హుషారైన పిల్లల్ని చూస్తే చాలా సంతోషంగా ఉంటుంది. అందుకే నీ అమ్మడు వచ్చేవరకూ నీతో మాట్లాడదామని నిలిచాను" అంటూ ఇంకా మాట్లాడబోతుండగా ఇంట్లో నించి టిప్‌టాప్‌గా తయారైన ఒకతను బయటికి వచ్చి ఇంటిముందున్న బైక్‌ని స్టార్టు చేసి కూర్చుని ఎవరికోసమో ఎదురు చూడసాగాడు. కొద్దిసేపైన తర్వాత లోపల్నించి అందమైన అమ్మాయి అత్యవసరంగా వచ్చి బైకు వెనక సీటు మీద కూర్చున్న వెంటనే బైకు బయలుదేరి పోయింది.

"ఎవరు తాతా వాళ్లు? మీ అబ్బాయి, కోడలా" అని అడిగాడు రిత్విక్.

"కాదు, నా మనవడూ, వాడి భార్యా, ఇద్దరూ ఆఫీసుకి వెళ్తున్నారు."

"అలాగా! మరి వాళ్లు మీ ప్రక్కకు తిరిగి చూడనుకూడా చూడలేదేం తాతా?"

"ఇదేం చూసావ్ మనవడా, లోపల నా కొడుకు ఉన్నాడు. కొంచెం సేపట్లో ఆఫీసు కారు వస్తుంది. దానిలో కూర్చుని జుమ్మని వెళ్లిపోతాడు. వాడు కూడా నా పక్క తిరిగి చూడడు. వాడు వెళ్లిపోయిన తర్వాత నా కోడలు ఒక్కర్తే ఇంట్లో ఉంటుందిగానీ బయటికి వచ్చి మాట్లాడదు. ఏవైనా కావాలా? ఏమైనా తింటారా? అని కూడా అడగదు."

"ఏమిటి తాతా ఇది, వినడానికే చాలా కష్టంగా ఉంది. మీరెలా భరిస్తున్నారో?"

"నువ్వు ఎందుకు బాధపడతావ్. నేను చాలా జాలీగా, సంతోషంగా ఉన్నాను'' అన్నాడు ముసలతను బాధను మనసులోనే దాచుకుని.

సరిగ్గా అప్పుడే గుర్తుకొచ్చి తాత కూర్చుని ఉన్న చోటంతా కలయ చూసాడు రిత్విక్. అదొక పాతకాలపు పెంకుటిల్లు, అయినా ఎక్కడా పాతతరం వాసన కనిపించడం లేదు. గుమ్మానికి ఇరువైపులా కూర్చోడానికి వీలుగా పెద్దపెద్ద అరుగులు. అందులో ఒక అరుగుని పెద్ద చెక్కలతో చిన్న రూములా తయారుచేశారు. లోపల తాతగారి కోసం పాతకాలపు మంచం, దానిమీద పాడైపోయిన పరుపు. ప్రక్కనే చిన్న టేబిల్ ఫ్యాను. కూర్చోవడానికి ఈజీ చైర్. ఆ రూములో మూలగా చిన్న బాత్రూం. మొత్తానికి తాతగారు ఇంటి లోపలికి కాలుపెట్టకుండా ఉండడానికి గట్టి ప్రయత్నమే చేశారు. ఇంట్లోని రక్తసంబంధీకులు. అది చూసిన రిత్విక్‌కి మనుసులో బాధనిపించి "అయితే అందరూ ఇలా మిమ్మల్ని బయటికి విసిరేశారన్న మాట" అన్నాడు.

"అలా అనుకోకు మనవడా, అయినా బాధపడడానికి ఏముంది. ప్రపంచమంతా బయటే కదా ఉంది!' అని మాట మార్చాలని "ఒరేయ్ మనవడా, ఆ అమ్మాయి నీకు ఎప్పట్నించి తెలుసు?' అని అడిగాడు.

"ఆరు నెలల నుండే తమ ఫస్టు ఇయర్, నేను ఫైనలియర్."

"బాగుంది. ఇద్దరికీ వయసు వ్యత్యాసం కూడా బాగా కుదిరింది. కానీ మీరెప్పుడైనా, దేని గురించైనా దెబ్బలాడుకున్నారా?"

"దెబ్బలాట ఎందుకు? నేను తనని చాలా ఎక్కువగా ప్రేమిస్తున్నాను తాత."

"అరె...దెబ్బలాడుకోకపోతే అదేం లవ్వురా? ప్రేమికులన్న తర్వాత దెబ్బలాడుకోవాలి. తర్వాత ఒకరినొకరు బ్రతిమాలుకోవాలి. రాజీ అయిన తర్వాత చూడూ...మీ ఇద్దరి మధ్య ప్రేమ మరింత గాఢమవుతుంది. మీరిద్దరూ ఇంకా దగ్గరవుతారు.

ముసలాయన్ని విస్మయంగా చూస్తూ ఉండిపోయాడు రిత్విక్.

ఆ విస్మయాన్ని భంగపరుస్తూ "పోనీ ఇద్దరూ కలిసి బయటికి ఎక్కడికైనా వెళ్లారా?" అడిగాడు ముసలాయన. వెంటనే 'లేదు' అంటూ సమాధానం వచ్చింది రిత్విక్ నించి.

'బయటికి అంటే ఏ ఊటీకో, బెంగళూరుకో కాదు. మనూళ్లో చెరువు గట్టుకో, కొండమీద వెంకన్న గుడికో, లేదా రోజూ చూస్తున్న ఏపుగా పెరిగిన పంట పొలాల గట్టుకో, ఊరికి దూరంగా ఉన్న మామిడి తోటలలోకో...ఇలా ఎక్కడికైనా కలిసి వెళ్లాలి.



వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది

# ప్రేమించు... కలలు కన్నా

సూరిసెట్టి వసంతకుమార్

వెళ్లుంటే మీకు తెలిసేది ప్రేమలోని గమ్మత్తు. ఎప్పుడు చూసినవైనా అన్నీ కొత్తగా, మనసుకి ఉల్లాసంగా కనిపించేవి. ప్రక్కన ప్రేయసి ఉంటే ముళ్లచెట్టు కూడా పూలచెట్టులా కనిపిస్తుంది. నేను చెప్పినట్టు కలిసి తిరిగి చూడండి. అప్పుడు తెలుస్తుంది. మీకు నేను చెప్పింది నిజమని''. ఆ తర్వాత పంచుకున్న ఆనందాల్నీ, సంతోషాల్నీ మనస్సులో చక్కగా భద్రపరచు కోండి. ఎప్పటికైనా ఉపయోగపడతాయి.

కళ్లింత చేసుకుని గురువు చెప్పే పాఠాల్ని శ్రద్ధగా వింటున్న శిష్యుడిలా వినసాగాడు రిత్విక్. ఇంకా ఏం చెపుతాడో అని.

“ఒరేయ్ మనవడా! అమ్మాయి ప్రేమ పొందడం అంత వీజీ కాదు. ఎప్పుడూ సెల్‌ఫోన్లో మాట్లాడు కోవడం, నవ్వుకోవడమో కాకుండా అప్పుడప్పుడు మీరు సూపర్ అనో, మీకు చాలా ధైర్యమండీ అని పొడగించుకొనే పనులు చేసి చూపించాలి. చదువుల్లోనూ, ఆటల్లోనూ ఇద్దరూ ఒకరికొకరు పోటీపడాలి. ఒకసారి నువ్వు గెలిచి చూపించు. తను ఓడిపోయానని బుంగమూతి పెట్టుకుంటుంది. అలిగి కూర్చుంటుంది. వెళ్లి నాలుగు మంచి మాటలు చెప్పి ఓదార్చు. అలాగే నువ్వు మరోసారి కావాలని ఆమె దగ్గర ఓడిపో. అప్పుడు ఆమె ముఖంలో కనిపించే సంతోషాన్ని భద్రంగా దాచుకో. ఆమె ముఖంలో మారే రకరకాల భావాల్ని చూడు. ఆ సమయాల్లో ఆమె కళ్లల్లో వెయ్యి అర్థాలు స్ఫురిస్తాయి. పెదవులు చెప్పలేని రాగాల్ని పలికిస్తాయి. వీటన్నింటినీ ఒక్కటి కూడా వదలకుండా భద్రంగా గుండెలో భద్ర పరుచుకో. ఇటువంటి అనుభూతులు డబ్బిచ్చి కొందా మన్నా దొరకవు. అలాగే కొన్నిసార్లు బాధపడుతూ “నువ్వు చెప్పినట్టూ చేసి ఉండవలసింది తప్పు చేశాను” అంటూ ఆమెని పొగుడుతూ ఉంటే నీమీద ప్రేమ అలా... అలా వెలిగిపోతుంది” అన్నాడు ముసలాయన. ఈ సంగతుల్ని చెబుతు న్నప్పుడు ఆయన ముఖంలో ఏదో తెలియని సంతోషం.

“ఎందుకు తాత మళ్లీ మళ్లీ ప్రేమించుకున్నప్పుడు జరిగిన తీపి గురుతుల్ని జ్ఞాపకం ఉంచుకోమంటు న్నావు” అని అడిగాడు ఫస్టు బెంచ్ స్టూడెంట్‌లో రిత్విక్.

ముసలాయన ఒక్క నిమిషం ఆగి మళ్లీ చెప్పడం ప్రారంభించాడు.

“ఈ ఇల్లు నా కష్టార్జితంతో కట్టాను. కొడుకూ, కోడలూ మనవలూ, మనవరాళ్లలో సంతోషంగా ఉండొచ్చు అనుకున్నాను. కానీ ఏమయింది? వాళ్లందరూ ఇంటిలో ఉండి నన్ను బయటికి తోసేసారు. నా ప్రేమని పంచుకున్న మా ఆవిడ ఇది చూడలేనన్నట్లు రెండేళ్ల క్రితం హాయిగా వెళ్లిపోయింది. ఇది చెబుతున్నప్పుడు ముసలాయన కళ్లల్లో నీళ్లు తిరగడం గమనించాడు రిత్విక్.

వాళ్లు తరిమేశారని నేను బాధపడలేదురా. నేను ఈ రోజుకీ సంతోషంగానే ఉన్నాను. మా ఆవిడతో గడిపిన ప్రతిక్షణం మధురక్షణాలే. మొట్టమొదటిసారి పెళ్లి చూపుల్లో తనని చూసినప్పుడు కలిగిన ఫీలింగు, తర్వాత పెళ్లిలో మా ఇద్దరి మధ్య చేయించిన చిలిపి చేష్టలూ, తను మొదటిసారి నెల తప్పినప్పుడు కలిగిన ఆనందం, ఇలా ప్రతి క్షణం తనతో నేను పంచుకున్న ఆనందాల్ని తలుచుకుంటూ ఉంటే నాకు కాలమే తెలియడంలేదు. తెలుసా?” అన్నాడు ముసాలాయన.

ఇంతలో రిత్విక్ ఎదురుచూస్తున్న అమ్మాయి రావడంతో “చాలామంచి విషయాలు తెలుసుకు న్నాను తాత. చాలా చాలా థాంక్సు తాత. మీరు మా మామ్మతో డ్యూయెట్ పాడుకుంటూ ఉండండీ. మేం వెళ్లి వస్తాం” అంటూ బైకు స్టార్టు చేసాడు రిత్విక్.

కన్నీరు జలజలా రాలుతూ ఉంటే ఆనందంతో చెయ్యి ఊపాడు ముసలాయన. ★





# అశాంతి మంటల్లో

**దేశంలో ఏదయినా రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పితే కేంద్రం జోక్యం చేసుకోవచ్చు. అది రాజ్యాంగం ద్వారా దానికి సంక్రమించిన అధికారం. మణిపూర్‌లో ఇటీవల హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకుని కర్ఫ్యూ దాకా వెళ్లాయి. దాంతో కేంద్రం తన సొంత పార్టీ ప్రభుత్వంపైనే ఆర్టికల్‌ 355 విధించి శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకుంది. ఇప్పుడు పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇంతకీ మణిపూర్‌లో ఈ పరిస్థితికి దారితీసిన అంశాలేమిటి?**

గత వారం మణిపూర్‌లో హింస చెలరేగింది. మైతేయీలకు గిరిజన హోదా ఇవ్వాలనే డిమాండ్‌కు వ్యతిరేకంగా కుకీలు చేపట్టిన నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. రాష్ట్ర జనాభాలో మైతేయీల వాటా 53 శాతం వరకూ ఉంటుంది. వీరిని గిరిజనుల జాబితాలో చేరిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లకు వీలుపడుతుంది. మరోవైపు అటవీ భూములపైనా హక్కులూ సంక్రమిస్తాయి. మైతేయీలకు గిరిజన హోదా కల్పించడంతో రిజర్వేషన్లలో తమ వాటా తగ్గిపోతుందని ఇప్పటికే గిరిజనులుగా గుర్తింపు పొందిన తెగలు వాదిస్తున్నాయి. శతాబ్దాల నుంచి తమ దగ్గరే ఉన్న అటవీ భూములకూ ముప్పు పొంచి ఉందని ఆందోళన చెందుతున్నాయి.

మణిపూర్‌ లోయప్రాంతంలో ఎక్కువగా మైతేయీ ప్రజలు జీవిస్తున్నారు. చుట్టుపక్కల కొండప్రాంతాల్లో కుకీలదే ఆధిక్యం. అయితే, మైతేయీలు అధికంగా ఉండే ప్రాంతంలో కుకీలు, కుకీలు అధికంగా ఉండే ప్రాంతంలో మైతేయీలు స్వల్ప మొత్తంలో జీవిస్తుంటారు. ఆయా ప్రాంతాలలో మైనార్టీలను లక్ష్యంగా చేసుకున్నారు. కొన్నిచోట్ల మొత్తం గ్రామాలనే తగులబెట్టారు. ఇళ్లు, వాహనాలకు నిప్పు పెట్టారు.

**ఇలా ప్రారంభమైంది**

మైతేయీ కమ్యూనిటీని ఎస్టీలలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని మణిపూర్‌ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించడాన్ని వ్యతిరేకిస్తూ మణిపూర్‌ ఆల్‌ ట్రైబల్‌ స్టూడెంట్స్‌ యూనియన్‌ (ఏటీఎంఎస్‌ యూ) మే 3వ తేదీన అన్ని జిల్లాల్లోనూ ఆందోళనలు చేపట్టింది. ఆ మరునాటి (మే 4) నుంచి హింస ప్రజ్వరిల్లింది. అది మొదటి నాలుగైదు రోజుల్లోనే మణిపూర్‌, చురాచాంద్‌ పూర్‌, ఇంఫాల్‌ ఈస్ట్‌, ఇంఫాల్‌ వెస్ట్‌, బిష్ణుపూర్‌, టెంగ్నోపాల, కాంగ్పొపొక్పి తదితర ప్రాంతాలకు విస్తరించింది. దాడులు, గృహదహనాలు విశృంఖలంగా సాగాయి.

ఏదైనా రాష్ట్రంలో అంతర్గత ఘర్షణల వల్లగానీ, ఇతర కారణాలతో పరిస్థితి అదుపు తప్పినప్పుడు శాంతిభద్రతలను అమలు చేసే బాధ్యతను రాజ్యాంగంలోని 355వ అధికరణ ప్రకారం కేంద్రం తన చేతుల్లోకి తీసుకోవచ్చు. ఆ ప్రకారమే, మణిపూర్‌లో ఆర్మీ, అస్సాం రైఫిల్స్‌, ర్యాపిడ్‌ యాక్షన్‌ ఫోర్స్‌ రంగప్రవేశం చేశాయి. కర్ఫ్యూ విధించి పరిస్థితిని అదుపులోకి తేవటానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ఆ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మెజిస్ట్రేట్లకు 'కనిపిస్తే కాల్చివేత' (షూట్‌ ఎట్‌ సైట్‌) ఉత్తర్వులు జారీ చేసే అధికారాన్ని అప్పగించింది. మొబైల్‌ డేటా, బ్రాడ్‌ బ్యాండ్‌ కనెక్షన్లు నిలిపివేసింది. సైన్యం ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహించింది. ఆర్మీడ్రోన్లు, హెలికాప్టర్లు మణిపూర్‌ను జల్లెడ పట్టాయి. దాదాపు 10వేల మంది సైనికులు, పారామిలటరీ బలగాలు పహారా కాస్తున్నాయి.


హింసలో కొన్ని పదుల మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. కచ్చితంగా ఎంత మంది చనిపోయారనే అంశంలో స్పష్టత లేదు. మణిపూర్‌ సెక్యూరిటీ ఎడ్వయిజర్‌ కులదీప్‌ సింగ్‌ మాత్రం 37 మంది చనిపోయినట్లు ప్రకటించారు. కుకీ, మైతేయీ తెగలకు చెందిన దాదాపు 23 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని డిఫెన్స్‌ బృందాలు ప్రకటించాయి. ఆయా రాష్ట్రాలు హింస ప్రజ్వరిల్లిన ప్రాంతాలనుంచి తమ వారిని తరలించాయి. ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం మణిపూర్‌ నుంచి విద్యార్థులను ప్రత్యేక విమానం ద్వారా సురక్షితంగా రప్పించింది. సిక్కిం, త్రిపుర, రాజస్థాన్‌ రాష్ట్రాలు కూడా తమ వాళ్లను కాపాడుకున్నాయి.

**నేపథ్యం...**

మణిపూర్‌లో ముఖ్యంగా మూడు తెగలవాళ్లు ఉన్నారు. కుకీ, నాగా, మైతేయీ.. ఈ మూడింటితో పాటు కుకీ ఫంగల్‌ అన్న చిన్నతెగ కూడా ఉంది. కుకీ,నాగాతెగల ప్రజలంతా క్రైస్తవులు. వారిని ఎస్టీలుగా పరిగణిస్తున్నారు. మెజార్టీ తెగ ప్రజలు మైతీలు. వీళ్లంతా హిందువులు. మణిపూర్‌లో రెండు వేల సంవత్సరాలకు పైగా ఉంటున్నారు. ఇందులో ముస్లిం మతంలోకి మారిన వారిని మైతీ పంగల్‌ అంటారు.

22వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే మణిపూర్‌లో 10శాతం లోయలో ఉండే మైదాన ప్రాంతం. మిగతా 90శాతం పర్వతాలు, కొండలతో, లోయలతో ఉంటుంది. ఎత్తయిన కొండప్రాంతంలో కుకీ, నాగా ప్రజలుంటే, లోయలో ఉండే మైదాన ప్రాంతంలో మైతేయీలు ఉంటారు. స్వాతంత్ర్యం వచ్చాక కుకీ, నాగా ప్రజలను ఎస్టీలలో చేర్చారు. ఈ కొండ ప్రాంతానికి రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 371సీ కింద రక్షణ కల్పించారు. అంటే...ఈ కొండ ప్రాంతాలలో బయట ఎవరూ స్థలాలు అమ్మటానికి లేదు. బయట వాళ్లు కొనటానికి లేదు. కానీ అదే లోయలో ఉండే మైదాన ప్రాంతంలో ఎవరయినా స్వేచ్ఛగా స్థలాలు కొనుక్కోవచ్చు, అమ్ముకోవచ్చు. వ్యాపారాలు కూడా చేసుకోవచ్చు.

ఒకే రాష్ట్రంలోని రెండు ప్రాంతాల వారికి వేర్వేరు చట్టాలు, అధికారాలు అమలవుతున్నాయి. మణిపూర్‌లో కొండ ప్రాంతాల కోసం ప్రత్యేకంగా హిల్‌ ఏరియా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి



**డాక్టర్‌ పార్థసారథి చిరువోలు**
సీనియర్‌ జర్నలిస్ట్‌



# మణిపూర్

విశేష అధికారాలు ఉన్నాయి. బడ్జెట్ రూపొందించే టప్పుడు హిల్ ఏరియా కమిటీ అనుమతి కూడా పొందాలి. ప్రభుత్వం రూపొందించిన అంశాలు కుకీ, నాగా ప్రజల హక్కులకు ఎలాంటి భంగం కలిగించదని నిర్ధారించుకున్న తర్వాతే అది అమల్లోకి వస్తుంది. దానితో పాటు మణిపూర్ లాండ్ రెవెన్యూ, లాండ్ రిఫార్మ్స్ మీద కూడా ఈ కమిటీకి అధికారం ఉంటుంది. మణిపూర్‌లో కుకీలు, నాగాలకు ఎస్టీ హోదా కల్పించారు. కొండప్రాంతం అడవులలో స్వేచ్ఛగా తిరిగే అవకాశం కల్పించారు. కానీ క్రైస్తవంలోకి మారిన తర్వాత కూడా వారి ఎస్టీ హోదాను ఎందుకు రద్దు చేయలేదని ఇతర వర్గాల వారు ప్రశ్నిస్తున్నారు

కొన్ని వేల ఏళ్లుగా ఉంటున్న తమకు ప్రత్యేక హక్కులు లేకుండా చేశారని మైతేయీలు నిల దీస్తున్నారు. కుకీ, నాగాలకు ప్రత్యేక హక్కులు కల్పిస్తూ తమను విస్మరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దానితో పాటు బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి అక్రమంగా మణిపూర్‌లోకి ప్రవేశించిన వలసదారులు తమ అవకాశాలను కొల్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి ఆవేదన సహేతుకంగా అనిపిస్తుంది. కాలక్రమంలో వాళ్లు మైనార్టీలుగా మారి పోయారు. గత కొన్నేళ్లుగా మైతీల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. వారి వాదనను విన్న కోర్టు మైతీలను ఎస్టీలలో చేరుస్తూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపవలసిందిగా సూచిం చింది. దాంతో కుకీ, నాగా ప్రజలు మితిమీరిన దౌర్జన్యానికి దిగారు. కుకీలు కత్తులతోనూ, నాగాలు ఏకే 47లతోనూ విరుచుకు పడ్డారు.

దశాబ్దాలుగా కుకీలు, నాగాలు అడవులలో గంజాయి సాగు చేస్తూ, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాలకు తీసికెళ్లి అక్కడ ఐఎస్ఐ ఏజెంట్లకు అమ్ముతున్నారు. మణిపూర్‌లోని అడవులను ఇందుకు ఉపయోగించుకుంటున్నాయి. పాకిస్తాన్ ఐఎస్ఐకి డబ్బులు సమకూరే మార్గాలలో మణిపూర్‌లో కుకీలు ఉంటున్న అడవులు ఒక మార్గం. మరో వైపు బంగ్లాదేశ్, బర్మానుంచి వచ్చే కుకీలకు నకిలీ ఆధార్ కార్డులు సమకూరుస్తున్నారు. ఇవన్నీ కుకీలు చేస్తున్న ఆగడాలని చెప్పకనే చెబుతున్నాయి. మణిపూర్‌లోని రిజర్వుడు, రక్షిత అటవీ ప్రాంతాన్ని ఈ ట్రైబల్ కమ్యూనిటీలు ఆక్రమించుకోవటంపైన బీజేపీ కఠిన వైఖరి అవలంబిస్తోంది. మాదకద్రవ్యాలపైన పోరాటంలో భాగంగా కుకీలను అణచివేయటం ఓ మార్గమని ముఖ్యమంత్రి బైరన్‌సింగ్ కూడా భావిస్తున్నారు. మరో వైపు మణిపూర్‌లో గిరిజనుల జనాభా బాగా పెరిగిపోవటంతో వాళ్లు చుట్టుపక్కల ప్రాంతాల్లోకి విస్తరిస్తున్నారు. వాళ్లంతా ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతున్నారు. కొత్త గ్రామాలను గుర్తించటానికి ఒక విధానం అంటూ లేకుండా పోయింది. అటవీ చట్టం అమలుపైన కూడా పారదర్శకత లేదు. ఇది కూడా బీజేపీలో సొంత పార్టీ వాళ్లలోనే ఆగ్రహానికి కారణమవుతోంది.

చురాచంద్ పుర్ జిల్లాలో, 1966లోనే ప్రొటెక్టెట్ ఏరియాగా ప్రకటించిన చూరాచంద్ పుర్– ఖైపుమ్ రక్షిత అటవీప్రాంతంలో హఠాత్తుగా సర్వే ఎందుకు చేపట్టారని బీజేపీ ఎమ్మెల్యే పావోలీన్లాల్ హావోకిప్ నేరుగా అటవీశాఖ మంత్రినే నిలదీశారు. ఈ ఎమ్మెల్యే కుకీ కావటం గమనార్హం. ప్రభుత్వం దగ్గర సర్వే రికార్డులు లేనప్పుడు, ఈ ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా ప్రకటించటం తప్పని, అది చెల్లదని వాదిస్తున్నారు. ఈ అంశంపై స్పష్టత వచ్చేవరకూ సర్వేలు నిలిపివేయాలని కోరారు.



'మణిపూర్‌లో హింస దురదృష్టకరం. రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం వల్ల ఈ పరిస్థితి వచ్చింది.హింస ద్వారా సాధించేదేమీ ఉండదు. ప్రజలు ముందుకొచ్చి సానుకూలంగా సమస్యలను పరిష్కరించుకోవాలి'అని కేంద్ర మంత్రి, ఈశాన్య రాష్ట్రాల ఇన్ ఛార్జి కిషన్ రెడ్డి సూచిస్తున్నారు.

ఆయా డిమాండ్ల మాట ఎలా ఉన్నా, ముఖ్య మంత్రి బైరన్ సింగ్ స్పష్టంగా ఉన్నారు. శాటిలైట్ మేపింగ్ ఆధారంగా కొండ ప్రాంతాలలో ఫారెస్ట్ కంపోజిషన్‌ను గుర్తిస్తామని, ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఆక్రమణలకు గురయ్యాయంటూ కొన్ని ఇళ్లను గత నెల (ఏప్రిల్) తొలగించారు కూడా. మరో వైపు మైతీలకు ఎస్టీ హోదా కల్పించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేయవలసిందిగా బీజేపీ ఎమ్మెల్యే ఒకరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

హింస ద్వారా సాధించేదేమీ ఉండదని, ప్రజలు ముందుకొచ్చి సానుకూలంగా సమస్యలను పరిష్కరించుకోవాలని కేంద్ర మంత్రి, ఈశాన్య రాష్ట్రాల ఇన్ ఛార్జి కిషన్ రెడ్డి సూచిస్తున్నారు. 'మణిపూర్‌లో హింస దురదృష్టకరం. రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పరిస్థితిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తు న్నారని ఆయన వివరించారు. మణిపూర్ పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని కేంద్రమంత్రి ఆర్కే సింగ్ ప్రకటించారు. మణిపూర్‌లో త్వరలోనే పరిస్థితులు చక్కబడవచ్చు. ★



ముఖ్యమంత్రి
బైరాన్‌సింగ్



బీజేపీ ఎమ్మెల్యే
పావోలీన్లాల్ హావోకిప్

# స్వరరాగిణి...

ఆహార్యం, అభినయం. ఈ రెండూ వేరుగా కనిపించినా, వినిపించినా మనకు అనిపించేదొకటే! అభినయ విశేషం. మరింత వివరంగా చర్చించాలంటే... తన, ఇతరుల భావాలను చూపులు, చేతులతో ప్రస్ఫుటం చేసేదే నృత్యాభినయ ప్రక్రియ. మాటలు, అలంకారం, కదలికల సమ్మేళనంతో దృశ్య కావ్యాన్ని ఆవిష్కరింప చేసేదే నర్తనం. ఇదంతా హృదయగత భావనల సూచిక. ఇందులో కోవిదురాలు కడూరి వెంకటలక్ష్మమ్మ. కర్ణాటకలోని మారుమూల పల్లెలో అతి సాధారణ కుటుంబంలో పుట్టి, సమున్నత పౌర పురస్కృతి పద్మభూషణ్‌ను అందుకున్న నృత్య సంగీత కళాభినేత్రి. 1906 మే 29న ఉదయించిన విద్వత్ తేజం ఆమె. అన్నింటినిమించి, తన గురురత్నంతో కలసి మూడు దశాబ్దాలకు పైగా అవిరామంగా, అవిశ్రాంతంగా నాట్య ప్రదర్శనలిచ్చిన సామ్రాజ్ఞి. మైసూరు రాజభవంతిలో నలభయ్యేళ్ల పర్యంతం సేవలందించిన విద్వన్మణి. భారతీయ నృత్య నికేత్ పేరిట గగనవీధిన పతాకను ఎగురవేసిన నిత్యచైతన్యశీలి. జీవితమంతా విశేషమయమే. ఆమాటే అంటే... 'సంగీత నృత్యాలను మించిన విశేషాలు ఇంకెక్కడైనా ఉంటాయా?' అనే వారు నవ్వుతూ!



కదూరి వెంకటలక్ష్మమ్మ

సంగీత సాహిత్యాల మేలుకలయిక నర్తనం. ఆదికవివర్యులన్నట్లు స్వరరాగ నవయోగ సమ భూషితం. జనచైతన్య నిజరూపిణి, భవ్య సందీప ఫలకారిణి నృత్యమే. ప్రతిభా సమున్వేషిణి అయినా, సర్వమహాభావ సంజీవని అయినా అదే. ఆ ధ్యానం, ధ్యేయం, ఆచరణీయ జ్ఞాన సంపన్నత్వంతో సరస్వతి, లక్ష్మి రూపాలను ఆరాధించుకున్నారు వెంకట లక్ష్మమ్మ. గాయనీ సమాజం 'సంగీత కళారత్న' అని శ్లాఘించింది. గాయకలోకం సమర్చన చేసింది. నాట్యరాణివంటూ వరించి వచ్చింది కర్ణాటక పురస్కార మేలిమి రూపం. కళాకారుల ప్రపంచ మంతా జేజేలు పలుకుతుంటే, వాటిని ఆస్వాదిస్తూనే అదే స్థాయిలో చివరి వరకు తన వంతు కృషిని కొనసాగిస్తూ వచ్చిన వజ్రసంకల్ప శక్తి ఆమె.

అణువణువునా నాదం, అడుగడుగున నాట్య వినోదం. నటరాజ పాదాలు దరిచేరి, నయనాభి షేకాలతో సేదదీరి, జీవితాన్ని రసవంతం చేసుకున్న నర్తకీ మణి. బాల్య, యౌవన, కౌమర, వార్ధక్య దశ లన్నిటిలోనూ కళలకే పట్టం కట్టిన కారణజన్మురాలు.

చిన్ననాడే తండ్రిని కోల్పోయినా, తాతవద్ద బాల్యమంతా గడిచినా మొదటి నుంచి సార్థకత కోసమే ఆ కళానిపుణ ప్రయత్నమంతా! ఎనిమిదేళ్ల యినా రాకముందే మైసూరు రాజాస్థానంలో విద్యార్థినిగా మారింది. నాట్యశిక్షణ పొందడం అరంభించి, అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చింది. గురుకుల విధానం కాబట్టి దీక్షాదక్షతలతో కళారాధనం. కళ అంటే ఒక్క నృత్యం అనేకాదు. సంస్కృత విద్యాభ్యాసం, సంగీత పరిజ్ఞాన సాధనం కూడా.

**ఉత్సవ ఉత్సాహఖ్యాతి**

ముప్పయ్ మూడేళ్ల వయసులో మైసూరు మహారాజా ఆస్థాన నర్తకి స్థాయిని అందుకున్నారు వెంకట లక్ష్మమ్మ. నాట్యరూపం, శైలీ విన్యాసం కలగలిపి భరతనాట్యరీతిని ఇంకెంతో కాంతిమంతం చేశారు. ఏటా విజయదశమి మహోత్సవాలు నృత్య వేదికగా భాసించేవి. మైసూరు దసరా సంబరాలకు అనేకానేక వత్సరాల ఘన చరిత్ర ఉంది. పదిరోజులు పూజలు, ఊరేగింపులు, ఉత్సవాలు, ప్రదర్శనలు. దేశంలోని నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కళారాధకులు వచ్చి వెళ్లడం పరిపాటి. అమ్మవారు చాముండేశ్వరీ దేవి. శిష్టరక్షణ, దుష్టశిక్షణ. అక్కడి (మైసూరు) రాజభవంతికి కొన్ని

# పదవాహిని

కిలోమీటర్ల దూరంలోనే పర్వతంపై దేవాలయం ఉంది. దేవతామూర్తి అలంకరణకు ఆభరణాలు అందించేది రాజవంశీయులే. నాలుగు వందల సంవత్సరాల క్రితం ప్రారంభమై కొనసాగుతూ వస్తున్న వార్షిక సంప్రదాయ పరంపర. దసరాకు ముందు అన్ని పండుగరోజులూ శక్తిమాతకు సమర్చనలు. మైసూరు దసరా సంరంభాలు అన్ని విధాలా ప్రత్యేకమైనవే. ఆ పండుగకు నెల రోజుల ముందు నుంచే అంతటా పర్వదినోత్సాహం వెల్లివిరుస్తుంది. అంతటి పేరున్న, విశేషాలు సంతరించుకున్న ఉత్సాహ ఉత్సవాల్లో భాగంగా వెంకట లక్ష్మమ్మ నృత్యప్రదర్శనలు దేదీప్యమాన మయ్యేవి. ఏ సందర్భంలోనైనా తన కళా ప్రదర్శన కార్యక్రమం విధిగా ఉంటుండేది. భక్తజనులకు ప్రతి నర్తన రూపమూ నేత్రానందం కలిగిస్తుండేది.



మైసూర్ రాజప్రసాదం (ప్యాలెస్)

**శిక్షణ వేదిక... ప్రయోగాల వాడుక**

భక్తి, కళ, సాహిత్య సౌభాగ్యం, సంగీత మాధుర్యం, నృత్యవిన్యాసం సమరసంగా మిళితమైన అన్ని ఉత్సవాలకూ పేరెన్నిక తన వల్లనే. అటు తర్వాత పరిణామాల పరంపర ఎన్నెన్నో మార్పులు తెచ్చింది. వాటిలో భాగంగానే , వెంకట లక్ష్మమ్మ నిర్వహణలో భారతీయ నృత్యరీతులు శిక్షణ సంస్థ ప్రారంభమైంది. తాను నేర్చుకున్న విద్యను ఎందరెందరికో నేర్పించారామె. విద్యాప్రదర్శనలకు వేదికలనూ కల్పించారు. ఓ ఉద్యమంగా, ప్రవాహ వేగంగా ఆ సంస్థ పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఈ నాట్యశాస్త్రం మైసూరు విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశం కావడం వెనుక అభినేత్రి కృషి ఎంతైనా ఉందనాలి.

నిరవధిక కృషి పర్యవసానంగా కోర్సు మొదలైంది. ఇందుకు మెట్టమొదటి బోధక రీడర్ వెంకట లక్ష్మమ్మే. పదవీకాలంలో కళాసంబంధ ప్రయోగాలెన్నో చేశారు. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా, వికాస సంబంధంగా ఎందరెందరినో ప్రభావితం చేసిన మూర్తిమత్వం తనది. పదవీ (తన దృష్టిలో 'రీడర్' అనేది పదవి కాదు. ఒక బాధ్యత) విరమణ తదుపరి సమావేశంలో ఆమె ప్రసంగ అంశాన్ని క్రోడీకరించి కవితా రూపమిస్తే ఈ విధంగా రూపొందింది.

**సాధారణ జీవితం నాది**
**అసాధారణ కళకే అంకితమైంది**
**ఆలోచనల కదలికే జీవితమన్న భావం నాది**
**భారతీయతే విదేశాలకు దీపమనే తత్వం నాది**
**ఆ దీపధారిణి భరత నాట్య రూపిణే అన్పిస్తుం టుంది**
**రాజ ఆస్థానంలోనైనా, కళానీరాజన హృదయ**
**ఆస్థానవేదికపైన అయినా నర్తకి పాత్ర నాది**
**నర్తించడంలోనే ధన్యత ఉంటుందన్న నిశ్చయం ఉంది**

**ఎంత నేర్చుకున్నానో అంత నేర్పించానన్న**
**ఆనంద అతిశయమైతే నాకుంది, ఈ అతిశయమూ**
**నటరాజ పాదాల ముందు ఒద్దికగా ఒదిగింది**
**ముందే అన్నాను....**
**నాది సాధారణ జీవనమైనా, కళారాధన అసాధారణమని**
**ఇప్పుడూ చెప్తున్నాను**
**'నాతోనే కళ, కళతోనే నేను' అనేది తప్పు**
**మరే విధమైనదీ నాలో మెదలదని**
**భరతనర్తనకే నాదైన అంతా సదా సమర్పితమని!**

పలుకళల సమాహారమైన నాట్యానికే తన జీవనయానంలో సుస్థిరస్థానం కలిగించారు కళారమణి వెంకట లక్ష్మమ్మ. బెంగళూరులో ఏర్పాటైన శిక్షణ నిలయానికి ప్రధాన ఆచార్యకత్వం వహించారు. సంగీత నృత్య అకాడమీ పురస్కారాన్ని, కర్ణాటక రాజ్యోత్సవ పురస్కృతిని సొంతం చేసుకున్నారు. మైసూరు,హంపి విశ్వవిద్యాలయాల గౌరవాదరాలనూ స్వీకరించారు. ఆమె జీవనరంగం మీద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డాక్యుమెంటరీచిత్రాలు రూపొందించాయి.

**ప్రవీణ, నిపుణశీలి**

'అభినయ' పేరుతో సదస్సులు, కార్యశాలలను వెంకటలక్ష్మమ్మ ఏర్పాటు చేశారు. ఇతరులు నిర్వహించిన కార్యక్రమాలకు అతిథిగా ఉపన్యాసాలు, ప్రదర్శనల, బోధనలు నిర్వర్తించారు. విశ్వవిద్యాలయంలోని రీడర్ పదవి నుంచి విరమించాక, అదే స్థానంలో మనుమరాలు శకుంతలమ్మ కొంత కాలం బాధ్యతలు చేపట్టారు. మనుమరాలి మాటల్లో చెప్పాలంటే 'చదువుల సరస్వతిగా,కళల లక్ష్మీదేవిగా ధన్యులయ్యారు వెంకట లక్ష్మమ్మ. వయసు జయించిన ప్రవీణ, నాట్య విద్యలో తరించిన నిపుణ! ★



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**



**భగవద్గీత నేటికి 5000 సంవత్సరాల నాటిది. ఇది వ్యాస విరచిత మహాభారతాంతర్భాగం. దీని ఆధారంగా ఆనాటి సాంఘిక, సామాజిక, రాజకీయ పరిస్థితులను కొంతవరకు అంచనా వేయవచ్చు.**

మహాభారత కాలంలో రాజరికం ప్రపంచ వ్యాప్తంగా ఉంది. ఇది ఆనువంశికంగా సంక్రమించేది. సమాజంలో సాత్విక యజ్ఞాలతో పాటు ఆడంబరాల కోసం రాజకీయ యజ్ఞాలు కూడా జరిగేవి. 'నేనే దేవుణ్ణి, సృష్టి అనిత్యం, దీనికి వేరే కర్త లేదు. విషయవాంఛలే సర్వస్వం' అని భావించే వర్గాలు సమాజంలో ఉండేవి.

వేదానికి సమున్నత గౌరవం ఉండేది. వేదం పేరుతో అవైదిక ఆచారాలు కూడా కొన్ని వ్యాపించాయి. వాటిని యదు వంశీయులు నిరోధించారు. యాదవ కృష్ణుడు ధర్మపీఠం అధిష్ఠించగా ద్రోణ, అశ్వత్థామ వంటివారు కొందరు బ్రాహ్మణులు క్షత్రియ విద్యలు స్వీకరించారు. బహుభార్యత్వం వలెనే బహు భర్తృత్వం కూడా కనపడుతున్నది. నియోగ పద్ధతిలో సంతానోత్పత్తి చట్ట సమ్మతమే. మనుస్మృతి ఉండేది. రాజులు చలద్యూతము ద్వారా రాజ్యాధికారాలు పొందేవారు. వారికది వ్యసనంగా ఉండేది. ఇది అప్పుడు మృగశిర ప్రథమయుగం.

గీతలో జనకుడు రాముడు వంటి పేర్లు కనిపిస్తాయి. కాబట్టి చారిత్రకంగా రామాయణ కాలం తర్వాత మహాభారత కాలం అనేది నిర్వివాదాంశం. గీతలో ఆర్య శబ్దం జాతి (రేస్) వాచకంగా కాక, గుణవాచకంగా ఉపయోగించారు.

ద్రవ్య యజ్ఞంతోబాటు జ్ఞానయజ్ఞం, కర్మయజ్ఞం, ధ్యానయజ్ఞం కూడా ఉండేవి. ప్రపంచంలోని వివిధ దేశాలవారు ఆత్మ (సోల్)ను నమ్మారు. అది భౌతిక పదార్థం కాదు కాబట్టి నీటికి తడవదు, ఎండకు ఎండదు. అగ్నికి కాలదు.

గీత ప్రథమాధ్యాయంలో – యుద్ధంలో పాల్గొన్న కొందరు రాజులు, వారి రాజ్యాల పేర్లు కనిపిస్తాయి. ద్రుపదుడు, విరటుడు, చేకితానుడు, చేది, కాశీరాజులు, పురుజిత్తు, కుంతీభోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, విక్రాంతుడు, ఉత్తమౌజుడు, కర్ణుడు, కృపుడు, సౌమదత్తి, పంచపాండవులు, కౌరవులు ఇలా కొన్ని పేర్లు గమనిస్తే ఆనాటి (5000 ఏళ్లనాటి) రాజ్యాలను రాజ వంశాలను ఊహించ వచ్చు. వీటిని నేటి ఉత్తరప్రదేశ్, బిహార్, హరియాణా, పంజాబ్ వంటి రాష్ట్రాలలోని ప్రాంతాలతో ధృవీక రించుకోవచ్చు.

'ఐతరేయ బ్రాహ్మణం'లో విశ్వామిత్రునిచే శపితులైన వారి జాబితా ఉంది. వీరిలో నేటి దక్షిణ రాష్ట్రాల్లోని ఆంధ్రజాతి వంటివారి పేర్లున్నాయి. మహాభారత యుద్ధంలో దాక్షిణాత్యులు కొందరు మల్లయుద్ధ వీరులు పాల్గొన్నట్లు తెలుస్తున్నది. అవంతి (ఉజ్జయిని), నలంద, కాశి, కాంచీపురం నేటికీ ప్రధాన విద్యాకేంద్రాలు. గాంధారి (కాందహార్), మాద్రి (మద్ర) పాంచాలి (పాంచాల) ఇలాంటి పేర్లను బట్టి ఆనాటి ఆయా రాజ్యాల పేర్లను నేడు మనం పోల్చుకోవచ్చు. నైమిశారణ్యం నేటి ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోకు సమీపంలో ఉంది. కురుక్షేత్ర హరియాణాలో ఉంది. సప్తసింధు – సుమేరు సుమేరియన్ – ఆర్యావర్తా వంటి పదాలపై చాలా పరిశోధనలు జరిగాయి.

అశ్వత్థం, శమీవృక్షం మిక్కిలి పవిత్రమైనవి. తాను అశ్వత్థ నారాయణుడను అని విభూతి యోగంలో శ్రీకృష్ణుడు చెప్పుకున్నాడు. పాండవుల ఆయుధాలను అజ్ఞాతవాసానికి ముందు రక్షించింది శమీవృక్షమే. షోడశ సంస్కారాలన్నీ నిగమ సంప్రదాయానుసారం జరిగేవి. చతురాశ్రమాలూ పాటించేవారు. చతుర్విధ పురుషార్థాలూ ముఖ్యమే. ధర్మ అవిరుద్ధ కామం తానేనని శ్రీకృష్ణుడు గీతలో చెప్పాడు. కామ శబ్దాన్ని విస్తృతార్థంలో తీసుకోవచ్చు.

వేదమంత్రాలను పత్రాలపై లిఖించేవారు (పేపరస్). సంస్కృతం వ్యావహారిక అధికారభాష. యుద్ధంలో పద్మవ్యూహం, గరుడ వ్యూహాల వంటివి పన్నేవారు. ఈ విద్యను భారతదేశంలోనే కాక గ్రీసు, ఈజిప్టు, రోమన్ సమాజాలలోనూ చూడవచ్చు. రథాలపై ధ్వజాలు ఉండేవి. యుద్ధంలో రసాయనిక ద్రవ్యాలు, అణుబాంబులు కూడా వాడిన దాఖలాలున్నాయి. ఆటంబాంబును బ్రహ్మాస్త్రం అని పిలిచేవారు. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రమా? అనే సామెత తెలిసిందే. విరటుని భార్య సుధేష్ణ మద్యాన్ని సేవించింది. బహిష్టు స్త్రీలను తాకటం పాపం. రజోగుణం ఉన్నవారు, తమోగుణులు రాజసభలలో స్త్రీలను అవమానించేవారు.

అహింస పరమధర్మం. అయితే శక్తిలేని శాంతి నిలువదు. అందువల్ల క్షత్రియులు సహజంగా (జెనిటిక్)యుద్ధం చేయవలసిందే. వివాహానికి ముందు ఆర్యా మహాదేవి ఆలయానికి వధువును తీసుకొనిపోయేవారు. రాక్షస వివాహాలు కూడా ఉండేవి.

యుద్ధంలో మరణించిన శత్రువు రొమ్ము చీల్చి రక్తం కళ్ల చూసేవారు. సమాజంలో శ్వపచులు కూడా ఉండేవారు. మృతమాంస భక్షణ తామస లక్షణం. పాలు, వెన్న, నెయ్యి సాత్విక భక్షణ.

'నేనే జీవమునై యున్నాను' శ్రీకృష్ణుని ఈ వాక్యం యోహాను సువార్తలోకి ఎలా ప్రవేశించింది?

యుద్ధ నివారణ కోసం ముందుగా దూతలు వెళ్లేవారు. వారిని బంధించడం కూడా కనపడుతున్నది. భూమిపై హక్కు 13 సంవత్సరాలు ఉంటుంది. ఆ తర్వాత హక్కుదారు కనపడకపోతే



# ధనికులు, ఒకే చోట

అన్యాక్రాంతం అవుతుంది. రామాయణ కాలంలో ఈ హక్కు 14 సంవత్సరాలు. పెద్ద కొడుకును కాదని చిన్నవానికి రాజ్యాధికారం ఇవ్వటం చట్టసమ్మతం కాదు. రామాయణంలో కైక పురుషుల వలెనే యుద్ధతంత్రం నేర్చుకొని యుద్ధాలలో పాల్గొన్నది. అలాగే భారతంలో కూడా సత్యభామ యుద్ధతంత్రం నేర్చుకున్నది.

జరాసంధుడు శాక్తేయుడు. ఇతను స్త్రీలను చెరబట్టేవాడు. నరబలులు ఇచ్చేవాడు. ఇది అవైదికం కాబట్టి శ్రీకృష్ణుడు నిరోధించాడు. ఇంద్రుని పేర పశు యజ్ఞం జరిగితే దానినీ శ్రీకృష్ణుడు నిరోధించాడు. అప్పుడు ఇంద్రపూజకులు శ్రీకృష్ణునిపై తిరగబడ్డారు. ఐనా పోరాడి శ్రీకృష్ణుడు గోరక్షణ చేశాడు.

శ్రీకృష్ణుడు కస్తూరీ తిలకం, కౌస్తుభమణి, పీతాంబరాలతోబాటు నెమలి ఈకను కూడా అలంకరించుకున్నాడు. వేణువు ఒక వశీకరణ సంగీత వాద్యం. ఆనాడు భారతదేశం చాలా విస్తారంగా ఉండేది. నేటి పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, బెలూచిస్తాన్, బర్మా, నేపాల్, సింహళం, భూటాన్, బంగ్లాదేశ్ వంటివన్నీ భారతదేశంలో అంతర్భాగాలే.

రఘువంశ రాజులు (ఇక్ష్వాకులు) ఒక్క ఆసియాకు మాత్రమే కాక మొత్తం ప్రపంచానికీ

శిప్ర ముని



# పేదలు చదివారు

అధిపతులు. అలాగే ధర్మరాజుని రాజసూయంలో ప్రపంచ దేశాధిపతులు పాల్గొని కానుకలు సమర్పించారు. గుణములను బట్టి, కర్మలను బట్టి సమాజాన్ని వర్గీకరించారు. వాణిజ్యం, పశుపోషణ వైశ్యధర్మం. బ్రాహ్మణుడు అనికేతనుడై సంచరిస్తూ ధర్మప్రచారం చేయాలి. ఒక రాజ్యాన్ని మరొక రాజు జయించినా అగ్రహారాలు (మాన్యాల) మీద, ఆలయ భూములమీద రాజులకు హక్కు ఉండదు. దానవిక్రయాది అధికారాలూ ఉండవు. అవి ధర్మప్రచారకులకే చెందుతాయి. మహాభారత యుద్ధం తర్వాత అర్జునుడు విషాదయోగంలో చెప్పినట్లు వర్ణసంకరం జరిగింది.

ఆనాటి ప్రపంచ దేశాలన్నింటిలోనూ సూర్యారాధన ప్రధానంగా కనపడుతున్నది. సూర్యవంశం, చంద్రవంశం, అగ్నివంశం ఇలా రాజవంశాలు ఉండేవి. రాజు దివ్యాంశ సంభూతుడు. అయితే అతడు కూడా ధర్మానికి బద్ధుడు కావలసిందే. ఎవరైనా బలహీనులను, గోవులను, విప్రులను వేధిస్తుంటే వారి నుండి రక్షణ చేయవలసిన బాధ్యత రాజుదే.

**‘ఊర్ధ్వబాహుర్విరదామ్యేషాం/న చకశ్చిత్ శృణోతిమే ధర్మాదర్థశ్చ కామశ్చ/ స ధర్మం కిం న సేవ్యతే’ (వేదవ్యాసుడు).**

వేదమే అందరికీ ప్రమాణం. అయితే కొందరు సోమరిపోతులు మేము నిష్కాములం. కాబట్టి నిత్య నైమిత్తికాలు మాకు వర్తించవు అని తప్పించుకోవడం తగదు అని శ్రీకృష్ణుడు గీతలో హెచ్చరించడం గమనార్హం. గోధనం చాలా పెద్దది. శత్రువుల గోవులను అపహరించేవారు. వస్తుమార్పిడి ఉండేది. యజ్ఞంలో దక్షిణగా బంగారం, వెండి, గుర్రాలు (రథాలు), ఏనుగులు, గోవులు ఇచ్చేవారు. పాతివ్రత్యం అనే పదానికి గాంధారి విపరీతార్థం చెప్పింది. భర్తకు కన్నులు లేకపోతే తాను కళ్లకు గంతలు కట్టుకున్నది. ఫలితంగా గుడ్డి పాలనలో కొడుకులు దుర్మార్గులయినారు.

ఆనాడు ఏకేశ్వరారాధనతోబాటు యక్ష భూతారాధనలూ ఉండేవి. భూత శబ్దాన్ని శ్రీకృష్ణుడు పంచభూతాలు అనే అర్థంలో వాడాడేమో! మహాభారత యుద్ధం తర్వాత యాదవులు విదేశాలకు వెళ్లారు. వారిని యూదులు అని పిలిచారు. దేశంలో క్షత్రియ సంతతి తగ్గడంతో ఎన్నో అవైదిక మతాలు ప్రవేశించాయి. ధర్మయుద్ధం రాత్రిపూట చేయరాదు. స్త్రీలకు, పిల్లలతో, క్లీబులతో యుద్ధం చేయరు. నోట పుల్ల కరచుకొని శరణాగతుడై వచ్చిన శత్రువును క్షమించాలి. ఒకరు ఒక వ్యక్తిని యుద్ధంలో చంపుతాను అని ప్రతిజ్ఞ చేస్తే ఆ ప్రతిజ్ఞ చేసిన వారికే ఆ అవకాశం ఇవ్వాలి. యుద్ధవీరులతో నాలుగైదు శ్రేణులు (ర్యాంకులు) ఉన్నాయి. వీరిలో అతిరథ మహారథులు, శ్రేష్ఠులు, యుద్ధం జరగడానికి ముందు శంఖాలు పూరిస్తారు.

అశ్వ, గజ, రథ, పదాతి దళములు నాలుగు వర్ణములు. అశ్వపాలకులు రథ సారథులు, గజ సాహిణులు ఇలా కొన్ని పశుపాలక వర్గాలున్నాయి.

ఆనాటి గృహవాస్తు అత్యద్భుతం. నీరు లేని చోట ఉన్నట్లు, ఉన్నచోట లేనట్లు భ్రమింపజేయగల గృహనిర్మాణ కౌశలం ఉండేది. ద్వారకా నగరంలోని సంపదలు అనంతం. ఇది సముద్ర మధ్యం (అరేబియా సముద్ర మధ్య ద్వీపం)లో నిర్మించారు. పెద్ద పెద్ద అగడ్తలు, బురుజులతో నిర్మించిన ఈ నగరం మొహంజొదారో వలెనే ఏ కారణం చేతనో జలగర్భంలో అంతరించిపోయింది. భర్త చనిపోతే అంతఃపుర స్త్రీలు సహగమనం చేసేవారు. గజ్జెలు, అందెలు, మంజీరం, మేఖల, కంకణం, కుండలాలు, భుజకీర్తులు, ముత్యాల ముక్కెర, చూడామణి ఆభరణ విశేషాలు.

సముద్రవ్యాపారానికీ, యుద్ధానికీ ప్రపంచ వ్యాప్తంగా పడవలు ఉపయోగించేవారు. ఒక నౌక జల మధ్యంలో ఆగిపోతే దానిని తాళ్లతో మరొక నౌకను కట్టి లాగించి ఒడ్డుకు చేర్చేవారు. ఈజిప్టు, గ్రీసు, రోమన్ దేశాల నౌకలన్నా భారతీయ నౌకలు తేలిక చెక్కతో మన్నికగా ఉండే విధంగా నిర్మించినట్ట తెలుస్తుంది. గుజరాత్, తమిళనాడు, ఆంధ్ర

**జరాసంధుడు శాక్తేయుడు. ఇతను స్త్రీలను చెరబట్టేవాడు. నరబలులు ఇచ్చేవాడు. ఇది అవైదికం కాబట్టి శ్రీకృష్ణుడు నిరోధించాడు. ఇంద్రుని పేర పశుయజ్ఞం జరిగితే దానినీ శ్రీకృష్ణుడు నిరోధించాడు. అప్పుడు ఇంద్రపూజకులు శ్రీకృష్ణునిపై తిరగబడ్డారు. ఐనా పోరాడి శ్రీకృష్ణుడు గోరక్షణ చేశాడు.**

(మచిలీపట్టణం), వంటి చోట్ల నౌకా నిర్మాణ, ప్రయాణ కేంద్రాలు ఉండేవి.

స్త్రీలు గుజ్జన గూండ్లు, కొయ్యబొమ్మల పెండ్లిండ్లు, బంతి ఆటలు ఆడేవారు. ఆనాటి నర్తన శాలలు (ఆడిటోరియం) అత్యంత ఆధునిక నిర్మాణ శైలిలో ఉండేవి. రాత్రివేళ కాగడాలే దారిదీపాలు.

వంటలో పురుషులు కూడా నైపుణ్యం చూపించేవారు. నదులపై స్త్రీలు పడవలు నడుపుతూ ప్రయాణీకులను ఒడ్డుకు చేర్చేవారు. ధనవంతులు, నిరుపేద బ్రాహ్మణులు ఒకే గురుకులంలో విద్యాభ్యాసం చేసేవారు. రాజులు తమ కుమార్తెలకు స్వయంవరం ప్రకటించేవారు. భూమి నుండి ఒక గ్రహాంతరం సంచారం చేసిన కథలు ‘భారతం’లో పుష్కలంగా ఉన్నాయి. అలాగే విమానయానమూ ఉంది.

ఉత్తరాయణ (సంక్రాంతి) పుణ్యకాలం అత్యంత పవిత్రమైనది. జ్యోతిష్యం (అస్ట్రానమీ, అస్ట్రాలజీ) రెండూ వ్యాప్తిలో ఉన్నాయి. కాలగణనతో గ్రహణాలు ఎప్పుడు వస్తాయో తెలుసుకోగలిగేవారు. సైంధవుడు మరణించిన రోజున సూర్యగ్రహణం వచ్చింది. పటిష్టమైన గూఢచార వ్యవస్థ ఉండేది. రాజులు కూడా మారువేషాలలో సంచరించేవారు. జడలు అల్లటం, రంగవల్లులు తీర్చటం, పుష్పమాలికా నిర్మాణం ప్రత్యేకంగా కొందఱు స్త్రీలు వృత్తిగా స్వీకరించేవారు.

పేద బ్రాహ్మణులు చినిగిన బట్టలు ధరించి, అటుకులు తిని కాలక్షేపం చేసేవారు. కొందఱు బ్రాహ్మణులు క్షత్రియులుగా మారగా కొందరు దాసీపుత్రులు మహాజ్ఞానులై సామాజిక గౌరవాన్ని పొందారు.

అధ్యాయ విభజననుబట్టి ఆనాటి సమాజంలో భక్తి, జ్ఞాన, కర్మ, కర్మసన్యాస యోగవాదుల మధ్య సంవాదం జరుగుతున్నది అనేది సుస్పష్టం. ఏకం పృథక్ శబ్దాలనుబట్టి ఏకేశ్వరారాధకులు, బహుదేవతారాధకులు ఉన్నట్లు స్పష్టం.

రుగ్వేదంలో సరస్వతీ సూక్తం ఉంది. ప్రణోదేవి / అంబితయే / ఏమతి– కృష్ణుడు తాను గంగానదిని అవటంవలన 5000 ఏళ్ల నాటికే సరస్వతి అంతర్వాహిని అయిందేమో పురాతత్వశాస్త్రవేత్తలు చెప్పాలి.

★

# ఆంధ్రుల వాఙ్మయ

ఐహిక బంధములకు జిక్కువడి, దారితెన్ను గానక అటమటించు జీవునకు మోక్షావాప్తిని గలిగించు పరమసాధనములు, తపోదాన యజ్ఞాదిక్రియలు, పరతత్త్వ సాక్షాత్కారమునకై, మానవుఁడు గావించు సమస్త కర్మలును, తపశ్శబ్ద వాచ్యములే. ఈ తపస్సు, కాయిక, వాచిక, మానసిక భేదముల, ముత్తెరంగులై యున్నది. దానము, పుణ్యక్షేత్ర సంసేవనము మొదలగునవి కాయికములగు తపస్సులు. జపస్స్వాధ్యాయాదులు, వాచికములగు తపస్సులు. నిరంతర భగవదనుసంధానము మానసికమగు తపస్సు. కాయికము కంటె వాచికమును, వాచికమునకంటే మానసికమును, శ్రేష్ఠతరములని చెప్పవచ్చును. వాచిక మానసికములగు తపస్సులు రెండును, వాఙ్మయమున అంతర్భూతములయి యున్నవి. కవిత్వము ప్రప్రథమున మానసికమగు వ్యాపారమేయయ్యు, వాగుపకరణ సాహాయ్యముననే వ్యక్తమగుచుండును. కావున, దీనిని వాఙ్మనో రూపమగు తపస్సుగా పేర్కొనవచ్చును. ఆలంకారి కులు కావ్యమునకు చతుర్వర్గ ఫలప్రాప్తిని నిర్ణయించు టయు ఈ యర్థమును మనస్సు నందిడికొనియే యని చెప్పవచ్చును.


ఒకజాతి సృజించిన వాఙ్మయమును సమగ్రముగ పరిశీలించినచో, తపస్వులుగు సాహితీస్రష్టలు, కొలదిమందియే కన్పట్టుదురు. తక్కిన కవులు, గతానుగతికముగ, కావ్యరచనమును సాగింతురు. లోకోత్తములగు ఆశయములను సాధించి, మహనీయమును, నుదారమును, అగు మార్గమున లోకమును నడిపించు శక్తి సర్వ సామాన్యులగు కవుల కుండదు. జగత్కల్యాణ సంధాయకులగు కవులు, వ్రేళ్ళపై లెక్కింప తగియుందురు. లెక్కకు మిక్కిలి కాకున్నను, మహ నీయులగు ఆ కవిబ్రహ్మలే, తజ్జాతి హృదయమును జూరగొని, మహోదారములగు తదీయాశయములకు ప్రాతినిధ్యము వహింతురు. ఆంధ్రవాఙ్మయమును సమగ్రముగ పరిశీలించినచో, ఆంధ్ర జాతికి ప్రాతినిధ్యము వహింపఁగల కవులు ముప్వురు మాత్రమే కన్పట్టుచున్నారు. వీరిలో నన్నయ, తిక్కనలు, పంచమవేదమగు భారతమును ఆంధ్రీకరించిరి. పోతన, భక్తిజ్ఞాన యోగ విశిష్టమగు భాగవతమును ఆంధ్రీకరించిరి. వీరు ముప్వురుగాక తక్కినవారు మహాకవులు గారని నా అభిప్రాయము కాదు. కవితా చమత్కృతి యందును, పాండితీ ప్రకర్ష యందును, శ్రీనాథాదులగు సుద్దండకవులు పలువురు గలరు. కాని వారి మార్గము వేరు. వారిని సాహితీ తపస్వులనుటకు వీలు లేదు.

నన్నయకు పూర్వ మాంధ్రమున కవులున్నను, లేకపోయినను, ప్రప్రథమముగ ఆంధ్రలోకమున కొక మహాగ్రంథమును సమర్పించిన ఖ్యాతి, నన్నయకు మాత్రమే దక్కుచున్నది. ఆతఁడాంధ్ర వాఙ్మయ సాహితీ సరస్వతిని, ప్రప్రథ ముఁడేగాక ప్రధానుఁడును అగుచున్నాఁడు. ఆంధ్ర సాహితీ సరస్వతిని, ప్రప్రథమముగ, రమణీయ మును, గంభీరమునులగు కావ్యమార్గమున నడిపించిన జగజ్జెట్టి యాతఁడు. కావుననే, 'వాగానుశాసను' బిరుదము. అతని యెడ అన్వర్థమయి ఒప్పుచున్నది. అతడు మహాకవి, కవీంద్రులకు ఆచార్యుఁడు. భారతాంధ్రీకరణము వలన అతఁడాశించిన పరమ ప్రయోజనము, భవబంధ విమోచనము, భారత భారతీ శుభ గభస్తిచయంబులఁజేసి, ఘోరసంసార వికార సంతమసజాల విజృంభము" పాపుకొనుటయే, యాతని చరమ లక్ష్యమైనట్లు, భారతావతారికను బట్టియే వ్యక్తమగుచున్నది. ఆర్షమగు బ్రహ్మతేజము ఆతఁడు భారత భాగమునందు అంతటను ప్రస్ఫుటమగునుండును. ఆతఁడు అవిరళ జప హోమ తత్పరుఁడు, బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుఁడు. అంతే కాదు. లోకజ్ఞుఁడు, ఉభయభాషా కావ్యరచనా శోభితుఁడు. కావుననే, పంచమ వేరమగు భారతమును ఆంధ్రీకరింప సమకట్టినాఁడు. లౌకికమగు నొక యితి వృత్తముకు ఆధారముగాగొని, వేదవ్యాసుఁడు, వైదికములకు ధర్మముల నన్నీటినీ లోకమునకు అనుగ్రహించినాఁడు భారత ప్రతిపాదిత తత్త్వము, ఐహికాముష్మిక సంబంధయై యున్నది. ధర్మావలంబనము వలన, అర్థకామములు మోక్ష సంపాదన సమర్థములగుచున్నవి. ఆ యర్థ కామములే, ధర్మవిహీనములగునేని, మానవ పతన హేతువులు అగుచున్నవి. భారతేతిహాసమంతయు ఈ పరమార్థమునే బోధించుచున్నది. నన్నయ, తిక్కక లిర్వురు. ఈ పరమార్థమును గ్రహించినవారు. అంతమాత్రమేకాదు, నిత్య్య జీవితమునందలి సవ్యగాచరణము వలననే తద్ధర్మ సూక్ష్మమును, అనుభవమునకు తెచ్చికొనినవారు. మరొక్క విశేషము, సంస్కృత భారత రచనాకాలమునకును, భారతాంధ్రీకరణ కాలమునకును, సాదృశ్యము కన్పట్టుచున్నది. వ్యాసభట్టారకుఁడు, ఎట్టి పరిస్థితులలో, ఏ ఏ కారణములను పురస్కరించుకొని, పంచమ వేదమగు భారతమును రచించెనో, అట్టి కాలమునందే అట్టి కారణములను పురస్కరించు కొనియే, నన్నయ, తిక్కనలును, భారతాంధ్రీకరణ



మునకు గడంగిరి. 'వ్యాసభట్టారకుని కాలము నాఁటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను, నన్నయ, తిక్కనల నాఁటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులతో పోల్చినచో, ఈ విషయము విస్పష్టము కాఁగలదు. వ్యాసుని కాలముననే, వేద వాఙ్మయము, దురవగాహమైనది. లోకశాంతి కరములగు వైదిక ధర్మములయెడ, భిన్నాభిప్రాయములు పొడ సూపినవి. హింసాత్మకములగు మతములు, ప్రాబల్యములోనికి వచ్చినవి. ధర్మబద్ధములుగాని అర్థకామములు, విశృంఖల విహారము సేయ దొడంగినవి. "అహింసా పరమో ధర్మః" "సత్యం వద" "ధర్మం చర" మొదలగు శాస్త్ర వాక్యములు పరిమిత సత్యములా? ఏకాంత సత్యములా? అను విషయమున, సామాన్య జనులకేగాక, పండితులగువారికి ఁగూడ, ఒక నిర్ణయము లేకుండ పోయినది. జరాసంధుడు భైరవోపాసకుఁడు. దినమున కొక మూర్ధాభిషిక్తుని, భైరవునకు బలియిచ్చెడివాఁడు, నరకుఁడు శాక్తేయుఁడు. ప్రత్యహమును ఒక కన్యకను శక్తి ప్రీతికై

# తపస్సు



**తూములూరి లక్ష్మీనారాయణ**

బలి యిచ్చెడివాఁడు. దుర్యోధనుఁడు నాస్తికుఁడు. ఆతని మిత్రవర్గములో, లోకాయతనులు గూడ కలరు. ధర్మజ పట్టాభిషేక సమయమున చార్వాకుఁడు బ్రాహ్మణ వేషముఁగైకొని దుర్యోధన పక్షమున వాదించుట, మన కిచ్చుట గమనార్హమగు విషయము, దుర్యోధనుఁడు గావించిన యజ్ఞయాగాది కర్మలన్నియు, లోక విడంబ నార్థమేగాని, తనకు ప్రత్యక్షమగు వాని యందు ప్రత్యయముండి కాదు. అర్థకామముల యెడ, అతనికిఁ గల ప్రీతి ధర్మ బద్ధముగాదు. జగద్ద్రోహులగు వీరిని సంహరించి, శాంతియుతమగు వైదికమతమును స్థాపించుట కొఱకే, శ్రీకృష్ణుఁడు విశ్వ ప్రయత్నము గావించినాఁడు. తద్ధర్మములను ప్రచారములోనికిఁ దెచ్చుట కొఱకే వేదవ్యాసుఁడు, పంచమవేదమగు భారతమును రచించినాఁడు, అవతార పురుషులగు నీ యిరువురు, జగతారాధ్యులు, వారు గావించిన ధర్మ ప్రబోధ మును, భారతాంధ్రీకరణ వ్యాజమున, నన్నయ తిక్కనలు, ఆంధ్రా వళికి సుగమము గావించినారు. రాజరాజు కాలమున, అవైదికములగు జైన బౌద్ధము లింకను సమూలముగ నశింపలేదు. చాళుక్యులలోఁ గూడ కొందరు జైనులు గలరు. కుమారిలభట్టు, శంకరుఁడు, మొదలగు మహనీయులు వైదిక ధర్మ సముద్ధరణమునకై, తమ జీవితములను ధారపోసిరి. కాని, వారి రచనలన్నియు, సంస్కృతముననే యుండుటచే, సామాన్యజన దురవగాహములై యుండెడివి. జైనులు, బౌద్ధులును తమ తమ ప్రచారమును దేశభాషల యందే గావించెడి వారు, అవి సుబోధములును, సుగమములును అగుటచే, ప్రజానీకము వానివండకే మ్రొగ్గెడివారు. అట్టి యెడ అవైదికములగు ఆ మతములయందలి లోపముల నెత్తి చూపి, వేదమతమునందలి ప్రాశస్త్యమును ఉగ్గడింపఁగల, మహాగ్రంథము లోకమునకు ఆవశ్యకమై యున్నది. అది, దేశభాషలయందే రచింపఁ బడవలయును. అట్టి మహాకార్యమును, రాజరాజు ప్రోత్సాహమున నన్నయ సాధింప సమకట్టినాఁడు. నన్నయనాఁటి పరిస్థితులకును, తిక్కననాఁటి పరిస్థితులకును చాల వ్యత్యాసము గలదు. నన్నయ నాఁడు అవైదికములగు జైన బౌద్ధములతోనే వైదిక మతమునకు స్పర్థ గలదు. తిక్కన నాఁడు, వైదికమగు ధర్మమునందే వైరుధ్యము ఏర్పడినది. నన్నయ నాఁడు, శివకేశవులయెడ, ప్రజలకు సమరస భావమే కలదు. తిక్కన నాఁటికి, ఆ సమరసభావము సమసిపోయినది. వీరశైవము ఒక వంకను, వీర వైష్ణవము ఇంకొక వంకను విజృంభించి, జాతీయమగు ఐక్యమునకు భంగము కల్పించినవి. ఈ రెండు మతములకును, మరల, అద్వైతముతో వైరుధ్యము ఏర్పడినది. ఈ మత వైషమ్యములు కారణముగ ఒక మహాయుద్ధము జరిగినది. అదియే 'పల్నాటి యుద్ధము'. అందు మహా వీరులగు ఆంధ్రులు అనేకులు మరణించిరి. ఆంధ్రజాతియే నిర్వీర్యమయినది. ఆంతరములగు ఈ మనస్పర్థలు ఇట్లుండగ, జైన మొకవంక, కాకతీయ సామ్రాజ్య విధ్వంసమునకే యత్నించు చుండెడిది.

మత విషయముననేగాక, భాషా విషయమున గూడ నాఁటి దేశపరిస్థితి ప్రోత్సాహ జనకముగ లేదు. బహుధా శ్రమించి, జాతీయ సమైక్యమునకై నన్నయ సాధించిన భాషా ప్రణాళిక, పాల్కురికి సోమనాధాధుల విజృంభణమున, అడుగంటినది. భాషాయోషను ఒక సవ్య మార్గమున నడిపింపఁగల మహాపురుషుని జన్మ ఆవశ్యకమైనది. ఆంధ్రజాతి అదృష్టము పండినది. తిక్కన మహాపురుషుఁడు అవతరించినాఁడు. తిక్కన వంశమున మహాపురుషులు అనేకులు జన్మించిరి. తిక్కన తాత యగు మంత్రిభాస్కరుఁడు సారకవితాభి రాముఁడు. వితరణఖని, వంశ పారంపర్యముగ మంత్రి పదవులను, అలంకరించుటచే, తిక్కన వంశమువారందరు లోకజ్ఞులు. రాజకీయ రహస్య కోవిదులు. యుద్ధతంత్రజ్ఞులు. "ఇదం బ్రాహ్మ మిదం క్షాత్ర" మ్మను ఆర్యోక్తికి లక్ష్యభూతులు. తిక్కనకు, తన పూర్వుల సాహసౌందార్యాది సమస్త గుణ ములును, సంక్రమించినవి. ఆర్షయగు తేజమునకు, క్షాత్రమగు కళాసంపద తోడైనది. తన్మహనీయుని చేతంబడిన భారతేతిహాసము మహాకావ్యమై, ఆంధ్రుల హృదయమును జూరగొనినది.

తన కాలమునాఁటి శైవ వైష్ణవ మత సిద్ధాంతము లకు, సామరస్యమును కల్పించుటకొఱకే తిక్కన తన కృతిపతిగా హరిహరనాథుని అంగీకరించినాఁడు. "విష్ణురూపాయ నమశ్శివాయయని పల్కెడు భక్తజనులు వైదికధ్యాయిత కిచ్చు మెచ్చు పరతత్త్వము" హరిహరనాథుఁడు. కవిబ్రహ్మకు, హరిహరనాథ పరతత్త్వధ్యానము భారతాంధ్రీకరణ కాలముననే కలిగినదని తలంపరాదు. అది ఆబాల్యసిద్ధమును గాదు. నిర్వచనోత్తర రామాయణ కాలమునకు తిక్కన "మహేశ్వరాంఘ్రి కమలధ్యానైకశీలుఁడు." నిర్వచ నోత్తర రామాయణ రచనానంతరము, నిరంతర యోగాధిసాధనలచే, అకఁడు పరిణత మనస్కులై నాడు. హరిహరాభేదమును గుర్తించినాఁడు, ధర్మాద్వైతమును సాధించినాఁడు, వేయేల! ఉభయకవిమిత్రుఁడు కవిబ్రహ్మయైనాడు, హరిహర నాథుడు, తనకు స్వప్నమున సాక్షాత్కరింపఁగ, కవిబ్రహ్మ అతనిని ఐహికా ముష్మీకములగు సుఖముల నర్థింపలేదు. "జన్మాంతర దుఃఖముల్ దొలఁగునట్లుగఁజేసి సుభామ్మఁజేయవే" అని ప్రార్థించినాఁడు, అద్దేవుఁడు అతని భక్తి భావమునకు మెచ్చి,

**"జననమరణాదులైన సంసారదురిత**
**ములకు నగపడ కుండంగఁ దొలఁగు తెలవు**
**గను వెలుంగు నీ కిచ్చితినని"** అతని ననుగ్రహించినాఁడు. పురుష కారమునకు, దైవసాహాయ్యమును లభించినది, కవిబ్రహ్మ మహా కవిత్వ దీక్షను గైకొనినాఁడు. "ఆంధ్రావళి మోదం బొరయునట్లుగ" ఆమ్మహాదీక్షను, సర్వతోముఖముగ నిర్వహించి నాఁడు. ఇట్లు, నన్నయచే ప్రారంభింపఁబడిన సాహితీ యజ్ఞము, కవిబ్రహ్మ కాలమున, తదీయ బహుముఖ ప్రజ్ఞావిశేషమున, సర్వజనానందదాయకముగ సమాప్తమయినది. "భారతామృతము" సర్వజన భోగయోగ్యమైనది. అమృత శబ్దము పరబ్రహ్మవా చకము. "విద్యయా అమత మశ్నుతే" అని శ్రుతి. ధర్మబద్ధయగు ఐహిక జీవనమువలన, సర్వజనులను అమృతత్త్వము నందుటయే భారత పఠన పరమార్థము. భక్తి వైరాగ్య బృంహితమగు భారతామ్నా యము, లోకమునకు సుబోధము గావించిన నన్నయ, తిక్కన లిర్వురును, మహాతపస్వులు, మహాయోగులు.

ఇమ్మహనీయు లిర్వురును సాధించిన సాహితీ



నన్నయ



తిక్కన



పోతన

యజ్ఞమును, భక్తి సంగమము గావించిన మహనీయుఁడు పోతన. అసలు, లక్ష్యము నందును, రచనా విధానము నందును, ఇతివృత్త సంగ్రహ ణమునందును, భారత భాగవతములకు కొంత భేదము కలదు. భారతేతి వృత్తము ఉదాత్తమనుట సత్యమే. తత్కథా పురుషులును మహనీయులే. అందు ధర్మసూక్ష్మములు, అనేకములు, ప్రవచింపఁబడి యున్నవి. కాని, మానవ మనశ్శాంతికి హేతు భూతమగు, భగవద్భక్తి విశేషమున కందు ప్రాధాన్యము తక్కువ. దానిని ప్రపంచించి చెప్పుట కొఱకే, వేదవ్యాసుఁడు భాగవత రచనకు గడంగి నాఁడు. భారత రచనానంతరము వేదవ్యాసునకు మనశ్శాంతి కొఱవడినది. సరస్వతీ నదీతీరమున, చింతాకులిత మనస్కుఁడై, వ్యాసుడుప విష్టుఁడై యుండెను. అట్టి తరి, అతనికడకు, దేవర్షియగు నారదుఁడు వచ్చి, తద్విషాద కారణమడిగెను. తన మన మేలకో వికలమైయున్నదనియు, తత్కారణ మును తానూహింప లేకున్నాఁడననియు, వేదవ్యాసుఁ డు సమాధాన మిచ్చెను. కాని, తచ్చిత్త వైకల్యమునకు కారణమును, దేవర్షి అగు నారదుఁడు గ్రహించెను. గ్రహించుటయే గాక వ్యాసునకిట్లబోధ గావించెను.

*"అంచితమైన ధర్మచయ మంతయు జెప్పితి, వందులోన నిం / చించుక కాని, విష్ణుకథ లేర్పడఁ జెప్పవు, ధర్మముల్ ప్రపం*

*చించిన మెచ్చునే గుణ విశేషములెన్నక; నీకు నిప్పుడే / కొంచము వచ్చుటెల్ల హరిఁగోరి నుతింపమి నార్య పూజితా!"*

నారద ప్రబోధమువలన, వేదవ్యాసునకు, తన చిత్తవైకల్య బోధపడినది. తనకు మనశ్శాంతి కావలయును. తనకు వలెనే, లోకమునకు కావలసిన దియు, మనశ్శాంతియే. తత్ప్రాప్తికి పరమసాధనము భగవద్భక్తియేయని యాకఁడు గ్రహించినాఁడు. వెంటనే భాగవత రచన కుపక్రమించినాఁడు. భగవల్లీలలను, ఆమూల చూడముగ వర్ణించినాఁడు. భాగవతమున విష్ణు మాహాత్మ్యము బహుధా వర్ణింపఁబడినను, శివమాహాత్మ్యము గూడ అందందు చెప్పఁబడియే యున్నది. దక్షాధ్వర ధ్వంసాదులు శివమాహాత్మ్య ప్రతిపాదకములు. మఱియు నిందు ఆధ్యాత్మికములగు విషయములనేకములు ప్రస్తావింపఁబడి యున్నవి. విదుర మైత్రేయ సంవాదము – కుతిగీతలు– బ్రహ్మస్తవము గజేంద్రమోక్షము కపిలదేవ హూతి సంవాదము మొదలగు వానియందు, ఆధ్యాత్మికములగు జ్ఞానయోగ విషయములు చెప్పబడినవి. భాగవతమున ప్రాధాన్యము వహించు తత్త్వము, సగుణా రాధనము, భారతమున ప్రాధాన్యము వహించునది, నిర్గుణా రాధనము. అట్లని భారతమున సగుణారాధన ప్రసంగమే లేదనికాదు. "క్లేశో౽ధికతర స్లేషా మవ్యక్తాసక్త చేతసామ్" అని గీతావాక్యమున సగుణారాధనమునకుఁగూడ, ప్రాముఖ్య మీయబడినది. కాని, అది సూక్ష్మపరిశీలనమువలన మాత్రమే తేలు సత్యము, స్థూలముగ భాగవతము సగుణారాధనమునకు, భారతము నిర్గుణారాధ నమునకును అంకితమైయున్నవి. కాని యది తరతమ భేదమును మాత్రమే సూచించు ననుమాట సత్యము. ఇమ్మహా గ్రంథమును మహాభక్తుఁడును, సహజ పాండితీ సంశోభితుఁడును, అగు పోతన ఆంధ్రీకరించుట, ఆంధ్రుల అదృష్టమనక తప్పదు. తొలుదొలుత, పోతనయు తిక్కనవలెనే శివభక్తి పరుఁడు, కాలక్రమమున, పరిణత మనస్కుఁడై శివకేశవ భేదమును విస్మరించి కేవల సత్త్వమూర్తి యైనాఁడు. కావుననే భాగవతారంభమున –

*చేతులారంగ శివునిఁబూజింపఁడేని,*
*నోరునొవ్వంగ హరికీర్తినుడువఁడేని*
*దయయు, సత్యంబు లోనుగాఁదలపఁడేని*
*కలుఁగ నేటికి ? తల్లుల కడుపు చేటు*

అని ముక్త కంఠముతో, శివకేశవ సమానత్వ మును చాటి చెప్పినాఁడు. భక్తి భావముతోపాటు, దయాసత్యములకు గూడ, సమానస్థానమునే ఒసంగి జగద్వంద్యుఁడై నాఁడు. ఆంధ్రభాగవత ప్రారంభము కూడ, ఒక విచిత్ర విషయముగనున్నది. ఒక్క సోమోపరాగమున, పోతన, గోదావరీ తీరమున, మహేశ్వర ధ్యానము గావించు చుండెను. అపు డాతని ఎట్టఎదుట శ్రీరాముఁడు సాక్షాత్కరించి, "మన్నా మాంకితంబుగ భాగవతంబు తెనుంగు సేయుము " అని యాజ్ఞాపించినాఁడు. "రాజముఖ్యుఁ డొక్కరుఁడు నాదు కన్ను గనకు నెదురఁగానఁబడియె" అను పోతన వాక్యమునుబట్టి, ఈ సాక్షాత్కారము స్వప్నమునఁగాక జాగ్రదవస్థయందే అని, మనము నిశ్చయము సేయవచ్చును.

*పలికెడిది భాగవతమఁట*
*పలికించువిభుండు రామభద్రుండఁట, నే*
*పలికిన భవహరమగునఁట*
*పలికెద వేరొండుగాథ పలుకఁగనేలా ?*

అని, పోతన భాగవతాంధ్రీకరణమునకు గడంగినాఁడు. కాని, భాగవతమునందలి మొదటి పద్యము శ్రీకృష్ణపరముగానున్నది. షష్ఠ్యంతములును శ్రీకృష్ణ పరముగనే యున్నవి. గ్రంథమధ్యమున, శ్రీరామపరమగు పద్యములు గానవచ్చును. పోతన చేసినది మహేశ్వరధ్యానము; సాక్షాత్కరించినవాఁడు శ్రీరామచంద్రుఁడు. కృతి ప్రారంభమున పోతన స్మరించినవాఁడు శ్రీకృష్ణుఁడు. ఈ విషయము గూడ, పోతనకుగల అద్వైతభావమునే, విశదీకరించు చున్నది. భాగవత ప్రారంభపద్యము భగవంతుని దుష్టశిక్షణ శిష్టరక్షణ కళా పారమ్యమును, వ్యక్తీకరించుచున్నది.

**"దీనిం దెనిఁగించి మజ్జననంబుఁ సఫలంబు జేసెద పునర్జననంబు లేకుండఁగ"**

అని, పోతన ప్రతిజ్ఞ. అపూర్వమగు ఈ ప్రతిజ్ఞకు యోషయే తలయూచినది. ఆంధ్ర సాహితీ సరస్వతికి, అమూల్యా లంకారమగు భాగవత గ్రంథము రచింపఁబడినది. భాగవతమును చదువనివారు, చదివి యానందింపనివారు, ఆంధ్రలోకమున లేరనుట సర్వథా సత్యము అనుప్రాస గుంభితమును, పదలాలిత్య రమణీయమును, అగు పోతన వాణి సాహితీ సంపదకు తోడుగ, సంగీత సాహచర్యమును సంతరించుకొన్నది. ఆ యమృత వాక్కులలో ఓలలాడిన సహృదయులు, జగదీశ్వరుఁడగు శ్రీకృష్ణుని వేణు నాదమునే ఆలకించుచున్నారు.

భారత భాగవత గ్రంథములు అన్యోన్యా శ్రయములు. ధర్మ ప్రపంచీకరణము భారత ధ్యేయము. నిరంతర భగవచ్చింతనము భాగవత లక్ష్యము. భారత గ్రంథమువలన లోకవృత్తము, సుగమమును, సురక్షితమును అగును. భాగవతము వలన ఆత్మశాంతి చేకూరును. ఇమ్మహా గ్రంథము లను రచించిన మహనీయులు, నన్నయ, తిక్కన, పోతనలు, మహాతపస్వులు, జగద్వంద్యులు.

**– 'కృష్ణాపత్రిక' వజ్రోత్సవ సంచిక నుంచి ముదిగొండ నాగేశ్వరరావుకు కృతజ్ఞతలతో..**

యువతరం ధూమ్ ధామ్ టీ-20 క్రికెట్లో నవతరం ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ ఆకాశమే హద్దుగా సాగిపోతున్నాడు. అంతర్జాతీయ స్థాయి నుంచి దేశవాళీ ఐపీఎల్ వరకూ రికార్డుల మోతతో ఒకే ఒక్కడు, సూర్యుడొక్కడే! అనుకునేలా చేస్తున్నాడు. 20 ఓవర్లు, 60 థ్రిల్స్‌తో సాగే ధూమ్ ధామ్ టీ-20 క్రికెట్‌కు భారత సంచలనం, ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ బ్యాటర్ సూర్య కుమార్ యాదవ్ (స్కై) తన విలక్షణ ఆటతీరుతో కొత్తపుంతలు తొక్కిస్తున్నాడు. ఈ ఫార్మాట్లో ఎందరు మొనగాళ్లు, దిగ్గజాలున్నా తన తర్వాతేనంటూ చెప్పకనే చెబుతున్నాడు. మిన్నువిరిగి మీదపడినా చలించని మనస్తత్వం, పరిస్థితులకు అనుగుణంగా తనదైన శైలిలో బ్యాటింగ్ చేయటం, కేవలం తన బ్యాటింగ్, మెరుపుషాట్లతో ఆట స్వరూపాన్నే కొద్ది బంతుల్లోనే మార్చేయ టంలో సూర్యకు సూర్యా మాత్రమే సాటి.




# టీ-20 క్రికెట్లో ఒకే ఒక్కడు!

సూర్యకుమార్ యాదవ్.. ప్రస్తుతం టీ-20 క్రికెట్లో మార్మోగిపోతున్న పేరు. మిస్టర్ టీ-20, స్కై. మిస్టర్ 360, స్కూప్ స్టార్ లాంటి ముద్దుపేర్లతో ఆయనను అభిమానులు ఆకాశానికి ఎత్తేస్తుంటే, క్రికెట్ విమర్శకులు, దిగ్గజాలు, వ్యాఖ్యాతలు మాత్రం గ్రహాంతరవాసి అంటూ, సూర్య కొట్టే షాట్లు మనుషులు ఆడే షాట్లు కావంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. మరోవైపు.. కేవలం 25 బాల్స్ లోనే సుడిగాలి హాఫ్‌సెంచరీ, 49బంతుల్లోనే సెంచ రీలు కొడుతూ మ్యాచ్ స్వరూపాన్నే మార్చి వేస్తున్న సూర్యాను ఎలా పడగొట్టాలో అర్థంకాక ప్రత్యర్థి జట్ల కెప్టెన్లు, కోచ్‌లు తలలు పట్టుకొంటున్నారు.

**లేటుగానైనా...లేటెస్టుగా..!**

ముంబై స్కూల్ ఆఫ్ క్రికెట్ నుంచి జాతీయ క్రికెట్లోకి దూసుకొచ్చిన సూర్యాకు భారతజట్టులో రాత్రికి రాత్రే చోటు దక్కలేదు. ఆయనకు గాడ్ ఫాదర్లు అసలే లేరు. ప్రతిభ, నిరంతర సాధనతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించు కొన్నాడు. 32 ఏళ్ల సూర్య 20 సంవత్సరాల వయసులో కెరియర్ మొదలుపెట్టాడు. జాతీయ స్థాయి పోటీలలో ముంబై జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తూ 2011 సీజన్లో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు.అప్పటి ఐపీఎల్ సీజన్లో కనీస ధర 10 లక్షల రూపాయల కాంట్రాక్టుపై ఆ జట్టులో చేరాడు. తుదిజట్టులో తగిన అవకాశాలు దక్కకపోవడంతో 2014 సీజన్లో కోల్‌కతా ఫ్రాంచైజీలో చేరాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున మూడు సీజన్లలో 54 మ్యాచ్‌లో, పలు కీలక ఇన్నింగ్స్ ఆడటంతో పాటు మ్యాచ్ ఫినిషర్‌గా పేరు తెచ్చు కొన్నాడు. 2018 సీజన్ వేలం ద్వారా 8 కోట్ల రూపాయల ధరకు ముంబై ఫ్రాంచైజీ సూర్యానే తిరిగి దక్కించుకొంది.

2018 సీజన్ నుంచి ముంబైజట్టు కీలక ఆటగాడిగా ఉన్న సూర్యకుమార్ యాదవ్ 2019, 2020 సీజన్లలో ఆ జట్టు విజేతగా నిలవడంలో ప్రధానపాత్ర వహించాడు. 2018 ఐపీఎల్ సీజన్లో 512 పరుగులు, 2019లో 424 పరుగులు, 2020లో 480 పరుగులు సాధించినా భారత సెలెక్టర్లు ఏ మాత్రం కరుణించ లేదు. అయితే 2022 టీ-20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని భారత టీమ్ మేనేజ్ మెంట్ పలువురు యువఆటగాళ్లకు, ప్రతిభావంతులైనవారికి జట్టులో చోటు కల్పించింది. భారతజట్టులో చోటు కోసం 11 సంవత్సరాలపాటు నిరీక్షించిన సూర్యకుమార్‌కు 31 సంవత్సరాల వయసులో అవకాశం దక్కింది.

గతేడాది ముగిసిన ప్రపంచ టీ-20 క్రికెట్లో చెలరేగిపోడం ద్వారా సూర్యా టీ-20 నంబర్ వన్ బ్యాటర్ ర్యాంకును సైతం కైవసం చేసుకొన్నాడు. ఏడాదిలో 1000కి పైగా పరుగులు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. కేవలం భారతజట్టు సభ్యుడి గానే అంతర్జాతీయ టీ-20ల్లో ఇప్పటికే మూడు శతకాలు బాదాడు.

**టీ-20కి సరికొత్త నిర్వచనం...**

సూర్యకుమార్ యాదవ్..అదే అభిమానులు ముద్దుగా పిలుచుకొనే స్కై అన్నపేరును సార్థకం చేసుకొంటూ వస్తున్నాడు. ధూమ్ ధామ్ టీ-20క్రికెట్లో బ్యాటింగ్ కు సరికొత్త నిర్వచనం చెప్పిన మొనగాడు. టీ-20 ఫార్మాట్లో బ్యాటింగ్ ప్రమాణాలను 360 డిగ్రీల స్థాయికి చేర్చిన ఘనుడు ఏబీ డివిలియర్స్ కాగా.. విచిత్రమైన భంగిమలు, అనూహ్యమైన షాట్లతో అభిమానులు ఊపిరిబిగబట్టి చూసే స్థాయికి చేర్చిన ధీరుడు సూర్యకుమార్ యాదవ్ మాత్రమే.

**క్రీజులోకి దిగాడంటే చాలు...**

క్రీజులోకి దిగాడంటే చాలు.. పెవీలియన్‌లో కూర్చొన్న వీక్షకులతో పాటు ప్రత్యర్థి జట్టు సభ్యులు సైతం సూర్య అద్భుతాల కోసం ఎక్కడలేని ఉత్కంఠతో ఎదురుచూసేలా చేయగల మొనగాడు. ఏ బంతిని..ఏ భంగిమలో.. గ్రౌండ్‌కు ఏవైపున కొడతాడో తెలియని వింత పరిస్థితిని, సస్పెన్స్ సృష్టించడంలో ఆతని తర్వాతే ఎవరైనా. టీ-20 క్రికెట్ చరిత్రలోనే ఇప్పటి వరకూ ఎవ్వరూ ఆడని షాట్లను ఆయనే మాత్రమే ఆడుతున్నాడు. సూర్య బ్యాటింగ్ మొదలయ్యిందంటే చాలు స్కోరుబోర్డు పరుగులెత్తాల్సిందే. ప్రత్యర్థిజట్ల బౌలర్ల వెన్నులో వణుకు పుట్టాల్సిందే. ఫ్రంట్.. బ్యాక్.. లెఫ్ట్.. రైట్ అన్నతేడానే లేదు. గ్రౌండ్ నలుమూలలకూ అలవోకగా ఫోర్లు, సిక్సర్లు వెల్లువెత్తాల్సిందే. ప్రస్తుత సీజన్ ఐపీఎల్ గత ఏడు ఇన్నింగ్స్‌లో సూర్య స్కోర్లు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. నాలుగు హాఫ్ సెంచరీలు, ఓ సెంచరీతో సహా 12 ఇన్నింగ్స్ లో 479 పరుగులతో పర్పుల్ క్యాప్ రేస్ మూడోస్థానంలో కొనసాగు తున్నాడు.

రౌండ్ రాబిన్ లీగ్ చివరి రెండురౌండ్ల మ్యాచ్‌ల్లో హైదరాబాద్ సన్ రైజర్స్, లక్నో సూపర్ జెయింట్స్‌తో ముంబై ఆడే మ్యాచ్ ల్లో సూర్యకుమార్ మరెంతగా రెచ్చిపోతాడో వేచిచూడాల్సిందే. భారత క్రికెట్ అంటే ఓ గవాస్కర్, ఓ కపిల్ దేవ్, ఓ సచిన్, ఓ ధోనీ, ఓ విరాట్ కోహ్లీ మాత్రమే కాదు.. ఓ సూర్యకుమార్ యాదవ్ కూడా. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# పత్రికా రచయితలు నిజాలే రాయాలి!

సాహితీ సుధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర నారద జయంతి పురస్కారోత్సవాన్ని ఆర్. ఎస్. ఎస్. ప్రచార విభాగం మే 11న విజయ వాడలో నిర్వహించింది. సిద్ధార్థ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో జరిగిన ఈ ఉత్సవంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే ఇద్దరు జర్నలిస్టులకు, ఒక ఫోటో గ్రాఫర్, ఒక కార్టూనిస్ట్‌కి జాగృతి వారపత్రిక పూర్వసంపాదకులు వడ్లమూడి రామ్మోహనరావు స్మారక అవార్డులను అందించారు.

గత 16 సంవత్సరాలుగా నారద జయంతిని జర్నలిస్టు దినోత్సవంగా ఆర్ఎస్ఎస్ ఆంధ్ర ప్రాంత ప్రచార విభాగం నిర్వహిస్తున్నది. పత్రికా రంగంలో పనిచేస్తూ నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, నిర్భయంగా వాస్తవాలను అందిస్తున్న జర్నలిస్టులను గౌరవించి సత్కరించాలన్నది నారద జయంతి (జర్నలిస్ట్ డే) పురస్కారాల లక్ష్యం.

ఆర్ఎస్ఎస్ గురించి వాస్తవాలు తెలుసు కోకుండా కట్టుకథలు అల్లి ప్రచారంలోకి తీసుకు రావడం కొన్ని మీడియా సంస్థలకు రివాజుగా మారిందని ఉత్సవానికి ముఖ్యవక్తగా వచ్చిన ఆంధ్ర ప్రాంత ప్రచార ప్రముఖ్ భయ్యా వాసు అన్నారు. ఆర్ఎస్ఎస్ గురించి నిజాలు తెలుసుకోవాలని అనుకుంటే ఆ సంస్థతో దగ్గరగా మసలటం అవసరం అని మీడియా మిత్రులకు వివరించారు. జాతీయ వాదం ప్రజలలోకి తీసుకువెళ్లడంలో సహకరించ వలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ పారిశ్రామిక వేత్త పి.రవికుమార్ నారద జయంతి ఉత్సవం గురించి తనకు తెలియ చెప్పినందుకు సాహితీ సుధా ఫౌండేషన్‌కు ధన్యవాదాలు చెప్పి భవిష్యత్తులో సాహితీ సుధ, ప్రచార విభాగం నిర్వహించే కార్య క్రమాలకు తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు.

నారదుడు లోక కల్యాణం కోసం వార్తలను అత్యంత వేగంగా చేర్చిన వైనం వివరించి ఆయన ప్రపంచంలో తొలి మీడియా మనిషి అనీ, అన్ని యుగాలలో సముచిత సమాచార వాహకుని పాత్ర పోషించిన నారదుడి జయంతిని జర్నలిస్టుల దినోత్సవంగా జరుపుతున్నామని సభా నిర్వాహకులు, కాలమిస్ట్ డాక్టర్ దుగ్గరాజు శ్రీనివాసరావు వివరిం చారు. సాహితీ సుధా ఫౌండేషన్ ఉత్తమ జర్నలిస్టుల ఎంపిక కమిటీలో సభ్యుడు, అంతర్జాతీయ అవార్డుల విజేత ఫోటోగ్రాఫర్ డాక్టర్ టి శ్రీనివాసరెడ్డి తాము సంవత్సరకాలంలో మీడియా కథనాలను అధ్యయనం చేసి ఉత్తమ పాత్రికేయుడు, ఫోటోగ్రాఫర్‌ని గుర్తిం చేందుకు పెట్టుకున్న నియమనిబంధనలను వివరిం చారు. నారద జయంతి పురస్కారాలను పత్రికారంగం నుండి దీక్షితుల సుబ్రహ్మణ్యం (హన్స్ ఇండియా, రాజమహేంద్రవరం), టీవీ రంగం నుండి రిహానా (ఎన్‌టీవీ రిపోర్టర్,విజయవాడ), ఉత్తమ ఫోటో గ్రాఫర్‌గా రియాజుద్దీన్ (సాక్షి, ఏలూరు), ఉత్తమ కార్టూనిస్టుగా నాగిశెట్టి వెంకటరమణమూర్తి (విజయవాడ)లకు వడ్లమూడి రామ్మోహనరావు పుర స్కారాలను అందించారు. సాహితీ సుధా ఫౌండేషన్ డైరెక్టర్ పవన్, జాగృతి పూర్వసంపాదకులు వడ్డి విజయసారథి, పీఐబీ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ యమ్. వి. యస్. ప్రసాద్, పురప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ★






సభలో ప్రసంగిస్తున్న డా. దుగ్గరాజు, హాజరైన ప్రముఖులు

# మదనపల్లెలో పోస్ట్‌మెన్‌లకు సన్మానం







**మదనపల్లె:** మాధవసేవాసమితి, జాగృతి వారపత్రిక ఆధ్వర్యంలో మే 11,2023న మదనపల్లెలో పోస్ట్‌మెన్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. హెడ్ పోస్టాఫీస్ పోస్ట్‌మాస్టర్ వెంకటరమణ, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు విష్ణుచరణ్, స్టేట్ బ్యాంక్ విశ్రాంత అధికారి మంగపతి, అన్నమయ్య జిల్లా సంపర్క ప్రముఖ్ కరణం జనార్దనం, నగర ప్రచార ప్రముఖ్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు. జాగృతి ప్రాముఖ్యం గురించి విష్ణుచరణ్ సోదాహరణగా వివరించారు. పోస్టల్ సిబ్బందిని శాలువతో సత్కరించి చిరు కానుకను అందజేశారు. తమను సత్కరించినందుకు పోస్టల్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేసింది. ★

# 'వందేభారత్'లో బోగీల సంఖ్య పెరిగిందోచ్!

సికింద్రాబాద్-తిరుపతి స్టేషన్ల మధ్య ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దీంతో ఈ రైలులో అదనపు బోగీలు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 8 బోగీలు, 530 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ బోగీలను 16కు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం, రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకున్నాయి. దీంతో మొత్తం 1,128 సీట్లు అందుబాటులోకి వచ్చినట్లు దక్షిణ మధ్య రైల్వే జోనల్ అధికారులు తెలిపారు. అంతేకాదు, ఈ రైలు ప్రయాణ సయయం 8.30 గంటలు కాగా..



దీనిని 15 నిమిషాలు తగ్గించారు. దీంతో 8.15 గంటలకే ఈ రెండు స్టేషన్ల మధ్య రాకపోకలు కొనసాగించనున్నట్లు తెలిపారు. వేసవి సమయంలో తిరుపతికి వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ రైలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 131 నుంచి 138 శాతం వరకు ప్రయాణికులు పెరిగారని రైల్వే అధికారులు అధికారికంగా ధ్రువీకరించారు. ★

# బరువు తగ్గకపోతే పోలీసులకు రిటైర్మెంటేనట!

అసోం పోలీస్ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. తాగుడికి బానిసై.. ఊబకాయం కలిగిఉండి, వ్యక్తిగత నేరారోపణ ఎదుర్కొంటున్న పోలీసులు పదవీ విరమణ తీసుకోవచ్చని ప్రకటించింది. వాళ్లు రిటైర్ అయ్యాక కూడా నెల నెలా జీతం ఇస్తామని ప్రకటించింది. ఇలాంటి వారు దాదాపు 650కి



పైగా ఉన్నట్లు గుర్తించామనితెలిపింది. ఈ విషయంపై అసోం డీజీపీ జీపీసింగ్ కూడా స్పందించారు.ఐపీఎస్, ఏపీఎస్ అధికారులతో పాటు ఇతర పోలీస్ అధికారులు బరువు తగ్గించుకుని ఫిట్‌నెస్‌ను మెయింటెన్ చేయాలని సూచించారు. ఊబకాయం కలిగిఉన్న పోలీసులకు మూడు నెలల పాటు, అంటే ఆగస్టు 15 వరకు సమయం ఇస్తున్నామని ఆ తర్వాత 15 రోజులకు శరీర ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహిస్తా మని తెలిపారు. అందులో అన్‌ఫిట్ అని తేలితే స్వచ్ఛంద పదవీ విరమణ కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎవరికైనా హైపోథైరాయిడిజమ్ వంటి అనారోగ్య సమస్యలు ఉంటే మాత్రం మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ★



# కొత్త పార్లమెంట్ భవనంలో ప్రత్యేకతలెన్నో!

ఆధునిక భారతదేశ వైభవానికి ప్రతీకగా నిర్మిస్తున్న పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి వేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. నిర్మాణ పనులు దాదాపు పూర్తి అయినట్లేనని చెబుతున్నారు. ఇందులో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం!

ఈ పార్లమెంట్ హౌస్ నాలుగు అంతస్తులతో ఉంటుంది. ఇందులో 1224 మంది ఎంపీలకు సీటింగ్ ఏర్పాట్లు చేశారు. గతంలో కంటే భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. సువిశాలమైన భవనంలో అనేక ఆధునిక సౌకర్యాలు, ఫీచర్లు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఇందులో పెద్ద పెద్ద హాళ్లు, సీటింగ్ లాంజెస్.. ఇలా ప్రతిదీ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. జాతీయ పుష్పం ఆకృతిలో రూపొందించిన రాజ్యసభ హాలు 384 సీట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

పార్లమెంట్ సజావుగా సాగేందుకు కొత్త, పాత భవనాలు సమష్టిగా పనిచేస్తాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. హై టెక్నాలజీతో రూపొందించిన ఇతర కార్యాలయాలు అద్భుతంగా కనిపిస్తున్నాయి. ఈ భవనాన్ని టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ నిర్మిస్తోంది. ★

# వివేకానంద ఆసుపత్రి బ్రోచర్ ఆవిష్కరణ



విశాఖపట్నంలో నిర్మిస్తున్న వివేకానంద ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలలకు సంబంధించిన బ్రోచర్‌ను మే 8,2023న ఆర్‌ఎస్‌ఎస్ సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబళె ఆవిష్కరించారు. విశాఖ నగరంలో జరిగిన సంఘ శిక్షావర్గలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సహక్షేత్రప్రచారక్ భరత్, ప్రాంత ప్రచారక్ విజయాదిత్య ఉన్నారు. ★

తెలుసుకుందాం

# అమరలింగేశ్వరస్వామి ఆలయం - దైద



గుంటూరు జిల్లా, గురజాల నుంచి 12 కిలో మీటర్ల దూరంలో గల దైద నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఈ శైవ క్షేత్రం కొలువుదీరింది. అమరలింగేశ్వరుడు ఆలయం ఉత్తరవాహినిగా ప్రవహించే కృష్ణానది ఒడ్డున ప్రకృతి సిద్ధమైన బిలంలో కొలువై ఉన్నాడు. కార్తికమాసంలో ఇక్కడ భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.

## కథ | పిరికివాడికి సరైన శిక్ష!

అనగనగా ఒక రాజు. ఆ రాజుకు ఇద్దరు కొడుకులు.

పెద్దవాడు ధైర్యవంతుడు. రెండోవాడు పిరికివాడు, మొండివాడు.

ఒకనాడు రెండోవాడు తన తండ్రిని 'గొప్ప గొప్ప రాజభవనాల్లో రహస్య మార్గాలుంటాయట. మన భవనంలో కూడా ఉన్నాయా నాన్నగారు?' అని అడిగాడు.

చాలా ఉన్నాయన్నాడు తండ్రి. వాటిని చూస్తానన్నాడు కొడుకు.

'అవి నాకూ, మంత్రిగారికి తప్ప వేరే ఎవరికి తెలియరాదు. అయినా వాటితో నీకు ఇప్పుడేమి అవసరం వచ్చింది?' అని తండ్రి అడిగాడు.

'శత్రువులు మనపైకి వచ్చారనుకోండి, నేను ఎవరి సహాయమూ లేకుండా తప్పించుకుపోవాలి కదా' అన్నాడు కొడుకు.

రాజు వెంటనే లేచివెళ్లి కొడుకుకు ఒక



## పద్యం



**సిరిగల వాని కెయ్యెడల చేసిన మేలది నిష్ఫలం బగున్**
**నెఱి గుఱిగాదు పేదలకు నేర్పున చేసిన సత్ఫలంబగున్**
**వఱపున వచ్చి మేఘు డొక వర్షము వాడినచేలమీదటన్**
**కురిసిన గాక అంబుధుల కుర్వగ నేమి ఫలంబు భాస్కరా!**

**భావం :** ధనవంతునికి చేసే మేలు వ్యర్థం. పేదవానికి చేస్తే ప్రయోజనం కలుగుతుంది. వానలు లేనప్పుడు ఎండిపోతూ ఉన్న చేల మీద మేఘుడు వాన కురిపిస్తే ఫలితం ఉంటుంది కానీ, సముద్రం మీద కురిస్తే ప్రయోజనం ఉండదు కదా!

## శ్లోకం

**హస్తస్య భూషణం దానం, సత్యం కంఠస్య భూషణం।**
**శ్రోత్రస్య భూషణం శాస్త్రం, భూషణే కిం ప్రయోజనమ్॥**

**భావం :** చేతికి దానమే అలంకారం. కంఠానికి సత్యమే భూషణం. చెవులకు శాస్త్రజ్ఞానమే ఆభరణం. అలాంటప్పుడు ఇతర నగలు ఎందుకు?

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| శిల్పకారుడు | కలం |
| పెయింటర్ | నాగలి |
| రచయిత | స్టెతస్కోప్ |
| రైతు | ఉలి |
| డాక్టర్ | బ్రష్ |

జవాబులు : శిల్పకారుడు–ఉలి, పెయింటర్–బ్రష్, రచయిత–కలం, రైతు–నాగలి, డాక్టర్–స్టెతస్కోప్.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### మైలార మహాదేవప్ప




**జూ**న్ 8, 1911న కర్ణాటకలోని హావేరి జిల్లాలో జన్మించారు. బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. తన 18వ ఏటనే మహాత్మా గాంధీతో పాటు దండియాత్రలో పాల్గొన్నాడు. సహాయ నిరాకరణోద్యమంలో చురుగ్గా వ్యవహరించారు. ఏప్రిల్ 1, 1943న బ్రిటిష్ పోలీసుల తూటాలకు బలయ్యాడు.



తలుపు చూపించాడు. దానిని వెనక ఉన్న మెట్లవైపు చూడమన్నాడు.

కొడుకు ఆ మెట్లు దిగి లోపలికి వెళ్లాడు.

వెంటనే రాజు తలుపులు వేసేశాడు.

కొంతసేపటికి రాజు కొడుకు వచ్చి తలుపు తట్టాడు.

'నీలాంటి పిరికివాడు కోటలో ఉండకూడదు. ఆ మార్గాన్నే పోతే పొరుగు రాజ్యం చేరుతావు. అక్కడే బతుకు. నీ ముఖం నాకు తిరిగి చూపించకు!' అన్నాడు రాజు. ★

## జనరల్ నాలెడ్జ్

1. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత గవర్నర్ ఎవరు?
2. ప్రముఖ వేసవి విడిది కేంద్రం ముస్సోరి ఏ రాష్ట్రంలో ఉంది?
3. ఐజ్వాల్ నగరం ఏ ఈశాన్య రాష్ట్రానికి రాజధాని?

జవాబులు : 1. శక్తికాంత దాస్; 2. ఉత్తరాఖండ్; 3. మిజోరం

## మెదడుకు మేత

కదలలేడు,
కానీ కావలికి
గట్టివాడు?

జవాబు : తాళం

## మంచిమాట

**ఇతరుల తప్పుల్ని వెతకడంలోనే నిరంతరం మునిగితేలేవారు తమలోని లోపాలను గుర్తించలేరు.**



# వారఫలాలు

**22-28 మే 2023**

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

అనుకున్న కార్యక్రమాలను కొంత జాప్యంతో పూర్తి చేస్తారు. ఆత్మీయులు, శ్రేయోభిలాషులు మీకు సహాయంగా నిలిచి ఆస్తుల వివాదాల పరిష్కారంలో చొరవ చూపుతారు. గతంలో చేజారిన కొన్ని పత్రాలు తిరిగి లభ్యమవుతాయి. విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వస్తుంది. వ్యాపారులు మరింతగా లాభాలు గడిస్తారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు విదేశీ పర్యటనలు జరుపుతారు. రచయితలకు శుభవార్తలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

మొదట్లో సమస్యలు ఎదురైనా క్రమేపీ అధిగమించి ముందుకు సాగుతారు. పరిస్థితులు చక్కబడతాయి. ఆత్మీయుల నుంచి కీలక సందేశం అందుతుంది. సాహిత్య, సంగీతాలపై ఆసక్తి చూపుతారు. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. ఇంటి నిర్మాణాలపై ప్రణాళిక రూపొందిస్తారు. ఉద్యోగస్తులకు ఉన్నత పోస్టులు. రాజకీయవేత్తలు, కళాకారులు పరిశోధకులకు అనుకూల వాతావరణం. ఆంజనేయ దండకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

చిత్రవిచిత్రమైన రీతిలో కొన్ని వ్యవహారాలు పూర్తవుతాయి. ఆదాయం కొంత తగ్గినా అవసరాలు తీరతాయి. ఆస్తి ఒప్పందాలలో ఆటంకాలు తొలగుతాయి. పోటీపరీక్షల్లో విద్యార్థులకు విజయం. వ్యాపారస్తులకు నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు సమస్యల నుంచి విముక్తి. పారిశ్రామికవేత్తలు, రచయితలు, పరిశోధకులు అనుకున్న విజయాలు సాధిస్తారు. అంగారక స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కొత్త వ్యక్తుల పరిచయం. శుభవార్తా శ్రవణం. బంధువులు,స్నేహితులతో వివాదాలు సర్దుబాటు చేసుకుంటారు. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు. ఆదాయం పెరిగి అవసరాలు తీరతాయి. అయితే ఆర్థికపరమైన హామీల విషయంలో తొందరపాటువద్దు. ఉద్యోగస్తులు విధుల్లో సమర్థతను చాటుకుంటారు. రాజకీయవేత్తలు, పరిశోధకులకు అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఈశ్వరారాధన మంచిది.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

చేపట్టిన కార్యక్రమాలను కొంత శ్రమానంతరం పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి పిలుపు రావచ్చు. ఆలోచనలు తక్షణం అమలు చేస్తారు. నేర్పరితనంతో శత్రువులను ఆకట్టుకుంటారు. కొన్ని వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యాపారస్తులకు ఈతిబాధలు తొలగుతాయి. ఉద్యోగులు ప్రమోషన్లు పొందుతారు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు మరింత గుర్తింపు లభిస్తుంది. ఆదిత్య హృదయం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో అధిగమిస్తారు. విమర్శలను దీటుగా ఎదుర్కొంటారు. ప్రత్యర్థులను సైతం ఆకట్టుకుంటారు. ఆదాయం క్రమేపీ మెరుగుపడుతుంది. విద్యార్థులకు అనుకూల ఫలితాలు రావచ్చు. ఉద్యోగస్తులకు ఉన్నత పోస్టులు లభిస్తాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు శుభవార్తలు. తీర్థయాత్రలు. కనకధారాస్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**


ఆదాయం కొంత పెరుగుతుంది. చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. ఆప్తుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. నిరుద్యోగులకు లక్ష్యం నెరవేరుతుంది. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. మీ మనస్సు లోని భావాలను నిర్మొహమాటంగా వెల్లడిస్తారు. వ్యాపారులు మొదట్లో నిరాశ చెందినా క్రమేపీ లాభపడతారు. దేవీస్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఏ కార్యక్రమం చేపట్టినా ముందుకు సాగదు. ఆలోచనలు స్థిరంగా ఉండక గందరగోళం చెందుతారు. ఆప్తులతో సైతం వివాదాలు నెలకొంటాయి. కుటుంబ బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఇంటి నిర్మాణాలలో అవరోధాలు. కష్టపడ్డా ఫలితం కనిపించదు. నిర్ణయాలలో కొన్ని పొరపాట్లు దొర్లవచ్చు.వ్యాపారులకు స్వల్పంగానే లాభాలు దక్కవచ్చు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

పట్టినపట్టు వీడరు. ఎటువంటి కార్యక్రమం




సింహంభట్ల సుబ్బారావు
6300674054


చేపట్టినా విజయమే. మీపై వచ్చిన అభాండాలు తొలగుతాయి. మీ సచ్ఛీలత, నైపుణ్యతను అందరూ గుర్తిస్తారు. కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంటారు. వ్యాపారులు లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు విధి నిర్వహణ ప్రశాంతంగా సాగుతుంది. కుటుంబ, ఆరోగ్య సమస్యలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలు సాఫీగా కొనసాగుతాయి. రాబడికి లోటు ఉండదు. బాకీలు సైతం వసూలవుతాయి. ఆస్తుల వివాదాలు కొలిక్కి తెస్తారు. నిరుద్యోగుల దీర్ఘకాలిక నిరీక్షణ ఫలిస్తుంది. వ్యాపారస్తులకు లాభాలు అందుతాయి. ఉద్యోగస్తులు కోరుకున్న మార్పులు పొందుతారు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు ఆహ్వానాలు రాగలవు. కుటుంబంలో సమస్యలు. శివాష్టకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆత్మీయులు, బంధువులతో విభేదాలు తొలగుతాయి. ఆలోచనలు అమలులో ఆటంకాలు అధిగమిస్తారు. నూతన విద్యావకాశాలు దక్కవచ్చు. వ్యాపారస్తులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులు మరింత గుర్తింపు పొందుతారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, పరిశోధకులు సత్తా చాటుకుంటారు. శారీరక రుగ్మతలు. పంచాక్షరి పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

పరిచయాలు మరింత పెరుగుతాయి. ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. సన్నిహితుల సలహాలు స్వీకరిస్తారు. మీలో దాగిన నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. గతంలో చేజారిన కొన్ని వస్తువులు తిరిగి లభ్యమయ్యే అవకాశం. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగులకు పోస్టులు పెరుగుతాయి. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. అనారోగ్యం. దూరప్రయాణాలు. దత్తాత్రేయస్తోత్రాలు పఠించండి.

# పదరసం-416

## ఆధారాలు

అడ్డం

2. దీనికి అంతు ఉండాలట (2)
3. 'నువ్వు ఎక్కబోయే రైలు జీవితకాలం లేటు'అన్న కవి (3)
6. దంపతులు...ఒక రాశి (3)
7. చాటింపు...ప్రకటన (3)
9. మర్కటం... (2)
11. రాజు కాని రాజు..అటు నుంచి (3)
13. రాజు పత్ని (2)
15. సుగంధ ద్రవ్య మొగ్గ (3)
17. సౌధం...ఇంటి మీద ఇల్లు (2)
20. కరిని బాధించి హతమైంది (4)
22. సగంలో సగం (2)
23. గత ఏడాది (3)
25. కింది లోకాలలో ఒకటి (3)
26. నూనుగు కూర దుంప (2)
27. కర్ణుడి పెంపుడు తల్లి (2)
28. ఇహం కాదు...మోక్షం )2)
29. పరిమళం...ఇది ఉంటేనే పూవుకు విలువ (2)
30. చిన్న సోదరి (2)

నిలువు

1. గంటలో అరవయ్యో వంతు (3)
2. సంతోషమే....(2)
3. ఒట్టు...శపథం (2)
4. విత్తం...ధనం (2)
5. తెలంగాణ రాష్ట్ర పక్షి (4)
8. 13 అడ్డం పతి (2)
10. చేయి....
12. శీర్షం...(2)
13. దేశ/రాష్ట్ర ముఖ్య పట్టణం (4)
14. కుడి కాదు...దూరం (3)
16. శతం...(2)
18. భూమి...వెల (2)
19. కృష్ణశాస్త్రి ఇంటిపేరు (5)
21. మిగిలిన..చివర (3)
22. కొత్త కాదులెండి (2)
24. రక్తం... (3)
25. అమృతం (2)
26. కాకర రుచి (2)
27. అశ్వత్థ వృక్షం (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ✠ | 2 | | ✠ | 3 | | 4 | ✠ | 5 |
| 6 | | | ✠ | ✠ | | ✠ | | ✠ | |
| | ✠ | 7 | | 8 | ✠ | ✠ | ✠ | 9 | |
| ✠ | 10 | ✠ | ✠ | 11 | | 12 | ✠ | ✠ | |
| 13 | | ✠ | 14 | ✠ | ✠ | 15 | 16 | | ✠ |
| | ✠ | 17 | | ✠ | 18 | ✠ | | ✠ | 19 |
| | ✠ | ✠ | 20 | 21 | | | ✠ | 22 | |
| 23 | 24 | | ✠ | | ✠ | ✠ | 25 | | |
| ✠ | | ✠ | 26 | | ✠ | 27 | | ✠ | |
| 28 | | ✠ | | ✠ | 29 | | ✠ | 30 | |

పదరసం - 416

పేరు : ........................................................................................

చిరునామా:........................................................................................

........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 జూన్ 5 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 412 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 అ | ని | 2 శం | ✠ | 3 అ | ల | ✠ | 4 క | వా | 5 తు |
| మృ | ✠ | 6 క | ద్రు | వ | ✠ | 7 చీ | ల | ✠ | షా |
| తం | ✠ | రు | ✠ | 8 ని | 9 గ | మ | శ | ✠ | రం |
| ✠ | 10 ఇ | డు | 11 ము | ✠ | డ | ✠ | 12 ము | 13 ఖం | ✠ |
| 14 క | ల్ల | ✠ | 15 ర | 16 మా | వ | 17 తి | ✠ | 18 డం | 19 టం |
| 20 వి | రి | 21 వి | ✠ | ద్రి | ✠ | థి | ✠ | ✠ | డి |
| ✠ | 22 కం | ద | 23 కం | ✠ | ✠ | ✠ | 24 వా | 25 ర | ✠ |
| 26 జా | ✠ | 27 ర | జ | ✠ | 28 కం | 29 చం | ✠ | 30 వి | 31 ధి |
| 32 న | 33 గ | ✠ | 34 ర | 35 మ | ✠ | 36 దా | 37 వా | ✠ | ష |
| 38 కి | డి | కి | ✠ | 39 తి | ష్ఠ | ✠ | 40 క | రు | ణ |

**విజేతలు :** డా. బి. ధన్వంతరి, ఆర్.అంజనీ దేవి, కె. విశ్వప్రసాద్, నర్సింహాచారి, పులికంటి రాజేశ్వరరావు, నాగుల రాజేందర్‌గౌడ్, ఎన్.రాజ్యలక్ష్మి, పి.కామేశ్వరి, వి.అరుంధతి, కవిత తంజావూరు, రాయపెద్ది అప్పాశేష శాస్త్రి, కె.వి.ఎస్.ఎన్. గణేశ్‌కుమార్, తంగెళ్లపల్లి మమన్‌బాబు, కొండుపర్తి కాంతామణి, జి.ఆదినారాయణ రెడ్డి, కె.వి.ఎస్.ఎన్.మూర్తి, చింతకుంట్ల జ్యోతి, రుద్రభట్ల సుగుణరాజారాం, వి.పద్మారంగనాథ్, వనమాల రామ లింగాచారి, టి.రేవతి, ఎం. సుధాకరశర్మ, మత్స్యరాజు విజయలక్ష్మి, ఆర్.వి.సి.హెచ్.నాగేశ్వరరావు

**ఈ వారం విజేత : భమిడి సత్యనాగరాజు, విశాఖపట్నం**

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, **3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**




# భిన్నమైన కథ, కథనాలతో గూఢచారి చిత్రాలు!

అరుణ

తెలుగులో ఒకప్పుడు గూఢచారి చిత్రాలు అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు సూపర్ స్టార్ కృష్ణదే! అది సక్సెస్‌ఫుల్ ఫార్ములా అనే విషయం తెలిసిన ఇతర హీరోలు సైతం గూఢచారి పాత్రలు పోషించి, ప్రేక్షకుల మెప్పు పొందారు. చిత్రం ఏమంటే... ఇప్పుడు బాలీవుడ్‌లో యశ్‌రాజ్ ఫిలిమ్స్ లాంటి ప్రముఖ నిర్మాణ సంస్థలు స్పై మూవీస్‌ను వివిధ కథానాయకు లతో, దర్శకులతో తెరకెక్కిస్తున్నాయి. తెలుగులోనూ వివిధ నిర్మాణ సంస్థలు పేరున్న హీరోలతో స్పై అడ్వంచరస్ మూవీస్‌ను భారీ స్థాయిలో నిర్మిస్తు న్నాయి. సహజంగా గూఢచారి చిత్రాలలోని ఫార్ములా స్టోరీలకు భిన్నంగా వైవిధ్యమైన కథాంశాలతో తెలుగు స్పై మూవీస్ తెరకెక్కు తుండటం విశేషం.















### నిఖిల్ రూట్.. సపరేట్!

నిఖిల్ పాన్ ఇండియా స్టార్‌గా ఎదుగుతాడని అతని తొలి చిత్రం 'హ్యాపీడేస్' విడుదలైనప్పుడు ఎవ్వరూ ఊహించి ఉండరు. అయితే, పట్టుదల, క్రమశిక్షణ, వృత్తిపట్ల అంకితభావంతో నిఖిల్ ఇవాళ ఈ స్థాయికి చేరుకున్నాడు. 'కార్తికేయ-2'తో ఒక్కసారిగా పాన్ ఇండియా స్టేటస్‌ను అందుకున్న నిఖిల్ దాన్ని నిలబెట్టుకునేలా సినిమాలు చేస్తున్నాడు. అలా అతను చేస్తున్న సినిమానే 'స్పై'. నిజానికి గూఢచారి కథలతో తెలుగులో చాలానే సినిమాలు వచ్చాయి, వస్తున్నాయి. వాటన్నింటి కంటే భిన్నంగా 'స్పై' కథాంశం ఉండబోతోంది. ఈ దేశానికి స్వాతంత్ర్యం తీసుకోరావడం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన గొప్ప పోరాటయోధుడు సుభాష్ చంద్రబోస్. ఆయన మరణం ఇప్పటికీ మిస్టరీగానే ఉండి పోయింది. దానిని ఛేదించే గూఢచారిగా 'స్పై' మూవీలో నిఖిల్ నటిస్తున్నాడు. ఎడిటర్ బి.హెచ్. గ్యారీ ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. నేతాజీ మరణంలోని చీకటి కోణాలను ఈ సినిమా బృందం వెలికి తీయగలిగితే... దీనికి దేశవ్యాప్తంగా ఉన్న సుభాష్ అభిమానులు బ్రహ్మరథం పట్టడం ఖాయం. జూన్ 29వ తేదీ పాన్ ఇండియా మూవీగా 'స్పై' వివిధ భాషల్లో రిలీజ్ కానుంది.

### 'డెవిల్' గా రాబోతున్న కళ్యాణ్ రామ్

గత యేడాది 'బింబిసార' చిత్రంతో ప్రేక్షకుల మెప్పు పొందిన నందమూరి కళ్యాణ్ రామ్‌ను ఈ యేడాది ప్రారంభంలో విడుదలైన 'అమిగోస్' నిరాశ పరిచింది. అయితే ఈ సినిమా కంటే ముందే కళ్యాణ్ రామ్ 'డెవిల్' అనే సినిమాకు కమిట్ అయ్యాడు. నవీన్ మేడారం దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. 'డెవిల్' మూవీకి ట్యాగ్ లైన్ 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్'. ఈ సినిమా కథాంశం ఏమిటనేది ఈ ట్యాగ్ లైన్‌లోనే ఉంది. దీనికి సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్ని సమకూర్చు తున్నారు. కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ శ్రీకాంత్ విస్సా అందిస్తుండటం విశేషం.

### బ్రాండ్ అంబాసిడర్ అడివి శేష్

అడివి శేష్ ఇప్పుడు టాలీవుడ్‌లో స్పై అడ్వంచరస్ మూవీకి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిపోయాడు. అతను నటించిన 'క్షణం, గూఢచారి, ఎవరు' సినిమాలే అందుకు కారణం. ఇప్పుడు 'గూఢచారి'కి సీక్వెల్ గా 'జీ-2' మూవీని చేస్తున్నాడు. 'గూఢచారి' కథను ఇండియాలో సెట్ చేయగా, 'జి-2' ఇంటర్ నేషనల్‌గా ఉండబోతోంది. ఈ చిత్రానికి కథను శేష్ స్వయంగా అందించారు. ఎడిటర్ వినయ్ కుమార్ సిరిగినీడి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. "ది కాశ్మీర్ ఫైల్స్, కార్తికేయ-2, మేజర్" వంటి ఆల్ ఇండియా హిట్‌లను అందించిన టి.జి.విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

### విడి12 పోస్టర్‌తో వివాదం!

ఇటీవల విడుదలైన విజయ్ దేవరకొండ తాజా చిత్రం 'విడి 12' పోస్టర్ చర్చనీయాంశంగా మారి పోయింది. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్ టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ ఎంటర్ టైన్‌మెంట్స్ కలిసి అతనితో ఓ స్పై యాక్షన్ మూవీని ప్రారంభిం చాయి. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తు న్నాడు. విజయ్ దేవరకొండ బర్త్ డే సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ పదేళ్ల క్రితం వచ్చిన హాలీవుడ్ మూవీ 'ఆర్గో'ను గుర్తు చేస్తోందని నెటిజన్లు ఆరోపించారు. చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ వివరణ ఇవ్వడంతో ఈ చర్చ కాస్తంత సద్దుమణి గింది. గత కొంత కాలంగా మంచి విజయం కోసం ఎదురుచూస్తున్న విజయ్ దేవరకొండ 'ఖుషీ'తో పాటు చేస్తున్న ఈ స్పై యాక్షన్ మూవీ విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నాడు.

### గన్ పట్టిన 'గాండీవధారి అర్జున'!

లవ్, కామెడీ, యాక్షన్ చిత్రాలు చేస్తున్న వరుణ్ తేజ్ సైతం తాజాగా గూఢచారి చిత్రం చేస్తున్నాడని తెలుస్తోంది. 'గరుడవేగ' ఫేమ్ ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో సీనియర్ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ దీన్ని నిర్మిస్తున్నారు. 'గాండీవధారి అర్జున' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నటిస్తున్నాడని, కథానుగుణంగా పలు యూరోపియన్ కంట్రీస్‌లో యాక్షన్ పార్ట్‌ను చిత్రీకరించారని తెలుస్తోంది. ఈ సినిమాలతో పాటు యువ నటీనటులతో దర్శకుడు రాజ్ మాదిరాజు 'గ్రే' పేరుతో ఓ స్పై ఫిలిమ్‌ను తెరకెక్కించారు. ఈ నెలాఖరులో విడుదల కాబోతున్న ఈ డిఫరెంట్ కాన్సెప్ట్ బ్లాక్ అండ్ వైట్ స్పై మూవీలో అరవింద్ కృష్ణ, అలీ రెజా, ఊర్వశీ రాజ్, షాని సాల్మోన్, నజియా, సిద్ధార్థ్ కీలక పాత్రలు పోషించారు. మరి వాటిలో ఏవేవి విజయాన్ని సాధిస్తాయో చూడాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్







# నాగరికతా చిహ్నంగా...



ఒడిసా లేదా కళింగ ప్రాంత శిల్ప కళా వైభవం మాటలకు అందేది కాదు. కోణార్క్ సూర్య దేవాలయం, పూరీ జగన్నాథస్వామి వారి ఆలయం ఆ రాష్ట్రంలోనే ఉన్నాయి. భువనేశ్వర్‌లో కపిలేశ్వర శివాలయం ఉంది. దీనిని ఇటీవల జాతీయ ప్రాముఖ్యం కలిగిన పురాతన నాగరికతా చిహ్నంగా ప్రకటించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఈ ప్రకటన చేసింది. ఇక నుంచి ఈ కళా సంపద భారత పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉంటుంది. ఇది ఒడిసాలోని అతి పురాతన దేవాలయాలలో ఒకటి. శివుడినే ఆ రాష్ట్రంలో కపిలేశ్వరుడు పేరుతో పిలుస్తారు. ఇది 14వ శతాబ్దానికి చెందినది. ఇది మొత్తం కళింగ వాస్తు శిల్పంతో నిర్మించారు. ఈ ఆలయ ప్రాంగణంలోనే ఉన్న కపిల కుండం (కొలను)లో స్నానమాచరించడం పవిత్రంగా భావిస్తారు. భారతీయులే కాకుండా, ప్రపంచ పర్యాటకులు కూడా తప్పక వీక్షించే ఈ ఆలయాన్ని హిందూత్వం, భారతీయ శిల్పకళకు ఆలవాలంగా చెప్పుకుంటారు. ప్రఖ్యాత లింగరాజ్ ఆలయం, ముక్తేశ్వర ఆలయం కపిలేశ్వర ఆలయం సమీపంలోనే ఉంటాయి. ముక్తేశ్వర ఆలయ వాస్తు శిల్పం కళింగ శిల్పకళకు నమూనాగా చెబుతారు.





From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 31





స్వాతంత్ర్య
# వీర సావర్కర్
## జయంతి (మే 28)
శుభాకాంక్షలు